www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 341
సోమవారం | 10-3-2025
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి ఏకాదశి ఉ.7.45 తదుపరి ద్వాదశి; నక్షత్రం: పుష్యమి రా.12.51 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: ఉ.8.13-9.53; అమృతఘడియలు: సా.6.12-7.51, దుర్ముహూర్తం: మ.12.49-1.36, మ.3.11-3.58, రాహుకాలం ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.30, సూర్యాస్తమయం: 6.20
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





తీన్‌మార్.. సీటీమార్

- టీమిండియాదే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ
- ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై ఉత్కంఠ విజయం
- మూడోసారి ట్రోఫీని ముద్దాడిన భారత జట్టు
- అర్ధశతకంతో అదరగొట్టిన హిట్ మ్యాన్
- రాణించిన శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్
- అజేయంగా టోర్నీని ముగించిన భారత్

11


హైదరాబాద్‌లోని ఓ మాల్‌లో...

రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ క్రీజులో ఉన్నంతసేపూ విజయంపై ధీమా! గిల్, కోహ్లీ వరుసగా పెవిలియన్ చేరగానే కాస్త నిరాశ! రన్ రేటు తగ్గుతున్నా రోహిత్ ఉన్నాడనే భరోసా! కెప్టెన్ కూడా ఔట్ అవ్వగానే నిర్వేదం! హార్దిక్ సిక్సు, ఫోరూ కొట్టగానే ఆనందం! ఇలా.. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన టైటిల్ పోరులో మనోళ్లే చాంపియన్స్! పుష్కర కాలం తర్వాత భారత్ మరోసారి ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ(సీటీ)ని ముద్దాడింది! మూడోసారి (2003, 2013, 2025) చాంపియన్‌గా నిలిచింది! తొలుత, బంతిని అందుకున్న వెంటనే కుల్దీప్ యాదవ్ న్యూజిలాండ్ వెన్ను విరిచేశాడు. కివీస్ హీరోలు రచిన్ రవీంద్ర, కేన్ విలియమ్సన్‌ను పెవిలియన్ బాట పట్టించాడు. భారత బౌలర్లు కివీస్‌ను 251 పరుగులకే పరిమితం చేశారు. ఆ తర్వాత రోహిత్ శర్మ (76), శ్రేయాస్ అయ్యర్ (48), కేఎల్ రాహుల్ (34) సహకారంతో భారత్ విజయ తీరాలను చేరుకుంది! 2019 ఐసీసీ వన్డే వరల్డ్ కప్ సెమీ ఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకుంది. ఏ ఒక్కరో అద్భుతంగా ఆడడం కాకుండా.. టీమంతా కలిసికట్టుగా రాణించి అందించిన విజయమిది! టాస్‌లు అన్నీ ఓడినా.. మ్యాచ్‌లు అన్నీ గెలవడం ఈ టోర్నీలో మరో విశేషం!!

అభ్యర్థిత్వం అనూహ్యం

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా విజయశాంతి, అద్దంకి, శంకర్‌నాయక్







- ఎమ్మెల్యే కోటా అభ్యర్థులను ప్రకటించిన అధిష్ఠానం
- ఒక సీటు మిత్రపక్షం సీపీఐకి కేటాయింపు
- అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ సామాజిక న్యాయం
- ఎస్సీ, ఎస్టీతోపాటు మహిళకు సీటు కేటాయింపు
- అనూహ్యంగా తెరపైకి రాములమ్మ పేరు
- ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకే అవకాశం!
- అద్దంకి దయాకర్‌కు ఎట్టకేలకు దక్కిన చాన్స్
- శంకర్‌నాయక్‌కు సీనియర్ నేతలందరి మద్దతు
- అంతా సీఎం రేవంత్‌రెడ్డి సూచించిన వారే!
- నేటితో ముగియనున్న నామినేషన్ల గడువు

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3 పార్టీలూ అనూహ్యంగా అభ్యర్థిత్వాలను ప్రకటించాయి! కాంగ్రెస్ తన అభ్యర్థులుగా విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్‌లను ప్రకటించింది! ఇక, ఎప్పటి నుంచో అధ్యక్షా.. అనాలని కోరుకుంటున్న దాసోజు శ్రవణ్‌ను బీఆర్ఎస్ ఎంపిక చేసింది! మిత్రపక్షం సీపీఐకి కాంగ్రెస్ ఇచ్చిన సీటులో నెల్లికంటి సత్యం పేరును ఖరారు చేసింది. ఈసారి విశేషం ఏమిటంటే.. నల్లగొండ జిల్లా జాక్‌పాట్ కొట్టడం! ఆ జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్సీలు కాబోతుండడం..!

12

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్



- బీసీ వర్గానికి చెందిన నేతను ఖరారు చేసిన పార్టీ అధినేత కేసీఆర్

సీపీఐ అభ్యర్థిగా నెల్లికంటి సత్యం



- బలహీన వర్గాల నేతకు అవకాశమిచ్చిన పార్టీ

ఏపీలో ఇద్దరు బీసీలు, ఒక ఎస్సీకి అవకాశం

12

- ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ
- బీటీ నాయుడు, బీద రవిచంద్ర, కావలి గ్రీష్మలకు టికెట్లు ఖరారు
- ఉత్తరాంధ్ర, కోస్తా, సీమలకు సమతూకం

బీసీల గొంతు నులిమే కుట్ర

- వారికి 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా మొగ్గలోనే తుంచేందుకు ప్రయత్నిస్తున్నారు
- కులగణన సర్వేపై దుష్ప్రచారం చేస్తున్నారు
- తప్పులు చూపించమంటే పారిపోతున్నారు
- బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రధాని మోదీ మెడకు చుట్టుకుంటుందని బీజేపీ నేతల భయం
- పద్మశాలీలు ఆత్మగౌరవానికి, త్యాగానికి ప్రతీక
- తెలంగాణ ఉద్యమంలో బాపూజీది కీలకపాత్ర
- ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి ఆయన పేరు
- కొండా చనిపోతే చూసేందుకూ కేసీఆర్ రాలే
- ధృతరాష్ట్ర కౌగిలితో నరేంద్రుని ఖతం చేశారు
- 1.3 కోట్ల చీరల ఆర్డర్లను నేతన్నలకు ఇస్తున్నాం
- మార్కండేయ భవన్‌కు రూ.కోటి సాయం
- అఖిల భారత పద్మశాలి 17వ మహాసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు


పద్మశాలి మహాసభలో మగ్గం నేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/అఫ్జల్‌గంజ్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో తాము కులగణన సర్వే చేపడితే.. ఇది నచ్చనివారు దుష్ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తద్వారా బడుగు, బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు రాకుండా మొగ్గలోనే తుంచేసేందుకు, బీసీల గొంతు నులిమేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్రలను బీసీ సమాజం తిప్పికొట్టాలని

మిగతా 13వ పేజీలో...

రూ. లక్ష లోపు చేనేత రుణాల మాఫీ

13

- 33 కోట్లు మంజూరు చేసిన సర్కార్
- 5,691 మంది నేతన్నలకు లబ్ధి
- 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 దాకా ఉన్న రుణాలు మాఫీ
- 'చేనేత'పై గత సర్కార్ చిన్నచూపు
- మేం గాడిలో పెడుతున్నాం: తుమ్మల

ఫ్యూచర్‌సిటీ వైపు వడివడిగా!

- డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు మంత్రి వర్గ సమావేశంలో పచ్చజెండా
- త్వరలోనే సిబ్బందిని నియమించే చాన్స్
- ఎఫ్‌సీడీఏ పరిధిలో 1.80లక్షల ఎకరాలు
- 74 గ్రామాలు, 2 లక్షలకు పైగా జనాభా
- 15 వేల ఎకరాల్లో స్పెషల్ ఎకనమిక్ జోన్
- 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, మెట్రో రైలు
- రిక్రియేషన్ జోన్ల ఏర్పాటుకు సన్నాహాలు
- ప్రత్యేకంగా పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

రాజధాని హైదరాబాద్ శివార్లలో కొత్తగా నిర్మించతలపెట్టిన ఫ్యూచర్‌సిటీపై ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక అథారిటీ ఏర్పాటుకు ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ ప్రాంతాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎఫ్‌సీడీఏ) పరిధిలోకి

మిగతా 13వ పేజీలో...

హైదరాబాద్ దాహార్తిని తీర్చేలా..!

- గోదారి ఫేజ్-2కు 2 ప్యాకేజీల్లో టెండర్లు
- రూ. 5383 కోట్ల అంచనా వ్యయం

సీఎం నిర్ణయం చరిత్రాత్మకం

- 55 సమీకృత గురుకులాలకు 11 వేల కోట్ల కేటాయింపుపై ఉపముఖ్యమంత్రి భట్టి
- ప్రపంచంతో పోటీ పడేలా సిలబస్ ఉంటుందని వ్యాఖ్య
- నిధుల మంజూరుపై పొంగులేటి, పొన్నం, కోమటిరెడ్డి హర్షం

13

అమెరికా ఉత్పత్తులపై సుంకాల తగ్గింపు!

- వాణిజ్య సంబంధాల బలోపేతానికే ఆ నిర్ణయం.. అధికార వర్గాల వెల్లడి
- గతంలోనూ ఇలాగే కొన్ని దేశాల ఉత్పత్తులపై దిగుమతి సుంకాల తగ్గింపు
- వ్యవసాయ ఉత్పత్తులు మినహా అన్నిటిపైనా తగ్గింపు కోరిన అమెరికా?

2


గురుప్రీత్ సింగ్ (ఫైల్)

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మృతదేహం లభ్యం

- సొరంగంలో 7 లేయర్ల కింద గుర్తింపు
- టీబీఎం ఆపరేటర్‌గా గురుప్రీత్ విధులు
- స్వస్థలం.. పంజాబ్‌లోని చీమాకలాన్
- 25 లక్షల పరిహారం ప్రకటించిన సీఎం
- మిగతా ఏడుగురి కోసం గాలింపు
- మరో 2 ప్రాంతాల్ని గుర్తించిన జాగిలాలు

3

టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల అస్తమయం



- అభినవ అన్నమయ్య బాలకృష్ణ ప్రసాద్ మృతి
- 600కు పైగా అన్నమయ్య కీర్తనలు స్వరపరిచి, వెలుగులోకి

13

కొక్కెర వ్యాధితో 12వేల కోళ్ల మృతి

- పౌల్ట్రీ రైతుకు రూ.20 లక్షల మేర నష్టం
- రంగారెడ్డి జిల్లా నానక్‌నగర్‌లో ఘటన
- మెదక్ జిల్లాలో 3,500 నాటు కోళ్లు..

3

ఒడిశా ఏకాకులానాసి దీవిలో ఆలివ్ రిడ్లీ తాబేలు గుడ్లు




33ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి

కేంద్రపడ, మార్చి 9: ఒడిశాలోని గహిర్మాత సముద్ర జీవుల పరిరక్షణ కేంద్రం పరిధిలో ఉన్న ఏకాకులానాసి దీవిలో ఆలివ్ రిడ్లీ తాబేళ్లు దాదాపు 33 ఏళ్ల తర్వాత గుడ్లు పెట్టాయి. గడిచిన రెండు రోజుల్లో ఈ దీవికి 1.7లక్షల ఆలివ్ రిడ్లీ తాబేళ్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రతీ ఏటా ఒడిశా తీరంలో లక్షల సంఖ్యలో ఆలివ్ రిడ్లీ తాబేళ్లు తరలివచ్చి గుడ్లుపెడతాయి. దీన్నే నెస్టింగ్ అంటారు. తర్వాత 40-50రోజులకు పిల్లలు బయటకు వస్తాయి. అయితే, ఏకాకులానాసి దీవి సముద్రపు కోతకు గురవుతున్న నేపథ్యంలో.. ఆలివ్ రిడ్లీ తాబేళ్లు అక్కడికి రావడం లేదు. చివరిసారి 1992లో 3లక్షల తాబేళ్లు ఇక్కడ గుడ్లు పెట్టినట్లు అధికారులు తెలిపారు. కాగా, అంతరించిపోతున్న తాబేలు జాతుల్లో ఆలివ్ రిడ్లీ తాబేలు ఉంది.

స్వయంగా చేతి రాతతో 100 పేజీల బడ్జెట్

» అసెంబ్లీకి సమర్పించిన ఛత్తీస్‌గఢ్ ఆర్థికమంత్రి





రాయ్‌పూర్, మార్చి 9: ఏఐ చాట్‌బోట్‌తో ఏ పనినైనా చిటికెలో పూర్తిచేస్తున్న ఈ రోజుల్లో ఛత్తీస్‌గడ్ ఆర్థికమంత్రి ఓపీ చౌధరి తన స్వహస్తాలతో 100 పేజీల బడ్జెట్ ప్రతిని రాసి అసెంబ్లీకి సమర్పించారు. ఐఏఎస్ అధికారి అయిన చౌధరి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో 2018లో తన కలెక్టర్ పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. 2023 ఎన్నికల్లో బీజేపీ తరఫున రాయ్‌గడ్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై ఆర్థికమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 100 పేజీలున్న ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్ ప్రతిని తన స్వహస్తాలతో హిందీలో రూపొందించిన ఆయన, మార్చి 4న అసెంబ్లీలో సమర్పించారు. ఈ క్రమంలో బడ్జెట్ సమర్పణకు పది రోజుల ముందు నుంచి తాను రోజుకు కేవలం 2 గంటలు మాత్రమే నిద్రించానని తెలిపారు. కాగా, ఓ ఆర్థికమంత్రి స్వయంగా తన చేతితో రాసిన బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం దేశచరిత్రలో బహుశా ఇదే మొదటిసారి.

లోకం తీరు



సిరియా ఘర్షణల్లో 1113 మంది మృతి

బీరూట్, మార్చి 9: ప్రతీకార హత్యలతో సిరియా దేశం అల్లకల్లోలంగా మారింది. రెండు రోజుల పాటు జరిగిన ఘర్షణల్లో మరణించిన వారి సంఖ్య 1,113కి పెరిగింది. పదవీచ్యుత అధ్యక్షుడు బషర్ అస్సాద్ మద్దతుదార్లు, ప్రభుత్వ భద్రతా దళాల మధ్య గురువారం కాల్పులు ఆరంభమయి శుక్రవారం వరకు కొనసాగాయి. శనివారం కాల్పులు ఆగినప్పటికీ భయానక వాతావరణం మాత్రం తొలగిపోలేదు. బ్రిటన్‌లో ఉన్న సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ అనే సంస్థ అందజేసిన వివరాల ప్రకారం ఈ ఘర్షణల్లో 830 మంది పౌరులు మరణించారు. ఘర్షణల్లో వందలాది మంది భద్రతా సిబ్బంది, మిలిటెంట్లు చనిపోయారు. అస్సాద్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఫైనార్టీలైన అలవైటీలు తమను ఏళ్లతరబడి వేధించినట్లు సున్నీ ముస్లింలు అనుమానిస్తున్నారు. గురువారం సున్నీ ముస్లిం వర్గానికి చెందిన గన్‌మేన్ ఒకరు అలవైటీ తెగ వ్యక్తిని కాల్చి చంపడంతో ఘర్షణలు మొదలయ్యాయి. ఇవన్నీ వ్యక్తిగతదాడులని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రోడ్లు, ఇళ్ల డాబాలపై ఎక్కడికక్కడే శవాలు కనిపిస్తున్నాయి. లటకియా పట్టణానికి విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో తాగునీటి కొరత ఏర్పడింది. అస్సాద్ ప్రభుత్వం చేసిన తప్పులకు తమపై ప్రతీకారం తీర్చుకుంటున్నారని అలవైటీలు వాపోతున్నారు.

మా స్టార్‌లింక్ సేవలు నిలిపేస్తే.. ఉక్రెయిన్ సేనలు కుప్పకూలుతాయి: మస్క్

వాషింగ్టన్, మార్చి 9: అమెరికా వ్యాపారవేత్త ఎలాన్ మస్క్.. ఉక్రెయిన్‌పై మరోసారి మండిపడ్డారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ.. రష్యాతో యుద్ధం శాశ్వతంగా కొనసాగేలా చేస్తున్నారంటూ ఇటీవల విమర్శించిన మస్క్.. తాజాగా తమ స్టార్‌లింక్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తే యుద్ధ క్షేత్రంలో కీవ్ సేనలు కుప్పకూలుతాయని హెచ్చరించారు. ఉక్రెయిన్ ఓటమి అనివార్యమైనప్పటికీ ఏళ్ల తరబడి జరుగుతున్న ఈ మారణకాండ విసుగు తెప్పించిందని 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 2022 ఫిబ్రవరిలో రష్యా దాడితో ఉక్రెయిన్ కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతింది. దీంతో ప్రస్తుతం మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ అక్కడ సేవలందిస్తోంది.

అమెరికాలో ఆలయంపై భారత వ్యతిరేక రాతలు

న్యూయార్క్/న్యూఢిల్లీ, మార్చి 9: అమెరికాలో మరోసారి హిందూ ఆలయంపై దాడి జరిగింది. కాలిఫోర్నియా రాష్ట్రం శాన్ బెర్నార్డినో కౌంటీ చినో హిల్స్ పట్టణంలోని బోచసన్వాసి అక్షర్ పురుషోత్తం స్వామి నారాయణ్ సంస్థ (బాప్స్) శ్రీ స్వామినారాయణ్ మందిరం గోడలపై గుర్తుతెలియని దుండగులు భారత వ్యతిరేక రాతలు (గ్రాఫిటీ) రాశారు. ఆలయ గోడలపై 'హిందూస్ గో బ్యాక్' అనే నినాదాలు రాశారని మీడియా నివేదికలు వెల్లడించాయి. కాలిఫోర్నియాలోని అతిపెద్ద ఆలయంపై శనివారం ఈ దాడి జరిగిందని, దీనిపై దర్యాప్తు చేయాలని ఎఫ్‌బీఐ, దాని డైరెక్టర్ కాశ్ పటేల్‌ను హిందూ అమెరికన్ ఫౌండేషన్ అనే గ్రూపు డిమాండ్ చేసింది. తాజా ఘటనను భారత్ తీవ్రంగా ఖండించింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ డిమాండ్ చేశారు.

న్యూయార్క్‌లో కార్చిచ్చు



న్యూయార్క్, మార్చి 9: న్యూయార్క్‌లోని లాంగ్ ఐలాండ్‌ను కార్చిచ్చు పొగ కమ్మేసింది. దీంతో ఆ ప్రాంతంలోని మిలిటరీ స్థావరాన్ని ఖాళీ చేయడంతోపాటు ప్రధాన రహదారిని మూసివేశారు. కార్చిచ్చు వేగంగా విస్తరిస్తుండటంతో న్యూయార్క్ గవర్నర్ కేతీ హోచుల్ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. న్యూయార్క్ నగరం తూర్పుభాగంలోని పెన్ బారన్స్ ప్రాంతాన్ని అగ్నికీలలు చుట్టుముడుతున్నాయి. కార్చిచ్చుకు కారణమైన 40 ఏళ్ల మహిళ అలగ్జాండ్రా బియాలోసోను అధికారులు అరెస్టు చేశారు. దక్షిణ కరోలినా మైర్టిల్ బీచ్ ప్రాంతంలోని ఆమె ఇంటి వెనుక నుంచే తొలుత మంటలు వ్యాపించాయని, అవి క్రమంగా 2,059 ఎకరాలకు విస్తరించాయని అధికారులు తెలిపారు.

నేటి నుంచే పార్లమెంటు

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు లోక్‌సభ ఆమోదం కోరనున్న అమిత్ షా

» మణిపూర్, వక్ఫ్ బిల్లుపై సర్కారును నిలదీయనున్న ప్రతిపక్షాలు

» నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా సూత్రంపైనా ఆందోళన



న్యూఢిల్లీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు రెండో విడత బడ్జెట్ సమావేశాలు వాడీవేడిగా జరగనున్నాయి. సోమవారం నుంచి ప్రారంభమయ్యే సమావేశాలు రణరంగాన్ని తలపించే అవకాశాలు ఉన్నాయి. అధికార బీజేపీ, ప్రతిపక్ష సభ్యుల మధ్య తొలి రోజు నుంచే వాగ్యుద్ధాలు జరగనున్నాయి. హింసాకాండతో అతలాకుతలమైన మణిపూర్‌లో విధించిన రాష్ట్రపతి పాలనకూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారమే లోక్‌సభ ఆమోదముద్ర కోరనున్నారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మణిపూర్‌కు సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టబోతున్నారు. ఇక ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వక్ఫ్ బిల్లు కూడా ఈ సమావేశాల్లోనే పార్లమెంట్ ముందుకు రానుంది. మణిపూర్‌లో రెండేళ్లుగా జరుగుతున్న హింసను అదుపు చేయలేక.. గత నెలలో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌తో రాజీనామా చేయించి, రాష్ట్రపతి పాలన విధించాల్సి రావడంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మణిపూర్‌లో హింసాకాండ ఆగకపోవడంపై సర్కారును నిలదీయనున్నాయి. మరోవైపు వక్ఫ్ బిల్లును పరిశీలించేందుకు వేసిన సంయుక్త పార్లమెంటు కమిటీ (జేపీసీ)లో తమ అభ్యంతరాలను తిరస్కరించి కేవలం ఎన్డీయే సభ్యుల ఆమోదంతో బిల్లుకు ఆమోదముద్ర వేసినందుకు ప్రతిపక్ష సభ్యులు గత సమావేశాల్లోనే గందరగోళం సృష్టించారు. ప్రతిపక్షాలు ఎంత గొడవ చేసినా సాధ్యమైనంత త్వరలో వక్ఫ్ బిల్లును చట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పార్లమెంట్ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించారు. ఇండియా కూటమి పార్టీలన్నీ వక్ఫ్ బిల్లును వ్యతిరేకించేందుకు వ్యూహ రచన చేస్తాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రకటించారు. సోమవారం రాజ్యసభలో రైల్వే సవరణ బిల్లు, సహకార సంఘాల్లో పనిచేసే వ్యక్తులకు తగిన శిక్షణను అందించేందుకు త్రిభువన్ సహకారీ బిల్లును కూడా ప్రవేశపెట్టనున్నారు. మరోవైపు నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా సూత్రం ద్వారా హిందీని దక్షిణాదిపై రుద్దడం, భారత్‌పై అమెరికా టారిఫ్‌లు విధించడంపై కూడా ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపట్టరాదని డీఎంకే సహా పలు పార్టీలు డిమాండ్ చేయనున్నాయి.

ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌కు అస్వస్థత

ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అస్వస్థతకు గురయ్యారు. శనివారం అర్ధరాత్రి దాటాక ఆయనకు ఛాతీ నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు, వ్యక్తిగత సిబ్బంది హుటాహుటిన ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రికి తలించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ ఆధ్వర్యంలో క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయూ)లో వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఆదివారం ప్రధాని మోదీ ఎయిమ్స్‌కు వెళ్లి ధన్‌ఖడ్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి సమాచారం తెలుసుకున్నారు. ఆ తర్వాత ధన్‌ఖడ్ ఆరోగ్యంగా ఉండాలని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా సైతం ఆస్పత్రికి వెళ్లి ధన్‌ఖడ్‌ను పరామర్శించారు.

ఏకధాటిగా పనిచేస్తే సామర్థ్యం తగ్గుతుంది

శరీరం చెప్పినట్లు విని విశ్రాంతి తీసుకోవాలి

డబ్ల్యూహెచ్‌వో మాజీ చీఫ్ సైంటిస్ట్ సౌమ్య

న్యూఢిల్లీ, మార్చి9: ఏకధాటిగా పనిచేయడం వల్ల సామర్థ్యం తగ్గుతుందని, శరీరం చెప్పింది వింటూ విశ్రాంతి ఎప్పుడు అవసరమో తెలుసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) మాజీ చీఫ్ సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్ సూచించారు. పనిచేయడానికి మానసిక విశ్రాంతి అవసరమన్నారు. ఎన్ని గంటలు పనిచేశామనేది కాదని, నాణ్యత ముఖ్యమని స్వామినాథన్ తేల్చి చెప్పారు. పని గంటలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ ఆమె వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలని ఈ ఏడాది ఆరంభంలో ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ అన్నారు.

47.2 లక్షల మందికి ఆయుష్మాన్ వేవందన కార్డులు

హైదరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ వేవందన కింద ఈ ఏడాది ఫిబ్రవరి 6 వరకు 47.2 లక్షల మంది వయోవృద్ధులు నమోదు చేసుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. గతేడాది అక్టోబరు 29న కేంద్ర ప్రభుత్వం 70 ఏళ్లు పైబడిన వారు తమ సామాజిక, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ఆయుష్మాన్ భారత్‌లో నమోదు చేసుకోవచ్చని, ఏడాదికి రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చని వెల్లడించింది. ఈ ఏడాది జనవరి వరకు 1.10 లక్షల మంది వృద్ధులు ఈ కార్డును డౌన్‌లోడ్ చేసుకుని రూ.202.96 కోట్ల విలువైన వైద్య సేవలు పొందినట్లు పేర్కొంది.

అమెరికా ఉత్పత్తులపై సుంకాల తగ్గింపు నిజమే!

» కానీ అది ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి కాదు

» వాణిజ్య సంబంధాల బలోపేతానికే ఆ నిర్ణయం.. అధికార వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 9: అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న ఉత్పత్తులపై సుంకాలను గణనీయంగా తగ్గించేందుకు భారత్ నిర్ణయించినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. అయితే.. అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్య బంధాలను బలోపేతం చేసుకునేందుకు తీసుకుంటున్న విస్తృత చర్యలో భాగంగానే భారత్ ఈ నిర్ణయం తీసుకుంది తప్ప ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి కాదని ఆ వర్గాలు చెబుతున్నాయి. గతంలో కూడా ఆస్ట్రేలియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, స్విట్జర్లాండ్, నార్వే దేశాల ఉత్పత్తులపై సుంకాలను ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల మేరకు తగ్గించిన విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. యూరోపియన్ యూనియన్, యూకేతో కూడా ఇదేరీతిలో ఒప్పందాలు కుదుర్చుకునేందుకు చర్చలు జరుగుతున్నాయని ఆ వర్గాలు పేర్కొన్నాయి. అమెరికా ఉత్పత్తులపై సుంకాల తగ్గింపు నిర్ణయాన్ని కూడా అదే కోవలో చూడాలని చెబుతున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వ్యవసాయ ఉత్పత్తులపై తప్ప మిగతా అన్ని ఉత్పత్తులపైనా సుంకాలను ఉపసంహరించుకోవాల్సిందిగా భారత్‌ను అమెరికా కోరింది. ఒకవేళ ఇండియా అందుకు అంగీకరిస్తే.. ఎలాంటి ప్రతిఫలమూ లేకుండా భారత్ తనకున్న వాణిజ్య రక్షణలన్నింటినీ వదులుకున్నట్టేననే ఆందోళన వ్యక్తమవుతోంది. ఏప్రిల్ 2 నుంచి భారత్ సహా పలు దేశాలపై పరస్పర సుంకాల విధింపు తథ్యమని ట్రంప్ ఇటీవలే ప్రకటించిన నేపథ్యంలో.. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అమెరికాకు చేరుకుని ఆ దేశ వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్, వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్‌తో చర్చలు జరిపి తిరిగి వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు.. పలు వ్యాపార సంస్థలు కూడా సుంకాల ప్రభావం ఎక్కువగా పడకుండా, వాణిజ్యాన్ని కొనసాగించడానికి అమెరికాలోని తమ వ్యాపార భాగస్వాములతో చర్చలు జరుపుతున్నాయి. 2016-20 నడుమ ట్రంప్ తొలి హయాంలో కూడా ఇరుదేశాల మధ్య పరిమిత వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి చర్చలు జరిగాయిగానీ.. పలు కారణాల వల్ల అవి ఫలించలేదు.

డీలిమిటేషన్, నిర్బంధ హిందీ అమలుపై కేంద్రాన్ని నిలదీయాలి



» బాధిత రాష్ట్రాల ఎంపీలను కలుపుకొని వెళ్లాలి

» డీఎంకే ఎంపీలకు స్టాలిన్ దిశానిర్దేశం

చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్), జాతీయ విద్యావిధానంపేరుతో రాష్ట్రంలో హిందీని నిర్బంధంగా అమలు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలపై కేంద్రంతో అమీతుమీకి డీఎంకే సిద్ధమవుతోంది. సోమవారం నుంచి ప్రారంభమవుతున్న రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో పాలకపక్షాన్ని నిలదీయాలని ఆ పార్టీ ఎంపీలు నిర్ణయించారు. చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయం అరివాలయంలో ఆదివారం ఉదయం డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన ఆ పార్టీ ఎంపీల సమావేశం నిర్వహించారు. నియోజవర్గాల పునర్విభజన వల్ల నష్టపోయేదీ తమిళనాడు మాత్రమే కాదని.., ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఒడిస్సా, పశ్చిమబెంగాల్, పంజాబ్ రాష్ట్రాల్లోనూ లోక్‌సభ స్థానాల సంఖ్య బాగా తగ్గే అవకాశాలున్నాయని, ఈ రాష్ట్రాలకు చెందిన ఎంపీలతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని సమావేశంలో స్టాలిన్ సూచించారు. డీఎంకే అన్యభాషలకు వ్యతిరేకం కాదనే విషయాన్ని పార్లమెంటు ఉభయసభల్లో కుండబద్దలు కొట్టినట్లు ప్రకటించాలని పేర్కొన్నారు. ఏ భాషను నిర్బంధంగా అమలు చేయకూడదని డీఎంకే దశాబ్దాల తరబడి చెబుతున్న విషయాన్ని అన్ని పార్టీల ఎంపీలకు సులువుగా అర్థమయ్యే పదజాలంతో డీఎంకే ఎంపీలు వివరించాలన్నారు. త్రిభాషా విద్యావిధానం గురించి సభ్యులు ఆచితూచి మాట్లాడాలని, తమ వాదనలను సమర్థవంతంగా వినిపించాలన్నారు. రాష్ట్రంలో నిర్బంధ హిందీని అమలు చేయడానికిగాను...జాతీయ విద్యావిధానాన్ని ఆమోదించకుంటే నిధులు రావని కేంద్రం బెదిరిస్తున్న విషయాన్ని కూడా సభలో ప్రస్తావించాలని పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులతో ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఏర్పాటు దిశగా స్టాలిన్ చేపడుతున్న చర్యలను సమర్థిస్తూ ఎంపీలు ఏకగ్రీవ తీర్మానం చేసి ఆమోదించారు. నిర్బంధ హిందీని అమలు చేసి తమిళభాషకు ముప్పు కలిగించడానికి కేంద్రం చేస్తున్న కుట్రను అడ్డుకునేలా, నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకించేలా ఉభయ సభల్లో పటిష్ఠమైన వాదనలను వినిపిస్తామని ఈ విషయంలో పార్టీ ఎంపీలందరూ ఏకతాటిపై నడుస్తామని మరొక తీర్మానం కూడా చేశారు.

ఈడీ వర్సెస్ సీఐడీ!

ఇరు విభాగాల మధ్య రూ.370 కోట్ల జీడీఆర్ స్కామ్ పంచాయితీ

» ఆధారాలేవన్న సీఐడీ.. కోర్టుకు చేరిన వ్యవహారం

» ఆధారాలున్నాయి.. కేసు మూసేయవద్దన్న ఈడీ

» సీఐడీ తీరుపై హైదరాబాద్ సీపీ అసహనం

» కేసును మళ్లీ తెరవాలంటూ డీజీపీకి లేఖ

హైదరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆ రెండూ నేరస్థుల పాలిట సింహస్వప్నాలుగా పేరొందిన విభాగాలే.! ఒకటి నేరాలపై రాష్ట్రస్థాయిలో అత్యున్నత దర్యాప్తు సంస్థ సీఐడీ అయితే.. రెండోది జాతీయ స్థాయిలో మనీల్యాండరింగ్, విదేశాలతో అక్రమ లావాదేవీలపై దృష్టి సారించే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ).! ఇప్పుడు ఈ రెండు విభాగాల మధ్య ఓ ఆర్థిక నేరానికి సంబంధించి పంచాయితీ మొదలైంది. ఎలాంటి ఆధారాల్లేవని, కేసును మూసివేయాలని సీఐడీ పట్టుబడుతుండగా.. ఆధారాలున్నాయి, సీఐడీ పునరాలోచించుకోవాలంటూ ఈడీ చెబుతోంది. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ కూడా సీఐడీ నిర్ణయాన్ని తప్పుబట్టడం గమనార్హం.!

జీడీఆర్ కుంభకోణం..

2010లో ఉమ్మడి ఏపీలో ఫార్మెక్స్ ఇండియా కంపెనీ లిమిటెడ్(ఎఫ్ఐసీఎల్) గ్లోబల్ డిపాజిటరీ రిసిప్ట్స్(జీడీఆర్) కేసు సంచలనం సృష్టించింది. రూ.370 కోట్ల మేర కుంభకోణం జరిగినట్లు అప్పట్లో దర్యాప్తు అధికారులు తేల్చారు. కేసును సీఐడీకి బదిలీ చేశారు. ఇప్పుడు ఈ కేసు హాట్‌టాపిక్‌గా మారింది. సరైన ఆధారాల్లేనందున కేసును మూసివేయాలంటూ సీఐడీలోని ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) గత ఏడాది అక్టోబరులో ఎల్బీనగర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విషయం తెలుసుకున్న ఈడీ.. సీఐడీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 5న ప్రొటెస్ట్ పిటిషన్ వేసింది. "ఈ కేసులో ఇప్పటికే రెండు దఫాలుగా రూ.124.79 కోట్ల ఆస్తులను అటాచ్ చేశాం. అవన్నీ నిందితులైన కంపెనీ ప్రమోటర్లు, ఫండ్ రెగ్యులేటర్లు అయిన లండన్‌కు చెందిన అరుణ్ పంచారియా, దుబాయ్‌కి చెందిన సంజయ్ అగర్వాల్, హైదరాబాద్‌లో నివసించే ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.మల్లారెడ్డిలకు సంబంధించిన ఆస్తులు" అని ప్రొటెస్ట్ పిటిషన్‌లో ఈడీ స్పష్టం చేసింది. నేరాన్ని నిరూపించేందుకు అన్ని ఆధారాలున్నాయని, నిందితులు ఫెమా నిబంధనలను ఉల్లంఘించారనడానికి సాక్ష్యాలున్నాయని పేర్కొంది. ఇప్పటికే ఫార్మెక్స్ ఇండియా ఆర్థిక సలహాదారు అగర్వాల్‌తోపాటు.. పలువురిని అరెస్టు చేసినట్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చింది. హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సైతం సీఐడీ నిర్ణయంపై విస్మయం వ్యక్తం చేస్తూ, ఫార్మెక్స్ ఇండియా కేసును మళ్లీ తెరవాలని.. తెలంగాణ డీజీపీకి లేఖ రాశారు. ఒక కేసుకు సంబంధించి ఇన్ని విభాగాల మధ్య విభేదాలుండడం ఇదే మొదటిసారి.!

నిర్ధారించిన సెబీ

సెబీ కూడా 2020 జూలై 15న జీడీఆర్ మోసాన్ని నిర్ధారిస్తూ తీర్పునిచ్చింది. ఫార్మెక్స్ ఇండియా సంస్థ మోసపూరితంగా వ్యవహరించి జీడీఆర్‌లను దుర్వినియోగం చేసిందని, షెల్ కంపెనీల ద్వారా లావాదేవీలు జరిగాయని స్పష్టం చేసింది. ఈ కంపెనీని స్టాక్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాల్లో పాల్గొనకుండా నిషేధించింది. కంపెనీ డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరెడ్డి, అరుణ్ పచారియా, వింటేజ్ ఎఫ్‌జడ్‌ఈలు ఈ మోసానికి పాల్పడ్డారని తేల్చిచెబుతూ.. ఫార్మెక్స్ ఇండియాకు రూ.50 లక్షల జరిమానా విధించింది. సెబీ తన తీర్పులో పలు అంశాలను ప్రముఖంగా ఎత్తిచూపింది. అవి.. ఫార్మెక్స్ ఇండియా లిమిటెడ్(ఎఫ్ఐఎల్) కంపెనీ 71.91 మిలియన్ విలువైన(నాటి విలువ రూ.370కోట్లు) 51 లక్షల జీడీఆర్‌లను జారీ చేసింది. వీటిని వింటేజ్ ఎఫ్‌జడ్‌ఈ సబ్‌స్క్రైబ్ చేసింది. ఆ తర్వాత వింటేజ్ కంపెనీ దుబాయ్‌లోని ఈరం బ్యాంకులో జీడీఆర్‌లను తనఖా పెట్టి.. రుణం తీసుకుంది. అరుణ్ పచారియా ఈ రుణాన్ని వివిధ కంపెనీలకు మళ్లించారు. దీనివల్ల ఎఫ్ఐఎల్, దాని షేర్ హోల్డర్లకు 72.20 మిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లింది. ఈ మోసపూరిత వ్యవహారంలో కేవలం ఎఫ్ఐఎల్, వింటేజ్ మాత్రమే కాకుండా ప్రాస్పెక్ట్ కాపిటల్ లిమిటెడ్, జాన్ బెహర్, నితీశ్ బన్‌గెరా, ఫండ్ మేనేజర్లు అయిన ఇండియా ఫోకస్ కార్డినల్ ఫండ్, హైబ్లూస్కై ఎమర్జింగ్ మార్కెట్ ఫండ్ పాత్ర ఉంది.

రేవంత్‌రెడ్డీ.. పైశాచికానందం నీదే!



హైదరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): "ప్రజలను ఇబ్బందిపెట్టి ఎవరు పైశాచికానందం పొందుతున్నారు రేవంత్‌రెడ్డీ.. హైడ్రా పేర ఇళ్లను కూలగొట్టి నువ్వు పైశాచికానందం పొందావు. లగచర్ల గిరిజన రైతులకు బేడీలు వేయించావ్. ఆశా వర్కర్లను పోలీసులతో ఎగిరెగిరి కొట్టించావ్. పేరు మర్చిపోయారని అల్లు అర్జున్‌ను అరెస్టు చేసి, అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల వీపులు పగలగొట్టి, గుమ్మడి నర్సయ్య నాలుగుసార్లు వస్తే అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా పైశాచికానందం పొందింది నువ్వే" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు విరుచుకు పడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో కార్మికులు మరణిస్తే ఆనందం పొందే స్థితిలో కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు లేరన్నారు. 16 రోజులవుతున్నా 8 మంది ప్రాణాల గురించి ఈ ప్రభుత్వానికి పట్టింపు లేకుండా పోయిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలన చేతగాక ప్రకృతిపై కూడా నిందలు వేస్తున్నారని, ఎండలకు పంటలు ఎండుతున్నాయంటూ చెబుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ సీఎంగా ఉన్నపుడు ఎండలు లేవా? అని నిలదీశారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం మంగళవారం మధ్యాహ్నం జరగనుంది. తెలంగాణ భవన్‌లో జరగనున్న ఈ సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుసరించాల్సిన విధానం.. పార్టీ వైఖరిపై కేసీఆర్ ఈ సందర్భంగా దిశానిర్దేశం చేయనున్నారు.

సూర్యాపేట జిల్లా మునగాల మండలం నెలమర్రిలో ఎండిపోయిన వరి పైరులో మోటార్ సైకిల్ నడుపుతూ నిరసన తెలుపుతున్న కౌలు రైతు సుందరయ్య



పంటలు ఎండుతున్నాయ్.. నీళ్లివ్వండి

» పలు జిల్లాల్లో రైతుల ఆందోళనలు

మునగాల రూరల్/సంస్థాన్‌నారాయణపురం/మోటకొండూరు, ఖమ్మం, గంగాధర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత ఇంకా పూర్తి స్థాయిలో ప్రారంభం కాక ముందే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రైతులు నీటి కొరతతో ఆందోళన చెందుతున్నారు. పంటలు ఎండిపోతుండడంతో కన్నీరు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సాగు నీటిని అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా మునగాల మండలం నేలమర్రి గ్రామానికి చెందిన కౌలు రైతు బట్టిపల్లి సుందరయ్య సాగు నీటి కోసం వినూత్న రీతిలో నిరసన తెలిపాడు. ఎస్సారెస్పీ నీరు రాక పొట్ట దశకు వచ్చిన పైరు ఎండిపోతుందని.. పొలంలో ద్విచక్రవాహనంపై ఆదివారం చక్కర్లు కొట్టి ప్రభుత్వానికి తన నిరసన తెలియజేశాడు. జిల్లాలోని మోతె, మునగాల మండలాల్లోనూ సాగు నీటి సమస్య ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలోనూ రైతులు ట్యాంకర్ల ద్వారా పొలానికి నీరు పెట్టి పంటను కాపాడుకుంటున్నారు. ఇక, ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల, వైరా, ఏన్కూరు తదితర మండలాల్లోని ఎగువ భూములకు నీరందడం లేదంటూ వైరా మేజర్ ఆయకట్టు రైతులు బోనకల్ బ్రాంచి కెనాల్ కాల్వ వైరా మేజర్‌కు వెళ్లే తూము వద్ద ఆదివారం ఆందోళన చేశారు. మరోపక్క, సాగు నీటి సమస్యతో చొప్పదండి ఎమ్మెల్యే మేడపల్లి సత్యంకు ఆదివారం నిరసన సెగ తగిలింది. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాలకు వచ్చిన ఎమ్మెల్యే సత్యంను సాగు నీటి కోసం రైతులు నిలదీశారు. రైతు బంధు, రుణ మాఫీ ఎక్కడంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఎండిన పంటలను పరిశీలించి నీరు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు.



జాతీయ రహదారిపై మంచు దుప్పటి

ఈ చిత్రంలో కనిపిస్తున్నది పొగమంచు కమ్మేసిన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి శివారులోని జాతీయ రహదారి. మండల కేంద్రంతో పాటు శివారు గ్రామాల్లోనూ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. దట్టమైన పొగమంచులో ముందుకెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 7 గంటలకు మొదలైన పొగమంచు 9 దాటాక కాని కనుమరుగవ్వలేదు. - చిట్యాల రూరల్, ఆంధ్రజ్యోతి

రోడ్డు పక్కన మృత్యు శకటాలు!

ఆగి ఉన్న వాహనాలను ఢీకొన్న కారు, ప్రైవేటు బస్సు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

నార్కట్‌పల్లి, అల్వాల్, ఆదిలాబాద్ రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీల వల్ల ఆదివారం తెల్లవారుజామున రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటం వద్ద హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని ఓ కారు ఢీకొట్టింది. దీంతో ఆ కారులో ఉన్న చిలసాగరం సందీప్‌గౌడ్ (27), కుంచ సాయికుమార్‌గౌడ్ (35) అక్కడికక్కడే మరణించారు. ప్రవీణ్, మధుకర్, హరీశ్ తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. హైదరాబాద్‌లోని అల్వాల్, యాప్రాల్ బొల్లారం కంటోన్మెంట్ ప్రాంతాలకు చెందిన వీరంతా స్నేహితులు. విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు శనివారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి కారులో బయలుదేరారు. అయితే, ఓ లారీ డ్రైవర్ టీ తాగేందుకు లింగోటం శివారులోని ఓ హోటల్ వద్ద వాహనాన్ని రోడ్డుపైనే ఆపేశాడు. కారులో వస్తున్న వారు పొగ మంచు వల్ల లారీని గమనించిక దానిని ఢీకొట్టి ప్రమాదానికి గురయ్యారు. ఇక, ఆదిలాబాద్ రూరల్ మం డలం జందాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు చనిపోయారు. ఆదివారం తెల్లవారు జామున ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళుతున్న వ్యాను టైరు పేలి డివైడర్‌ను ఢీకొట్టింది. దాంతో డ్రైవర్ వ్యాన్‌ను అలానే వదిలేశాడు. అయితే, 39 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్‌లోని బజల్‌పూర్ వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఈ వ్యాన్‌ను ఢీకొట్టింది. దీంతో డ్రైవర్లు లోచన్ సాహు (32), ప్రదీప్ సాహు (35) అక్కడికక్కడే చనిపోయారు. 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు.



సందీప్‌గౌడ్



సాయికుమార్ (ఫైల్)



ఏపీ లింగోటం వద్ద ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

టన్నెల్ ప్రమాదం..

ఒకరి మృతదేహం లభ్యం

- ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ఏడు లేయర్ల కింద గుర్తింపు
- ర్యాబిన్స్ ఆపరేటర్‌గా విధులు
- స్వస్థలం.. పంజాబ్‌లోని చీమాకలాన్
- మిగతా ఏడుగురి కోసం గాలింపు

మహబూబ్‌నగర్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/దోమలపెంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో గల్లంతైన ఎనిమిది మందిలో.. 16 రోజుల సహాయక చర్యల తర్వాత ఒకరి మృతదేహం లభ్యమైంది. మృతుడిని ర్యాబిన్స్ ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్‌గా గుర్తించారు. ఆయన స్వస్థలం పంజాబ్‌లోని చీమాకలాన్. కేరళ నుంచి తెప్పించిన క్యాడవర్ డాగ్స్ గుర్తించిన చోటే.. గురుప్రీత్ మృతదేహం లభ్యమైంది. శనివారం రాత్రి సహాయక బృందాలకు ఓ చేయి కనిపించగా.. కాంక్రీట్ మాదిరిగా గట్టిపడ్డ మట్టిలోంచి.. దెబ్బ తినకుండా మృతదేహాన్ని తీసేందుకు సహాయక బృందాలు సుమారు 12 గంటల పాటు శ్రమించాయి. మృతదేహం నిలువున ఉన్నట్లు గుర్తించి, 12 అడుగుల మేర తవ్వకాలు జరిపాయి. టీబీఎంకు చెందిన వ్యర్థాలను సైతం.. ఏడు లేయర్ల మేర తొలగించాక, గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభ్యమైంది. ఆదివారం సాయంత్రం 4 గంటలకు మృతదేహాన్ని తీయగా.. 6 గంటలకు టన్నెల్ నుంచి బయటకు తీసుకువచ్చి, పోస్టుమార్టం నిమిత్తం అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆదివారం అర్ధరాత్రే పోస్టుమార్టం ప్రక్రియ పూర్తవ్వగా.. మృతదేహాన్ని పంజాబ్‌కు తరలించారు. గత సోమవారం నుంచి గాలింపును తీవ్రతరం చేయగా.. జీపీఆర్ రాడార్లు, ఆక్వా-ఐ యంత్రాలు, స్నిఫర్ డాగ్స్, కేరళ నుంచి తెప్పించిన క్యాడవర్ శునకాలను వినియోగించారు. జీపీఆర్ గుర్తించిన ఐదు ప్రాంతాల్లో కొన్ని చోట్ల తవ్వకాలు జరిపినా.. గల్లంతైన వారి ఆచూకీ లభించలేదు. గురువారం రంగంలోకి దిగిన క్యాడవర్ డాగ్స్ రెండు ప్రాంతాలను గుర్తించాయి. వాటిల్లో ఓ ప్రాంతం ప్రమాద స్థలికి చేరువలో ఉంది. సింగరేణి, ర్యాట్ మైనర్లు చెరో ప్రాంతంలో తవ్వకాలు జరిపారు. శనివారం రాత్రి ఓ చేయి ఉన్నట్లు ఎన్‌డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ హరీశ్ గుర్తించడంతో.. తవ్వకాలు జరిపారు. ఈ ప్రాంతం టన్నెల్‌లో 13.8 కిలోమీటర్ల దూరంలో.. టీబీఎంకు 50 మీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. క్యాడవర్ డాగ్స్ గుర్తించిన మరో ప్రాంతం టీబీఎంకు 16 మీటర్ల దూరంలో ఉంది. ఆదివారం ఈ శునకాలు మరో రెండు ప్రాంతాలను గుర్తించాయి. ఈ మూడు చోట్ల తవ్వకాలు కొనసాగుతున్నాయి. అయితే.. ఈ ప్రాంతం సున్నితంగా ఉందని సింగరేణి మైనర్లు చెబుతున్నారు. ఈ 3 ప్రాంతాలు టీబీఎం నుంచి 10-16మీటర్ల దూరంలో ఉన్నాయి. అక్కడ ఊట నీటిని తొలగిస్తుండగా.. మిగతా మట్టి కాంక్రీట్ మాదిరిగా గట్టిగా తయారవుతూ తవ్వకాలకు ఆటంకంగా మారిందని వివరిస్తున్నారు. దీంతో.. సహాయక బృందాలపై పైనుంచి మట్టి పెళ్లలు కూలకుండా ఉండేందుకు దుంగలను తెప్పించారు. వీటిని సపోర్ట్‌గా వినియోగించి, తవ్వకాలు జరుపుతారు. క్యాడవర్ డాగ్స్ గుర్తించిన మూడు ప్రాంతాల్లో 15 అడుగుల మేర మట్టిని తవ్వాల్సి ఉందని అధికారులు చెప్పారు.



టన్నెల్ లోపలకు వెళ్తున్న క్యాడవర్ డాగ్స్, సిబ్బంది

క్యాడవర్ డాగ్స్ రాక

టన్నెల్‌లో చిక్కుకుపోయిన వారిని గుర్తించేందుకు 16 రోజులుగా 12 ఏజెన్సీలకు చెందిన బృందాలు శ్రమిస్తున్నాయి. జీపీఆర్ రాడార్, ఆక్వా-ఐ పరికరాలను గుర్తించినా.. గల్లంతైన వారిని గుర్తించడం సాధ్యం కాలేదు. దీంతో.. కేరళ పోలీసులు వినియోగించే క్యాడవర్ డాగ్స్‌ను రప్పించారు. బెల్జియం మెలినోయిస్ జాతికి చెందిన మాయ, మార్ఫి అనే శునకాలను కేరళ బృందాలు రంగంలోకి దింపాయి. కేరళలో ప్రకృతి వైపరీత్యాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాలు ఎక్కువగా ఉండడంతో.. సుమారు 17 శునకాలను కొనుగోలు చేసి, వాటికి మానవ అవశేషాలను గుర్తించడంలో శిక్షణనిచ్చారు. ఇవి మానవ, జంతు కళేబరాల అవశేషాలను వేర్వేరుగా గుర్తిస్తాయి. నెలలు, సంవత్సరాలు దాటి.. ఎముకలు మాత్రమే భూగర్భంలో ఉన్నా.. ఇవి గుర్తిస్తాయి.

25 లక్షల పరిహారం ప్రకటించిన సీఎం

హైదరాబాద్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గురుప్రీత్‌సింగ్ కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.25 లక్షల నష్టపరిహారం ప్రకటించారు. ఆయన మృతిపట్ల సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంతాపం తెలిపారు. మృతదేహాన్ని పంజాబ్‌కు తరలించామని చెప్పారు. రెవెన్యూ అధికారి రూ.25 లక్షల చెక్కును సిద్ధం చేసి, పంజాబ్‌లోని గురుప్రీత్‌సింగ్ కుటుంబానికి అందజేసేందుకు ఇద్దరు సహాయకులను మృతదేహంతో పాటు పంపించామన్నారు. కాగా.. సహాయక చర్యల్లో సీఎం వైఫల్యం, కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంతోనే ఈ ఘోరం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం, కాంట్రాక్టు సంస్థ చెరో రూ.50 లక్షల చొప్పున రూ.కోటి పరిహారం అందించి, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రమాదస్థలిలో గుర్‌ప్రీత్‌సింగ్ చేయి(ఫైల్)

మొదటిరోజు చేయి కనిపించిన చోటే..

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగిన మొదటి రోజు లభించిన ఫొటోల్లోనే ఒక చేయి కనిపించింది. 'ఆంధ్రజ్యోతి'లో ఆ ఫొటో ప్రచురితమైంది. ప్రమాద సమయంలో భయంతో పరుగులు పెట్టిన కార్మికుల్లో ఒకరు తీసిన ఫొటో అది. అందులో ఒక చేయి ఉన్నట్లు స్పష్టంగా కనిపించింది. ఆ తర్వాత మరోసారి పైకప్పు కూలడంతో ఆ చేయి ఉన్న ప్రాంతాన్ని గుర్తించడం సాధ్యం కాలేదు. తాజాగా జీపీఆర్‌తోపాటు క్యాడవర్ డాగ్స్ ఆ ప్రాంతాన్ని గుర్తించడంతో అక్కడ తవ్వకాలు చేపట్టి, గుర్‌ప్రీత్ సింగ్ మృతదేహాన్ని వెలికి తీశారు.

కొక్కెర వ్యాధితో 12వేల కోళ్ల మృతి

- రంగారెడ్డి జిల్లా నానక్‌నగర్‌లో ఘటన
- మెదక్ జిల్లాలో 3,500 నాటు కోళ్ల మృత్యువాత

యాచారం/నర్సాపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు బర్డ్‌ఫ్లూ కలకలం సృష్టిస్తుండగా.. కొక్కెర వ్యాధి సైతం విజృంభిస్తోంది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నానక్‌నగర్‌లో ఆదివారం ఒక్క రోజే ఏకంగా 12,200 బాయిలర్ కోళ్లు వీవీఎన్‌డీ(కొక్కెర)వ్యాధితో మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనతో రూ.20లక్షల వరకు నష్టం వాటిల్లిందని పౌల్ట్రీ రైతు చల్ల కృష్ణారెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఇదే గ్రామంలో రెండు రోజుల క్రితం ముత్యాల వెంకటరెడ్డికి చెందిన ఫామ్‌లో 7 వేల కోళ్లు మృతి చెందగా.. 10లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఈ విషయమై పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ కిరణ్ వివరణ కోరగా... ఆదివారం కోళ్లు చనిపోయినట్లు తన దృష్టికి రాలేదన్నారు. సోమవారం ఆయా గ్రామాలకు వెళ్లి పరిశీలిస్తానని చెప్పారు. మరోవైపు.. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం లింగాపూర్‌లోనూ పాతులోత్ ప్రసాద్ కోళ్ల ఫామ్‌లో 3,500 నాటు కోళ్లు అనారోగ్యానికి గురై మృతి చెందాయి. సుమారు రూ.8 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

పొలమారి ఊపిరితిత్తుల్లోకి పల్లీ గింజ

- ఊపిరాడక ఏడాదిన్నర బాలుడి మృతి

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం నాయక్‌పల్లిలో ఏడాదిన్నర వయసున్న ఓ చిన్నారి పల్లీ గింజలు తింటుండగా పొలమారి ఊపిరితిత్తుల్లోకి వెళ్లడంతో మృతి చెందాడు. దాంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. నాయక్‌పల్లి గ్రామానికి చెందిన గుండెల వీరన్న, కల్పన దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఏడాదిన్నర వయసున్న కుమారుడు అక్షయ్‌శివ ప్రేమ్‌కుమార్ ఉన్నారు. అక్షయ్ శివ ఈ నెల 7న శుక్రవారం ఇంటి వద్ద పల్లీగింజలు తింటుండగా పొలమారి గింజ ఊపిరితిత్తుల్లోకి వెళ్లింది. దీంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండడంతో కుటుంబసభ్యులు బాలుడిని శనివారం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.



అక్షయ్‌శివ ప్రేమ్‌కుమార్

'నీకు ఏ పని రాదు ఇంటికి పో...'

- తండ్రి మందలించాడని కూతురి ఆత్మహత్య

బొంరాస్‌పేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడని మనస్తాపానికి గురైన ఓ 15 ఏళ్ల బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట్ మండలం మహంతీపూర్ గ్రామంలో జరిగింది. మహంతీపూర్‌కు చెందిన తిరుపతి లాలప్ప, అనిత దంపతులకు కొడుకు కార్తీక్, కూతురు మమత(15) ఉన్నారు. వీరందరూ శనివారం పొలం పనులు చేస్తుండగా మమత ఏదో పొరపాటు చేయడంతో తండ్రి లాలప్ప 'నీకు ఏ పని రాదు ఇంటికి పో' అంటూ మందలించాడు. దీంతో మనోవేదనకు గురైన మమత ఇంటికి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాసేపటి తర్వాత కుమారుడు కార్తీక్‌ను తండ్రి ఇంటికి పంపగా తలుపులు మూసి ఉండటంతో తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. దీంతో తల్లిదండ్రులు స్థానికుల సాయంతో తలుపులు విరగ్గొట్టి చూడగా మమత దూలానికి ఉరేసుకొని కనిపించింది. కిందకు దించి ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు.

పరీక్షల ఆందోళనతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

హయత్‌నగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు ఎలా రాస్తానోనని ఆందోళనకు గురైన ఇంటర్ రెండో ఏడాది విద్యార్థిని ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా సావల్యపురం మండలం గంటవారిపాలెం గ్రామానికి చెందిన కర్నా శ్రీనివాసరావు హయత్‌నగర్‌కు వలస వచ్చి కొంత కాలంగా లెక్చరర్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. శ్రీనివాస్‌రావు కుమార్తె వెంకట సాయిప్రీతి(17) ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో ఏడాది చదువుతోంది. పరీక్షలు ప్రారంభం కావడంతో సరిగా రాస్తానో లేదోనని ఆందోళనకు గురై శనివారం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫాల్కన్ కేసు..

ఎయిర్ అంబులెన్స్‌గా సొంత జెట్

- వైద్యం ముసుగులో అమర్‌దీప్ పరారీ
- రూ.14 కోట్లకు జెట్ కొనుగోలు
- రూ.3 కోట్లతో ఇంటీరియర్ మెరుగులు
- తన పేరిటే ప్రెస్టీజ్ జెట్ ఇంక్ కూడా
- ఈడీ అధికారులకు పైలట్ వాంగ్మూలం

హైదరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సుమారు రూ.850 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డ ఫాల్కన్ ఇన్వాయిస్ స్కామ్ ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్.. పక్కా వ్యూహంతో దేశాన్ని దాటినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు గుర్తించారు. అమర్‌దీప్ తనసొంత జెట్‌ను ఎయిర్ అంబులెన్స్‌గా వినియోగించుకుని, తనను తాను అత్యవసర వైద్యం అందాల్సిన రోగిగా పేర్కొని దుబాయ్ పారిపోయినట్లు నిర్ధారించారు. శుక్రవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండ్ అయిన ఆ జెట్‌ను సీజ్ చేసిన ఈడీ అధికారులు.. పైలట్ సప్తరిష్‌ను విచారించగా.. అమర్‌దీప్ 'ఎస్కేప్ ప్లాన్' వెలుగులోకి వచ్చింది. అమర్‌దీప్ వ్యూహంతోనే ప్రైవేట్ జెట్‌ను కొనుగోలు చేసినట్లు ఈడీ అధికారులు భావిస్తున్నారు. ఫాల్కన్ బాధితుల నుంచి కొల్లగొట్టిన డబ్బులోంచి రూ.14 కోట్లను వెచ్చించిన అమర్‌దీప్.. 2023 డిసెంబరులో ప్రెస్టీజ్ జెట్స్ ఇంక్ కంపెనీ నుంచి 1993 మోడల్ హాకర్ 800 ఏ(ఎన్935హెచ్) జెట్‌ను కొనుగోలు చేశారు. ఆ తర్వాత మరో రూ.3 కోట్లతో ఇంటీరియర్ మార్పులు చేయించినట్లు ఈడీ గుర్తించింది. అంతేకాదు.. ప్రెస్టీజ్ జెట్స్ ఇంక్‌ను కూడా కొనుగోలు చేసి.. అదే పేరుతో తన జెట్‌ను ఎయిర్ అంబులెన్స్‌గా నడుపుతున్నారు. ఫాల్కన్ కుంభకోణంపై కేసు నమోదు చేయగానే అప్రమత్తమైన అమర్‌దీప్.. ముగ్గురి అరెస్టుతో దుబాయ్ పారిపోయేందుకు వ్యూహం పన్నారు. ఫిబ్రవరి 22న తనను తాను రోగిగా పేర్కొంటూ.. తన జెట్ ఎయిర్ అంబులెన్స్‌లో దుబాయ్‌కి చెక్కేశారు. ఈనెల 5న ఆ జెట్ మరోమారు ఎయిర్ అంబులెన్స్‌గా దుబాయ్ వెళ్లింది. శుక్రవారం రాత్రి నాటకీయ ఫక్కీలో 'మెడికల్ ఎమర్జెన్సీ' పేరుతో శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండ్ అవ్వగా.. ఈడీ అధికారులు సీజ్ చేశారు. నిజానికి జెట్ కంపెనీ పేరును అమర్‌దీప్ మార్చకపోవడంతో.. తొలుత ఈడీ ఈ కోణంలో దృష్టిసారించలేదని తెలుస్తోంది. తాజాగా.. ఆ జెట్ పైలట్ సప్తరిష్‌ను ఈడీ ప్రశ్నించగా.. అమర్‌దీప్ ఎలా పారిపోయాడనే విషయం వెలుగులోకి వచ్చింది. అయితే.. కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) ఆర్యన్‌సింగ్, సీఈవో యోగిందర్‌సింగ్‌లు ఎలా తప్పించుకున్నారు? వారు ఎక్కడున్నారనేది ఇంకా తెలియాల్సి ఉంది.



పెరుగుతున్న బాధితులు

ఫాల్కన్ స్కామ్ బాధితులు పెరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. తొలుత 7 వేల మంది బాధితుల నుంచి నిందితులు రూ.1,700 కోట్లను కొల్లగొట్టగా.. రూ.850 కోట్లను తిరిగి చెల్లించారు. మరో రూ.850 కోట్లను కొల్లగొట్టారు. అయితే.. తాజాగా బాధితుల సంఖ్య 8,500ను దాటిందని పోలీసులు చెబుతున్నారు. మరింత పెరిగే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. స్కామ్‌లో కొల్లగొట్టిన డబ్బును నిందితులు ఏవియేషన్, రియల్‌ఎస్టేట్, క్రిప్టోకరెన్సీ, కాయిన్‌ట్రేడ్‌లోకి మళ్లించినట్లు ఈడీ అనుమానిస్తోంది.

ఎండ మంటలు!

పెరుగుతున్న పగటి పూట ఉష్ణోగ్రతలు

- 29 జిల్లాల్లో 39 డిగ్రీలకు పైగానే నమోదు
- రాబోయే 5 రోజులు 36-40 డిగ్రీల మధ్య

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రత కనిపిస్తోంది. నిన్నామొన్నటి వరకు 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొద్ది జిల్లాల్లోనే నమోదు అయ్యాయి. కానీ, ఆదివారం మాత్రం 29 జిల్లాల్లో 39 డిగ్రీలకు పైగానే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నల్గొండ జిల్లా చిట్యాలలో 39.8 డిగ్రీలు నమోదైంది. హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మేడ్చల్, నారాయణ్‌పేట్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సిద్దిపేట, వనపర్తి జిల్లాల్లో 39.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్‌లోనూ భానుడి ప్రతాపం కొనసాగుతోంది. మార్చి రెండోవారంలోనే పగటి ఉష్ణోగ్రతలు 37-38 డిగ్రీలు నమోదవుతుండటంతో మధ్యాహ్నం ఉక్కపోతతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మరో వారం రోజుల్లో పగటి పూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆదివారం హకీంపేటలో అత్యధికంగా 37.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రత పెరుగుతుండటంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఎండల ప్రభావంతో గ్రేటర్‌లో ఇప్పటికే విద్యుత్ డిమాండ్ 3700 మెగావాట్లకు చేరింది. ఈ నెల చివరి నాటికి విద్యుత్ డిమాండ్ 4 వేల మెగావాట్లు దాటుతుందని అంచనా. రాబోయే 5 రోజుల పాటు 36-40 డిగ్రీల మధ్య సగటు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

అంచనాలకు భిన్నంగా లానినా

విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేసవి మరింత వేడిగా ఉంటుందని ఇప్పటికే భారత వాతావరణ శాఖ(ఐఎండీ) ప్రకటించింది. అయితే పెరుగుతున్న ఎండలు, వడగాడ్పులపై పసిఫిక్ మహాసముద్రంలో కొనసాగుతున్న 'లానినా' ప్రభావం ఉండబోదని నిపుణులు అంచనా వేస్తున్నారు. లానినాతో పసిఫిక్ మహాసముద్రంలో చల్లగా ఉండే ఉపరితల ఉష్ణోగ్రతల ప్రభావంతో దేశంలో వేసవి కొంత చల్లగా ఉంటుందన్న అంచనాలకు భిన్నంగా ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో ఎండలు మండుతున్నాయి. ఈసారి వెచ్చని శీతాకాలం, తక్కువ వ్యవధిలో వసంతకాలం కొనసాగిందని ముంబై ఐఐటీ చెందిన సెంటర్‌ఫర్ క్లైమేట్ స్టడీస్ అసోసియేట్ ప్రొఫెసర్ అర్పితా మోండల్ పేర్కొన్నారు. సాధారణంగా లానినా ఉంటే చల్లని వాతావరణం, ఎల్‌నినో కొనసాగితే వేడి వాతావరణం నెలకొంటాయి. అయితే వాతావరణంలో మార్పుల ప్రభావంతో లానినా కొనసాగినా.. వేడి ప్రభావం కనిపిస్తుందని మరికొందరు నిపుణులు అభిప్రాయపడ్డారు. గతేడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఏర్పడాల్సిన లానినా ఒకింత ఆలస్యంగా డిసెంబరులో వచ్చిందని ప్రపంచ వాతావరణ సంస్థ పేర్కొంది. కాగా, ఏపీలో ఎండలు మండిపోతున్నాయి. ఆదివారం నంద్యాలజిల్లా ఆలమూరులో 40.3, కర్నూలు జిల్లా లద్దగిరిలో 39.6, కడప జిల్లా నల్లచెరువుపల్లిలో 39.4, శ్రీసత్యసాయి జిల్లా పెనుగొండలో 38.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రణయ్ హత్య కేసుపై తీర్పు నేడు

- ఏడు సంవత్సరాల పాటు సాగిన విచారణ
- సుపారీ గ్యాంగ్‌తో చంపించినట్లు సాక్ష్యాలు సమర్పించిన పోలీసులు



ప్రణయ్ (ఫైల్)

నల్లగొండ క్రైం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసుపై తీర్పును ఎస్సీ, ఎస్టీ రెండో అదనపు జిల్లా కోర్టు సోమవారం వెల్లడించనుంది. అమృత వర్షిణి, ప్రణయ్‌లు ప్రేమవివాహం చేసుకున్నారు. కులాలు వేరు కావడంతో వీరి వివాహాన్ని అమృత తండ్రి మారుతీరావు ఒప్పుకోలేదు. మారుతీరావు.. సుపారీ గ్యాంగ్‌తో 2018 సెప్టెంబరు 14న ప్రణయ్‌ను హత్య చేయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. ప్రథమ నిందితుడు (ఎ-1)గా అమృత తండ్రి మారుతీరావు, సుపారీగ్యాంగ్‌కు చెందిన సుభాష్‌శర్మ ఎ-2గా, ఎ-3గా అజ్గర్ అలీ, ఎ-4గా అబ్దుల్ బారీ, ఎ-5గా కరీం, ఎ-6గా అమృత బాబాయి శ్రవణ్, ఎ-7గా శివ, ఎ-8గా నదీమ్‌లను పేర్కొంటూ పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ఏడేళ్ల పాటు కోర్టులో విచారణ కొనసాగింది. సుపారీగ్యాంగ్ సాయంతో తండ్రి మారుతీరావు చంపించినట్టు పోసులు సాక్ష్యాలను సమర్పించారు. మానసికంగా కుంగిపోయిన మారుతీరావు బెయిల్ వచ్చిన ఆరు నెలల వ్యవధిలోనే 2020లో హైదరాబాద్‌లో బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎ-2 సుభాష్‌శర్మ.. గుజరాత్ మాజీ హోం మంత్రి అరుణ్‌పాండే హత్య కేసుతో పాటు పలు కేసుల్లో నిందితుడిగా ప్రస్తుతం సబర్మతి జైలులో ఉన్నాడు. ఎ-3 అజ్గర్‌అలీ కూడా ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నాడు.

ఐదేళ్లు దాటినా పక్క తడుపుతుంటే

వైద్యులను సంప్రదించాల్సిందే


- పిల్లల్లో కిడ్నీ, యూరాలజీ సమస్యలపై నిర్లక్ష్యం తగదు
- కిమ్స్ నెఫ్రో-యూరో సదస్సులో వైద్యులు



నెఫ్రో-యూరో సీఎంఈ సదస్సులో పాల్గొన్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వయస్సు దాటినా చాలా మంది పిల్లల్లో పక్క తడిపే అలవాటు ఉంటుందని, సిగ్గుపడి బయటకు చెప్పకపోతే పిల్లలు పెద్దయినా ఆ సమస్య కొనసాగుతుందని వైద్యులు తెలిపారు. తల్లిదండ్రులు వైద్యులను సంప్రదిస్తే పిల్లల్లో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని సూచించారు. అలాగే, పిల్లల్లో కిడ్నీ, యూరాలజీ సమస్యల విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్(సీఎంఈ) కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్, కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో ఆదివారం నెఫ్రో-యూరో సమ్మిట్ 2025 పేరిట ఓ సదస్సు జరిగింది. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటకకు చెందిన పీడియాట్రిక్, నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాలకు చెందిన 250 మంది వైద్యులు ఈ సదస్సులో పాల్గొన్నారు. కిమ్స్ ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు సదస్సును ప్రారంభించారు. ఐదేళ్ల వయస్సు దాటిన పిల్లల్లో పక్క తడిపే అలవాటుపై ఈ సదస్సులో వైద్యులు చర్చించారు. ఈ సమస్యను బయటకు చెప్పకుండా వదిలేయడం వల్ల కొందరు పెళ్లి అయ్యే వయస్సులో ఈ సమస్య పరిష్కారం కోసం వైద్యుల వద్దకు వస్తున్నారని తెలిపారు. ఇక, చిన్న పిల్లల్లో వచ్చే నెఫ్రాలజీ, యూరాలజీ సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు సూచించారు. వ్యాధుల లక్షణాలను పిల్లల్లో గమనిస్తే తల్లిదండ్రులు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. చిన్న పిల్లల కిడ్నీల్లోనూ రాళ్లు ఏర్పడతాయని, పిల్లలు నొప్పి అని చెప్పినా, మూత్రంలో రక్తం చారికలు కనిపించినా తల్లిదండ్రులు వెంటనే వారిని యూరాలజిస్టులకు చూపించాలని, లేదంటే కిడ్నీలు పాడయ్యే ముప్పు ఉందని హెచ్చరించారు. పిల్లల శరీర బరువులో ఒక కిలోకు 2మిల్లీగ్రాముల కంటే ఎక్కువగా ప్రొటీన్ ఉన్నాసరే జాగ్రత్త పడాలని వైద్యులు సూచించారు. కొందరికి చిన్నతనంలోనే హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) ఉంటుందని, దాన్ని పట్టించుకోకపోతే కిడ్నీలు దెబ్బతినే ముప్పు ఉంటుందని తెలిపారు. కొందరు పిల్లల్లో మూత్రనాళాలు చిన్నగా ఉండడం వల్ల సమస్య తలెత్తుతుందని, శస్త్రచికిత్స ద్వారా దానిని సరిచేయవచ్చునని చెప్పారు.

దిగంబర కవిత్వంపై గిన్స్‌బర్గ్ ప్రభావం



1960 నుంచి 1975 మధ్య కాలంలో ప్రపంచ సాహిత్యంలో దాదాపు పది తిరుగుబాటు ఉద్యమాలు సంభవించటానికి కారణం నాటి సామాజిక పరిస్థితులే. 'బీట్ జనరేషన్', 'గ్రే జనరేషన్', 'యాంగ్రీ యంగ్‌మెన్ మూమెంట్', 'ఫూండెడ్ యూత్', 'ప్రోవో మూమెంట్', 'హంగ్రీ జనరేషన్', 'ప్రొటెస్ట్ లిటరేచర్', 'దిగంబర కవిత్వం', 'బండయా కవిత్వం'... ఈ ఉద్యమాల్లోంచి ఉబికివచ్చిన కవిత్వమంతా ఒక బలమైన తాత్విక భూమికతో, విశ్వమానవ శ్రేయస్సు కోసం ఆవేదనతో రాసిన కవిత్వం.

సంక్లిష్టమైన ఇరవయ్యవ శతాబ్దపు ఆధునిక మనిషి ఆధ్యాత్మిక, మానసిక అణచివేతలను కవిత్వంలో వ్యక్తం చేసిన అత్యంత ఆధునిక అర్బన్ పొయెట్ అలెన్ గిన్స్‌బర్గ్. అమెరికాలో 1950ల బీట్ జనరేషన్‌లో అతను ఒక సాహిత్య సంచలనం. బీట్ కవిత్వ ఉద్యమంలోను, ఆ తర్వాత 1960ల హిప్పీ ఉద్యమంలోను కీలక పాత్ర పోషించాడు. తత్వశాస్త్రం, ముఖ్యంగా అస్తిత్వవాదం చేత ప్రభావితుడు. కవిత్వ అభివ్యక్తిలో మార్మికవాది.

మానవతావాదం, ఘాటైన పదజాలం, ఇతివృత్తపరంగా అధిక్షేపం... ఈ కోణాల్లోంచి చూసినప్పుడు అలెన్ గిన్స్‌బర్గ్ కవిత్వానికీ, తెలుగులో దిగంబరకవుల కవిత్వానికి కొంత సామ్యం కనిపిస్తుంది. గిన్స్‌బర్గ్ 1962లో ఇండియాలో పర్యటించి 'ఇండియన్ జర్నల్' అనే గ్రంథాన్ని వెలువరించడమే గాక, ఆ పర్యటనలో పశ్చిమ బెంగాల్ వెళ్ళి హంగ్రీ జనరేషన్ కవులైన మలయ్ రాయ్ చౌదరి, సమీర్ రాయ్ చౌదరి, ఉత్పల్ కుమార్ బసులకు ప్రేరణ అందించాడు.

తెలుగులో దిగంబరకవులుగా దూసుకొచ్చిన ఆరుగురు నగ్నముని, నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, చెరబండరాజు, మహస్వప్న, భైరవయ్యలు 1965లో మొదటి కవిత్వ సంపుటిని, 1966లో రెండవ, 1968లో మూడవ కవిత్వ సంపుటాలను వెలువరించారు. ఈ మూడు సంపుటాల్లోని కవిత్వం వెనుకా గిన్స్‌బర్గ్ స్ఫూర్తి కనిపిస్తుంది.


మొదటి సంపుటిలో దిగంబర కవితోద్యమ ఉద్దేశ్యాన్ని ఆ కవులు ఇలా చెబుతారు: "ఈ దేశంలో, ఈ గోళంలో ఊపిరి పీల్చే ప్రతిమనిషి ఉనికి కోసం తపనపడి అతడి భావిని చూసి వెక్కి వెక్కి ఏడ్చి, పిచ్చి ఎత్తి ప్రవచించిన కవిత. మేం 'దిగంబరులం'. మంచి కోసం, మనిషి లోని నిప్పు లాంటి నిజమైన మనిషి కోసం, కపటం లేని చిరునవ్వులు చిందే సమాజం కోసం, అహోరాత్రులు ఆరని అగ్నిలో నడిచిన ఆత్మల లోంచి పలుకుతున్న గొంతుకలం."

బీట్ కవులు, దిగంబరకవులు ఒకే తాత్వికచింతనతో కవిత్వ సృజన చేసినప్పటికీ దిగంబర కవులు బీట్ కవులచే ప్రభావితులై కవిత్వం రాశారా లేదా అనేది చర్చనీయాంశం. బీట్ జనరేషన్ తర్వాతి కాలంలోనే దిగంబరకవిత్వోద్యమం వచ్చినందున ఎంతో కొంత ప్రభావం ఉండివుంటుందని భావించవచ్చు.

మానవతావాదం, ఘాటైన పదజాలం, ఇతివృత్తపరంగా అధిక్షేపం... ఈ కోణాల్లోంచి చూసినప్పుడు అమెరికన్ బీట్ కవి అలెన్ గిన్స్‌బర్గ్ కవిత్వానికీ, తెలుగులో దిగంబరకవుల కవిత్వానికి కొంత సామ్యం కనిపిస్తుంది.

ఇతర బీట్ కవుల కంటే గిన్స్‌బర్గ్ కవిత్వం తీవ్రమైన poetic forceతో ఉండి పాఠకుల్ని, విమర్శకుల్ని షాక్‌కు గురి చేసింది. అమెరికన్ జీవితం లోని అవినీతిని, క్రూర విషాదకర అమానవీయ సంఘటనల్ని తన కవిత్వం ద్వారా వ్యక్తపరిచి బీట్ కవుల కొత్త డీన్ (గురువు) అని ప్రశంసలందుకున్నాడు గిన్స్‌బర్గ్. తన కాలపు ఆధునికులు దేవుడి మీదనే కాదు, తమ మీద తాము కూడా నమ్మకం కోల్పోయి ఎలాంటి ఆధ్యాత్మిక విలువల్లేని యంత్రాల్లా జీవిస్తున్నారని వాపోతూ 'హౌల్' (పొలికేక/ ఊళ) అనే ఒక దీర్ఘకవితను సృజించాడు. ఆ కవిత ఇలా మొదలవుతుంది:

"నేను చూశాను
పిచ్చితో నాశనమై, ఆకలితో, ఉన్మాదంతో నగ్నంగా
తెల్లవారుజామున నీగ్రో వీధుల్లో తిరిగే నా తరం మేధావుల్ని...
రాత్రియంత్రాల నక్షత్రపు వెలుగులో
పురాతన స్వర్గపు తలంపులతో
దేవదూతల ముఖాలతో తిరిగే అతిస్వేచ్ఛావాదుల్ని
పేదరికంతో, చిరిగిపోయిన బట్టలతో జీవంలేని కళ్ళతో...
ఎత్తయిన చల్లటి నీటిగదుల్లో అతీంద్రియచీకట్లో
ధూమపానం చేస్తున్నవారిని...
వెర్రితో కపాలాలకిటికీలపై అశ్లీలకవితల్ని ప్రచురించినందుకు అకాడెమీల నుండి బహిష్కరింపపడ్డవారిని...
అపరిశుభ్రమైన గదుల్లో అర్ధనగ్నంగా డబ్బును చెత్తబుట్టల్లో తగులబెట్టి, గోడల్లోంచి బీభత్సాన్ని వింటున్నవాళ్ళని..."


శ్రీశ్రీతో దిగంబర కవులు జ్వాలాముఖి, నగ్నముని, నిఖిలేశ్వర్, చెరబండ రాజు

1956లో 'హౌల్' మహాకావ్య ప్రచురణతో గిన్స్‌బర్గ్ అమెరికాను దిగ్భ్రమకు గురిచేశాడు. అమెరికా సమాజం తన యువతరాన్ని ఎలా నాశనం చేసిందో భావగర్భితంగా వ్యక్తం చేసే ఈ కవితను అమెరికా ప్రభుత్వం నిషేధించింది. 'హౌల్' కవిత అమెరికాలో వ్యవస్థీకృత యాంత్రిక నాగరికతకు వ్యతిరేకంగా రాసిన మొట్టమొదటి నిరసన కవిత.

గిన్స్‌బర్గ్ లాగే దిగంబర కవి నగ్నముని కూడా సమాజంలో రోజురోజుకు దిగజారిపోతున్న విలువలను, ఆధునిక మానవుని దుస్థితిని చూసి భరించలేని బాధతో 'జైల్లో సముద్రం' అనే అధివాస్తవిక కవిత రాశాడు. అందులో: "మనిషిని మనిషిగా/ ఈ కృత్రిమ దుస్తుల్ని విప్పేసి/ నగ్నంగా నిశ్చలంగా సజీవంగా సాక్షాత్తు మానవుడిగా మట్టిలో పుట్టి మట్టిలో ఎదిగే/ మానవతా నక్షత్రం..." అని అంటాడు. నగ్నముని భాషలోను, కవిత్వతీవ్రతలోను, సామాజిక సంఘటనలకు ప్రతిస్పందించే గుణంలోను గిన్స్‌బర్గ్‌ను పోలి ఉంటాడు. ఈ ఇరువురి కవిత్వంలో ప్రవాహగుణం ప్రస్ఫుటం. గిన్స్‌బర్గ్ లాగే నగ్నముని కూడా కవిత్వంలో అత్యంత జుగుప్సాకరమైన భాషను వాడి తీవ్ర విమర్శలకు గురయ్యాడు. 'కొజ్జాల కామకేళి చూస్తున్నాను' అనే కవితలో: "అశ్లీలం పలుకుతోంది దిగంబరాక్షరం అంటున్నావు సిగ్గులేకుండా/ నీ మెదడు పురుగు తినేసింది/ నీ చర్మం కుళ్ళిపోయింది/ నీ అవయవం పుచ్చిపోయింది..." అంటాడు.

సమాజమే వ్యక్తులను పనికిరానివాళ్ళుగా చేస్తుందని ఆరోపిస్తూ, యువత దిగజారడానికి కారణమైన సమాజంపై గిన్స్‌బర్గ్ లాగే దిగంబరకవులు తమ ఆగ్రహాన్ని, ఆవేదనను తీవ్రస్వరంతో వ్యక్తపరుస్తారు. మహస్వప్న 'గ్లానిర్భవతి భారతః' అనే కవితలో "మానవత రెండు కళ్ళు మూసుకు పోయినప్పుడు/ విప్పుకుంటున్న మూడో కన్నునై/ కాలం వాయులీనం మీద కమానునై/ చరిత్ర నిద్రా సముద్రం మీద తుఫానునై/ నేను వస్తున్నాను దిగంబర కవిని..." అంటాడు. 'చెరచబడ్డగీతాన్ని' అనే కవితలో మరో దిగంబర కవి భైరవయ్య మనుషులు యాంత్రిక జీవన విధానాలకు దూరంగా ఉండాలని గిన్స్‌బర్గ్ లాగే ఉద్బోధిస్తాడు: "నేను చెరచబడ్డ గీతాన్ని/ నగ్నంగా నడివీధిలో కాటేసిన భూతాన్ని/ స్వార్థపు కాంక్రీటు తొడలమధ్య/ నలిపివేయబడ్డ రాగాన్ని." ఈ కవితలోని 'నేను' అన్న మాట మానవత్వాన్ని, సమాజాన్ని, కవిత్వాన్ని, మనిషిని సూచిస్తుంది. మానసిక దిగంబరత్వం కోసం నిత్యసచేతన ఆత్మస్ఫూర్తితో జీవించడమే ఆశయంగా చెప్పుకున్న దిగంబరులు గిన్స్‌బర్గ్ లాగే తమ కావ్యరచనలో జీవితంలోని నిజాయితీని, సరళత్వాన్ని, యుగసందేశాన్ని, అనుభూతుల అభివ్యక్తిని ఊపిరిగా పీల్చగల ఆధునికమానవుని అస్తిత్వాన్ని ఆవిష్కరిస్తారు. నిఖిలేశ్వర్ 'ఆత్మయోని' అనే కవితలో "దిగంబర కవితలో మరొకడు మరొకడు/ నిండుగా నిజంగా ఊపిరి పీల్చేవాడు/ ఆత్మయోని నుండి పుట్టుకొస్తాడు" అంటాడు. చెరబండరాజు 'నా మనుష్య ప్రపంచంలోకి' అనే కవితలో "మంచి చచ్చి పుచ్చిన మానవతలో/ శవాలుగా మిగిలిన మనుషుల ఆశల చరమశ్వాసలుగా చూసి జాలిపడి/ వారి వెన్నుపూసలుగా మారి వారిని నిలబెడుతున్నాయి" అంటూ కవిత్వ నిబద్ధతకి నిలువెత్తు నిదర్శనమౌతాడు.

అప్పటివరకు చెలామణీలో ఉన్న కవిత్వ నిర్మాణ సూత్రాలను చెరిపేసి పొడవైన వాక్యాలు రాసిన అధివాస్తవిక కవి గిన్స్‌బర్గ్. ఛందోబద్ధ వాక్యనిర్మాణానికి తిరుగుబాటుగా 'హౌల్' మొదటి భాగంలో 75 పంక్తుల సుదీర్ఘ వాక్యాన్ని రాస్తాడు. అశ్లీల పదాలను కూడా కవిత్వీకరిస్తాడు. గిన్స్‌బర్గ్ లాగే అశ్లీల పదాల్ని కవిత్వంలో విస్తారంగా ఉపయోగించి వివాదాస్పదమైనారు దిగంబరకవులు. జుగుప్స కలిగించే సమాజాన్ని ప్రతిబింబించాలంటే అలాంటి భాషను, ప్రతీకల్నే వాడాలన్న దిగంబరుల వాదనను ఆరుద్ర, కొడవటిగంటి లాంటి కొద్దిమంది ప్రముఖులు సమర్థించారు. మానవుని ఉనికి కోసం తపనపడుతూ రాసిన కవిత్వమే కానీ తమ భాషలో జుగుప్స లేదంటాడు భైరవయ్య. "బూతును అస్పృశ్యంగా చూడడానికి మనలో ఉన్న ఒక రకమైన పిరికితనం కారణం. దిగంబర కవితలోని బూతుపదాల స్పందన సెక్స్ వైపుకు వెళ్ళనీయదు. సమాజాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రించడమే దిగంబర కవిత".

అంతిమంగా గిన్స్‌బర్గ్ గానీ, దిగంబర కవులు గానీ తమ లక్ష్యాన్ని పూర్తిగా చేరుకోలేదు. బీట్ కవులు వ్యక్తిగత విభేదాల కారణంగా విడిపోగా, దిగంబరకవులు ఐదేళ్ల వరకు తమ నిరసన స్వరంతో కలిసి ప్రయాణం చేశారే కానీ ఆ తర్వాత ఆ ఉద్యమాన్ని కొనసాగించలేకపోయారు. వారు ఇతర తెలుగుకవుల్ని ప్రభావితం చేయలేక పోవడమే కాక, వారి అభిప్రాయాలతో, కవిత్వంతో పాఠకులు ఏకీభవించలేదని అర్థం చేసుకున్నారు. ఏ నిరసన కవైనా ప్రజల్లోకి చేరితే తప్ప ప్రభావవంతంగా ఉండలేడని గ్రహించి 1970లో విరసం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. దిగంబరోద్యమం దిగంబర కవులచే ప్రారంభించబడి వారితోనే ముగిసిందని చెప్పొచ్చు.

(మార్చి 12తో దిగంబర కవిత్వానికి 60 ఏళ్ళు)

■ బాణాల శ్రీనివాసరావు
✆ 94404 71423

మునిపల్లె రాజు సాహిత్య పురస్కారాలు
కథకుడు మునిపల్లె రాజు శతజయంతి సందర్భంగా 2023 సాహిత్య పురస్కారాన్ని సుధామ, 2024 సాహిత్య పురస్కారాన్ని పి. చంద్రశేఖర ఆజాద్‌లు స్వీకరిస్తారు. పురస్కార ప్రదాన సభ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఎం.వి.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్చి 17 సా.6గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది.
ఉష మునిపల్లె

నవలల పోటీకి ఆహ్వానం
జాగృతి వారపత్రిక ఆధ్వర్యంలో ఏపీయూఎస్ వ్యవస్థాపక కార్యదర్శి స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీ - 2025కు రచనలను ఆహ్వానిస్తున్నాం. పోటీలో ప్రథమ, ద్వితీయ బహుమతులు వరుసగా: రూ.25వేలు, రూ.20వేలు. రచనలు చేరాల్సిన చివరి తేదీ ఏప్రిల్ 8. పూర్తి వివరాలకు: www.jagritiweekly.comలో జాగృతి వారపత్రిక తాజా సంచిక చూడండి. ఫోన్: 99599 91304.
జాగృతి సంపాదకులు

బీసీ వాద కవిత్వానికి ఆహ్వానం
బీసీ అస్తిత్వ, సాంస్కృతిక, రాజకీయవాదాన్ని బలపరుస్తూ బీసి కవుల నుండి వచన కవితలకు ఆహ్వానిస్తున్నాము. కవితలను ఏప్రిల్ 15లోగా ఈమెయిల్: bcsahityavedika2025@gmail.com, వాట్సాప్ నెంబర్: 94927 65358కు పంపాలి. బీసీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ జరిగే రాష్ట్ర స్థాయి బీసీ సాహిత్య సదస్సులో సంకలనంగా ప్రచురించి ఆవిష్కరిస్తాము.
వనపట్ల సుబ్బయ్య

సోమవారం 10 మార్చి 2025

వివిధ
vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

ప్రపంచ సాహిత్యం సరసన తెలుగుకు గొప్ప అవకాశం

మూడు ప్రశ్నలు

అఫ్సర్

ఇటీవల 'అమెరికన్ లిటరరీ ట్రాన్స్‌లేటర్స్ అసోసియేషన్' తెలుగు అనువాదంపై ప్రారంభించిన వర్క్‌షాప్ గురించి చెప్పండి. ఈ వర్క్‌షాప్‌లో మెంటర్‌గా ఎంపికైన మీరు చేయాల్సిన పని ఏమిటి?

అమెరికాలో అనువాద సాహిత్యంపై దాదాపు యాభై యేళ్లుగా కృషి చేస్తున్న సంస్థ అమెరికన్ లిటరరీ ట్రాన్స్‌టర్స్ అసోసియేషన్ (ఆల్టా – ALTA). ఈ సంస్థ వివిధ ప్రపంచ భాషల లోంచి ఇంగ్లీషులోకి వెళ్ళి తీరాల్సిన రచనల మీద దృష్టి పెడుతుంది. ఆయా భాషలకు సంబంధించి అమెరికాలో వున్న ప్రసిద్ధ రచయితలనీ, అనువాదకులనీ, అనువాదం పట్ల ఆసక్తి వున్న కొత్త తరం వాళ్ళనీ ఒక వేదిక పైకి తీసుకొచ్చి, వాళ్ళతో అనువాద శిబిరాలూ, ప్రచురణ కర్తలతో సమావేశాలూ, ఎడిటర్లూ, పత్రికల మధ్య సంభాషణలూ నిర్వహిస్తుంది. సంస్థ పనితీరు ప్రకారం ప్రతి ఏడాదిలో అనువాదకులు కనీసం ఒక పూర్తి రచనని ఇంగ్లీషులోకి అనువాదం చెయ్యాలి. ఆయా భాషల్లో ఇప్పటికే నిష్ణాతులైన ప్రసిద్ధులని మెంటర్స్ (పర్యవేక్షకులు)గా తీసుకుంటారు. వాళ్ళ పర్యవేక్షణలో అనువాదం పని సాగుతుంది. ఆల్టా సంస్థ నుంచి పర్యవేక్షకునిగా ఆహ్వానం అందటం నాకూ ఆశ్చర్యమే! ఆ సంస్థ నుంచి నాకు వచ్చిన ఈమెయిల్‌లో తెలుగు భాషకి సంబంధించి అమెరికాలో విశేషంగా వినిపిస్తున్న పేరు కాబట్టి పరిశీలనలోకి తీసుకున్నామని రాశారు. తరవాత నాకు అర్థమైందేమంటే వాళ్ళు చాలా రకాలుగా సర్వేలు నిర్వహించి, అభిప్రాయాలూ సేకరించి ఈ పర్యవేక్షకులని నిర్ణయిస్తారని! వర్క్‌షాప్‌లో ఈసారి ఇద్దరు కొత్త అనువాదకులు ఎంపిక అయ్యారు. వారికి కావాల్సిన శిక్షణ ఇచ్చే బాధ్యతను ఈ సంస్థ నాకు అప్పజెప్పింది. ఈ ఇద్దరు కొత్త అనువాదకులు ఒక తెలుగు రచనని అనువాదం చేస్తారు. ప్రతి నెలా నేను వాళ్ళతో సమావేశమై, అనువాద సమస్యల్ని పరిష్కరించాలి. అలాగే, అనువాదం ఏడాదిలో పూర్తి చేయించే బాధ్యత నా మీద వుంటుంది.

'అమెరికన్ లిటరరీ ట్రాన్స్‌లేటర్స్ అసోసియేషన్' (ఆల్టా) తరఫున ఇంగ్లీషులోకి అనువాదమైన తెలుగు రచనలకు అమెరికాలోని ప్రసిద్ధ ప్రచురణ సంస్థ ద్వారా పుస్తకంగా వెలువడే అవకాశం లభిస్తుంది. ఇది చిన్న విషయమేమీ కాదు. ఈ విధమైన కృషి కొనసాగితే కొత్త అనువాదకుల తరం తయారవుతుంది. అనేక తెలుగు రచనలు ఇంగ్లీషులోకి వెళ్తాయి. అట్లా అనువాదమైన రచనల్ని ప్రపంచ స్థాయి అవార్డులకు పంపించే వీలు కూడా ఈ సంస్థ ద్వారా లభిస్తుంది.

తెలుగు నుంచి ఎలాంటి రచనలు అనువాదం కాబోతున్నాయి?

అరబిక్, హిందీ, ఫారసీ, బెంగాలీ, ఇండొనేషియా, చైనీస్, కొరియన్, జపనీస్ లాంటి అనేక భాషల నుంచి ఇప్పటికే ఈ సంస్థ ద్వారా ఎన్నో అనువాదాలు ఇంగ్లీషులోకి అందుబాటులోకి తెచ్చాయి. ఇన్నేళ్ల ఈ సంస్థ చరిత్రలో మొట్టమొదటిసారి తెలుగుని ఈ సంస్థ తమ జాబితాలోకి తీసుకుంది. కాబట్టి, ఈ సంస్థ కింద తెలుగు రచన అనువాదం ఇదే మొదటిసారి. కాని, మొదటి విడతలోనే కనీసం పది మంచి ప్రతిపాదనలు తెలుగు నుంచి అందాయి. అలా వచ్చిన అనువాద ప్రతిపాదనల్లో ముద్దుపళని పద్యాల నుంచి నగ్నముని విలోమ కథల దాకా వున్నాయి. అయితే ఆశ్చర్యంగా ఆధునిక తెలుగు కవిత్వం నుంచి దళిత కవిత్వం అనువాదాలు కూడా పరిశీలనకి వచ్చాయి, మిగిలిన ప్రతిపాదనల్లో మూడు పద్యకావ్యాలు, అయిదు కథల సంపుటాలూ, మరి కొన్ని ఆత్మకథలూ వున్నాయి. ఒక ప్రసిద్ధ సినిమా కవి గురించిన ప్రతిపాదన కూడా వుండడం భిన్నంగా అనిపించింది.



ప్రతిపాదనలు వచ్చిన తర్వాత ఒక కమిటీ మౌలిక పరిశీలన చేసి, తుది జాబితా నాకు పంపిస్తుంది. ఆ జాబితా లోంచి నేను ఆ ఏడాది అనువాదం కావలసిన తెలుగు రచనని ఎంపిక చేస్తాను. ఈ విధంగా ఒక పెద్ద సంస్థ ద్వారా మన భాష రచనలు ఇంగ్లీషులోకి వెళ్ళి, అంతర్జాతీయ స్థాయి పబ్లిషర్లూ, ఎడిటర్ల దృష్టికి వెళ్ళడం నా మటుకు నాకు అపూర్వమే అనిపించింది. ప్రతిపాదనలతో పాటు అయిదారు పేజీల ఇంగ్లీషు అనువాదం కూడా అనువాదకులు పంపించాలి కాబట్టి అవి చదివే అవకాశం కూడా నాకు దక్కింది. వీటి నాణ్యత నాకు ఆశ్చర్యం కలిగించింది. చక్కని అమెరికన్ ఇంగ్లీషులో ఈ అనువాదాలు వున్నాయి. నిజానికి ఇవన్నీ అనువాదాలు చేయదగినవే. నెమ్మదిగా వాటిలో ఒక్కొకటీ తీసుకుంటాం.

ఈ వర్క్‌షాప్ నుంచి మనం ఎలాంటి ఫలితాలను ఆశించవచ్చు?

ప్రతి ఏడాదికి తెలుగు రచన ఒకటి మొత్తంగా ఇంగ్లీషులోకి అనువాదం అవుతుంది. అనువాద ప్రతి తయారైన తరవాత అనువాదకులనీ, పర్యవేక్షకులనీ అమెరికాలో ప్రతి ఏడాదీ ఒక్కో నగరంలో జరిగే లిటరరీ ఫెస్టివల్‌కి పిలిపిస్తారు. ఈ ఫెస్టివల్‌లో కేవలం రచయితలే కాకుండా అమెరికాలోని అంతర్జాతీయ స్థాయి ప్రచురణ కర్తలూ, వాటి ఎడిటర్లూ వస్తారు. అనువాదాల రీడింగ్ జరిగే సమయంలో వాళ్లందరినీ ఆహ్వానిస్తారు. రీడింగ్ తరవాత ఆ అనువాదం నచ్చితే ఎడిటర్లు, పబ్లిషర్లు, అనువాదకులతో పాటు నన్నూ చర్చలకి పిలుస్తారు. అనువాద రచన ప్రచురణ వైపు ఈ చర్చలు సాగుతాయి. అంటే, ఇలా ప్రతి ఏడాదీ ఒక తెలుగు రచన అమెరికాలోని ప్రసిద్ధ ప్రచురణ సంస్థ ప్రచురిస్తుందన్న మాట. ఇది చిన్న విషయమేమీ కాదు. ఈ విధమైన కృషి కొనసాగితే కొత్త అనువాదకుల తరం తయారవుతుంది. అనేక తెలుగు రచనలు ఇంగ్లీషులోకి వెళ్తాయి. అట్లా అనువాదమైన రచనల్ని ప్రపంచ స్థాయి అవార్డులకు పంపించే వీలు కూడా ఈ సంస్థ ద్వారా లభిస్తుంది. ■



ప్రియ పద్యం

ధ్యానం లాంటి అనుభూతినిస్తుంది!



మన శరీరాన్నీ, ఆలోచనలని, ఉద్వేగాలనీ, ఏకతాటిపైకి తీసుకురాగల శక్తి సృజన ప్రక్రియకు (అది ఏ కళారూపమైనా) ఉందని నమ్ముతాను. కళాసృజన ఏకాంతమైన ప్రక్రియ. కళలో నిమగ్నమైన మనిషి మానసిక స్థితి ఎలా ఉంటుందో, అతను ఎలాంటి ఎత్తులకు చేరుకోగలడో, ఈ కవిత చెబుతుంది. అనుభూతి ప్రధానమైన ఈ కవితలో, స్థలకాలాల ప్రస్తావనలు కవిత వాతావరణాన్ని సిద్ధపరచి ఉంచి, పాఠకుడిని అలవోకగా ఆ మహాబలిపురం వేకువ లోకి తీసుకుపోతాయి. కళ్ళులేని ఆ సంగీతకారుని ఎదుట కూర్చోబెడతాయి. కవితాత్మకంగా నడవడమొక్కటే కాదు, "చూశానా, కాదు కరుణించి కనబడ్డాడు" లాంటి లోతైన, సాంద్రమైన వాక్యాల ద్వారా, అతన్నీ, కళనీ, దైవాన్నీ కూడా ఒకేసారి స్ఫురింపజేస్తూ పొరలుపొరలుగా పరచుకున్నందుకు కూడా ఈ కవిత ప్రత్యేకం. "రగసియం సామీ, ఎనక్కు ఇంగెయే దరిసనమాగుం" అంటూ తమిళ పదాల్ని యథాతథంగా వాడడం ద్వారా నిర్దిష్ట సాంస్కృతిక నేపథ్యంలో నిలబడుతూనే, కళలోనే దైవాన్ని చూడడమనే ఒక సార్వత్రిక సందేశాన్నిస్తుందీ కవిత. వేణువుకున్న రంధ్రాలని అతని కళ్ళుగా పోలిక చేయడం ద్వారా కళలోంచే అతడు ప్రపంచాన్ని చూస్తున్నట్టు చెప్పడం చాలా నచ్చింది. ఇంద్రియ సరిహద్దుల్ని దాటి, భౌతిక పరిమితుల్ని దాటి ఒక ఆధ్యాత్మిక శిఖరంపై పాఠకుడిని నిలిపినట్టయింది. ఒక అనుభవాన్నో, అనుభూతినో కవిత చేయడం సాధారణంగా చూసేదే గానీ, ఆ కవిత పుట్టిన స్థలకాలాల్లోకి, అనుభవంలోకి పాఠకుడిని సునాయసంగా తీసుకెళ్తూ, గాలిలో సంగీతం పరచుకున్నంత తేలికగా, తాను పొందిన ధ్యానం లాంటి అనుభూతినే పాఠకుడూ పొందగలిగేలా చేసింది కాబట్టి ఇది నాకు నచ్చిన కవిత.

■ నవీన్ కుమార్
✆ 89194 46717

ఊపిరిపాటకు చూపేదీ?

శిల్పాల్నీ, శిథిలాల్నీ
సాగరాన్ని, నగరాన్నీ
మేల్కొలుపుతూ వినబడ్డాడతను
వేకువల్ని వణికించే వేణువుగా.

గాలి మడుగులో
రాగాల జాడలు పట్టుకుని
వెదుక్కుంటూ వెళ్ళి చూశానతన్ని
చూశానా? కాదు కరుణించి కనబడ్డాడు

పాట ఆపినపుడు
మురళితోబాటు మహాబలిపురాన్నే
సంచిలో పెట్టుకున్నాడా అని?
జలదరించిన ఉదయాలను
సంగీతానికి వదిలి
రాత్రుల్ని కళ్లుగా చేసుకున్నాడా అని?
అడగలేదు... ధ్యానానికి కొనసాగింపు
మౌనమే కావాలని.

బాగా రాత్రయింది, తోడొస్తాను
ఇంటిదాకా అంటే
నిశ్శబ్దంగా నవ్వాడు
చీకటి నా తోబుట్టువని
మీకు తెలీదా? అన్నట్టు

వీడ్కోలు వేళ మాటల్లో మాటగా
రోజూ అడిగినా గుళ్ళోకి రావేమంటే?
పంచేంద్రియాలకు అందని
పరవశంతో గుసగుసగా
'రగసియం స్వామీ!
ఎనక్కు ఇంగెయే దరిసనమాగుం'
(రహస్యం స్వామీ!
నాకు ఇక్కడే దర్శనమౌతుంది.)
అని నమస్కార ముద్రలో
తడుముకున్నాడు
వేణువు వొంటిపైన తన ఏడు కళ్ళనీ...

■ స్వాతికుమారి



తెగిన గొలుసుల చప్పుడు

పాత కాగితాలపై
ఎప్పుడో రాసిన పద్యాలు
ఛందస్సులో తెగిన
గొలుసుల చప్పుడు
తుప్పుపట్టిన తీగలపై
మోగుతున్న సంగీతం

చెదలు పట్టిన
పుటల్లో

అరిగిపోయిన శబ్దాలు
సడలిపోతున్న పిడికిళ్లపై
పెరిగిపోతున్న ముడతలు

బావుల్లాంటి కళ్లలో
ఇంకిపోయిన అశ్రువులు
రాలిపడుతున్న ఆకులతో
పోటీపడుతున్న శవాలు

ఎవరంతటవారు బూడిద
రాసుకుంటే
ఎవరికో ఎందుకు
తన్మయత్వం
ఎవరో ఆత్మాహుతి
చేసుకున్నారని తెలిస్తే
ఇంకెవరికెందుకో
దగ్ధ విషాదం

ప్రతి ముఖంలో ఉన్మాదం
ప్రతి కళ్లలో రక్తరేఖలు


చితుల వెలుగులో
సూర్యుడ్ని
చూడాలనుకోవడం భ్రమ
అస్తమయాలన్నీ
ఉదయాలు
అవుతాయనుకోవడం

అశాస్త్రీయం

ఎవరి తలపై
ఆకాశం వారిదే
పయనించే మేఘాలే
గగనాన్ని
శోభితం చేస్తాయి

■ కృష్ణుడు





చే'నేత' ఎన్నిక ఎప్పుడు?

సహకార సంఘాలపై సర్కారు చిన్నచూపు

- ఏడేళ్లుగా ఎన్నికలు నిర్వహించని వైనం
- 14 సార్లు గడువు పొడిగించిన ప్రభుత్వం
- చేనేత సంఘాలకు అందని ప్రభుత్వ పథకాలు
- అభయ హస్తం పథకం అందని పరిస్థితి
- మిథ్యగా చేనేత భరోసా, చేనేత భద్రత పథకాలు
- ఇబ్బందుల్లో చేనేత కార్మికులు.. పనిలేక పస్తులు..

హనుమకొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘాలకు ఎన్నికలను ప్రభుత్వం ఇప్పట్లో నిర్వహించేలా కనిపించడం లేదు. ఏడేళ్లుగా గడువును పొడిగిస్తూ వస్తోంది. గతంలో ఉన్న పాలకవర్గాలకే పర్సన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించడం కొనసాగిస్తోంది. 2013 ఫిబ్రవరి 12న ఎన్నికైన పాలకవర్గాల పదవీ కాలం 2018 ఫిబ్రవరి 11తో ముగిసింది. ప్రభుత్వం ప్రతీ ఆర్నెళ్లకోసారి గడువు పొడిగిస్తూ వస్తోంది. ఇప్పటికే 14దఫాలుగా గడువు పొడిగించారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఎన్నికలు నిర్వహించి సహకార సంఘాలకు జీవం పోయాలని చేనేత సహకార, పారిశ్రామిక సంఘాల నాయకులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఆ సూచనలేవి కనిపించడం లేదు. స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టిన ప్రభుత్వం.. సహకార సంఘాలకు ఇప్పట్లో ఎన్నికలు జరిపే ఆలోచనలో లేనట్లు కనిపిస్తోంది. ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎన్నికల నిర్వహణపై ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని చేనేత సహకారం సంఘాలకు మరికొంత కాలం ఎదురుచూపులు తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

పదివేలకు పైగా కుటుంబాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు పది వేల కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఒక్క కొత్తవాడ, మట్టివాడ ప్రాంతంలోనే 3వేల కుటుంబాలు చేనేతను నమ్ముకొని బతుకులీడుస్తున్నాయి. హనుమకొండ జిల్లాలోని శాయంపేట, పరకాల, ఆత్మకూరు తదితర మండలాలు, వరంగల్ జిల్లాలో కొత్తవాడ, మట్టివాడ ప్రాంతాలతో పాటు గీసుకొండ, రేగొండ తదితర మండలాల్లో చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కొన్ని మండలాల్లో కూడా చేతనే కార్మికులు ఉన్నారు.

ఓటర్ల జాబితా సిద్ధమైనా..

ఇప్పటికిప్పుడు చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని అనుకున్నా 45 రోజుల ముందు నోటిఫికేషన్ జారీ చేయాలి. ఓటు హక్కు అర్హత ఉన్న సహకార సంఘాల సభ్యుల జాబితాను చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో సిద్ధం చేయాలి. 2018లో ఎన్నికలు నిర్వహించేందుకు చేనేత సహకార సంఘాల్లో సభ్యత్వం కలిగిన వారందరినీ పాస్‌బుక్ ఆధారంగా ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను సైతం ప్రభుత్వం తయారు చేసింది. ఈ ఓటర్ల జాబితాను ఇప్పటివరకు నవీకరించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన చేనేత అభయ హస్తం పథకాన్ని సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నా చేనేత పాలకవర్గాలను ఎన్నుకోవలసిన అవసరం ఉంది. ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకునేందుకు అభయ హస్తం పథకాన్ని ప్రకటించిందే కానీ.. ఆ మేరకు సంఘాలకు నిర్వహించాల్సిన ఎన్నికలను మాత్రం పట్టించుకోవడం లేదు.

అభయ హస్తం

రాష్ట్రంలోని చేనేత, జౌళి కార్మికులకు రూ.168కోట్లతో చేనేత అభయ హస్తం పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా నేతన్న పొదుపు నిధికి రూ.115 కోట్లు, నేతన్న భద్రతకు రూ.9కోట్లు, నేతన్న భరోసాకు రూ.44 కోట్లు కేటాయించారు. ఈమేరకు చేనేత జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామ అయ్యర్ ఉత్తర్వులు (జీవో నెం.3) జారీ చేశారు. సొసైటీల పరిధిలోని చేనేత కార్మికులకే ఈ పథకం వర్తిస్తుంది. సుదీర్ఘకాలంగా సొసైటీలకు ఎన్నికలు లేక అవి నిర్వీర్యం అయ్యాయి. సంఘాలు సరిగా పని చేయకపోవడంతో చాలామంది సభ్యులు అందులో నుంచి బయటకు వచ్చారు. కొత్త సభ్యులను చేర్చుకోలేదు. పాలక వర్గాలే లేకపోవడం ఈ సంఘాలన్నీ కుంటుపడి ప్రభుత్వ పథకాల ఫలాలను అందుకునే స్థితిలో లేవు. చేనేత కార్మికుడు సంఘంలో సభ్యుడై ఉంటే నేతన్న పొదుపు నిధి, నేతన్న భద్రత పథకాలు వర్తిస్తాయి. నేతన్న పొదుపు నిధి కింద చేనేత కార్మికులు తమ వేతనంలో ప్రతి నెలా 8 శాతం (1200 గరిష్ఠ పరిమితితో) పొదుపు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం దానికి రెట్టింపు వాటా 16శాతం జమ చేస్తుంది. అలాగే మరమగ్గాల కార్మికులు నెలవారీ వేతనంలో 8శాతం పొదుపుచేస్తే ప్రభుత్వం 8 శాతం వాటా జమచేస్తుంది. నేతన్న భద్రత పథకం కింద చేనేత, మరమగ్గాలు, అనుబంధ వృత్తుల కార్మికుందరికీ ఉచిత జీవిత భీమా పథకం వర్తిస్తుంది. దీని కింద నమోదు చేసుకున్న కార్మికులు ఏ కారణం తోనైనా మరణిస్తే వారి వారసుల (నామినీల)కు రూ.5లక్షలు చెల్లిస్తారు. ఇక నేతన్న భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ముద్రించి ఇచ్చే మార్క్ లేబుళ్లను ఉపయోగించి చేనేత కార్మికులు తయారు చేసే వస్త్ర ఉత్పత్తులకు వేతన మద్దతును అందిస్తుంది. ఉత్పత్తి చేసిన వస్త్రాల పరిణామానికి అనుగుణంగా ఒక సంవత్సరానికి ఒక్కోచేనేత కార్మికుడికి రూ.18వేల వరకు, అనుబంధ కార్మికుడికి రూ.6వేల వరకు మంజూరు చేస్తారు. అయితే వీరంతా చేనేత సహకార సంఘాల్లో విడిగా సభ్యులై ఉండాలి.

ప్రయోజనాలు

చేనేత సహకార సంఘాలకు పాలకవర్గాలు ఉండడం వల్ల కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. ప్రభుత్వం ద్వారా కార్మికులకు మేలు చేసే విధంగా సంఘాలవారీగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. నూలు, రంగు రసాయనాలను కార్మికులకు సబ్సిడీపై అందించవచ్చు. ప్రభుత్వపరంగా సంక్షేమ పథకాలు రుణాలు అందించడంతోపాటు సహకార సంఘాలు కూడా కార్మికులకు వ్యక్తిగతంగా రుణాలు అందించే అవకాశం ఉంటుంది. తద్వారా చేనేత కార్మికులకు ఉపాధి లభించి ఆర్థికంగా, సామాజికంగా ఉన్నతి సాధించేందుకు అవకాశం ఏర్పడుతుంది. కనుక చేనేత సహకార సంఘాలకు తక్షణం ఎన్నికలు నిర్వహించాలని సంఘాల నేతలు, చేనేత కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కాగా ఎన్నికల నిర్వహించే విషయంలో తమకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చేనతే, జౌళి శాఖ అధికారులు చెబుతున్నారు.

64 చేనేత సంఘాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 64 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. వరంగల్ జిల్లాలో 29 సంఘాలు ఉండగా, వీటిలో 2,500 మంది సభ్యులు ఉన్నారు. హనుమకొండ జిల్లాలో 17 సంఘాలు ఉండగా, 1,050 సభ్యులు, జనగామ జిల్లాలో 11 సంఘాలు ఉండగా, 570 సభ్యులు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 7సంఘాలు ఉండగా, 250 మంది సభ్యులు ఉన్నారు. ములుగు, మహబూబాబాద్ జిల్లాలో చేనేత సహకార సంఘాలు లేవు. వరంగల్‌లోని కొత్తవాడలో చేనేత సంఘాలు ఎక్కువగా ఉన్నాయి. వరంగల్, హనుమకొండ జిల్లాలోనే చేనేత కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారు. చేనేత సహకార సంఘాల్లో ఎక్కవ కార్పెట్లు, బెడ్‌షీట్లు, టవల్స్, గార్మెంట్స్ ఉత్పత్తి అవుతున్నాయి. చీరలు నేసే సహకార సంఘాలు చాలా తక్కువ. పవర్ లూమ్ సహకార సంఘాలు కూడా అంతగా లేవు. పాత పాలకవర్గాలే కొనసాగుతుండడంతో చేనేత సంఘాలను పట్టించుకోక అవి అస్తవ్యస్తంగా మారుతున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలికి 'రాములమ్మ'

- ఎమ్మెల్యే కోటాలో విజయశాంతికి అవకాశం
- స్వగ్రామమైన ములుగు జిల్లా రామన్నగూడెంలో సంబరాలు



ములుగు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సినీ నటి, రాజకీయ నాయకురాలు విజయశాంతిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. ఎమ్మెల్యే కోటాలో ఆమెకు ఈ అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె మూలాలు మరోసారి తెరపైకి వచ్చాయి. 2005లో తల్లి తెలంగాణ పార్టీని స్థాపించిన తొలిరోజుల్లో తన స్వస్థలం ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలం రామన్నగూడెంగా విజయశాంతి ప్రకటించుకున్నారు. తాను చెన్నైలో పుట్టి పెరిగినప్పటికీ తన పూర్వీకులు రామన్నగూడెంలో నివాసం ఉండేవారని తెలిపారు. సినీరంగంలో అగ్ర కథానాయికగా కొనసాగుతూ అభిమానుల చేత రాములమ్మగా పిలవబడుతున్న ఆమె.. రాజకీయ రంగంలోకి అడుగుపెట్టిన తర్వాత తన స్వస్థలంపై చేసిన ప్రకటన అప్పట్లో సంచలనం కలిగించింది. స్వయంగా రామన్నగూడెం వచ్చిన విజయశాంతి స్థానికులతో మమేకమయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, బీజేపీలో చేరిన తర్వాత ఆమె పలుమార్లు ములుగుకు వచ్చారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తాజాగా కాంగ్రెస్ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయశాంతిని ప్రకటించడంతో రామన్నగూడెంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం, ఎమ్మెల్యేల సంఖ్యాబలం చూసుకుంటే విజయశాంతి గెలుపు దాదాపు ఖరారైనట్లేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

రారండోయ్.. ఇస్రోను చూసొద్దాం..

- 9వ తరగతి విద్యార్థులకు ఆహ్వానం
- యువ విజ్ఞాన కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రోత్సాహం
- ఏప్రిల్‌లో ఎంపిక, మేలో 14 రోజుల పాటు శిక్షణ
- అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన
- ఎంపికైన విద్యార్థులకు ఉచిత సౌకర్యం

7



ఎంజీఎం ప్రక్షాళనకు

సర్కార్ ఫోకస్?

- సమర్థవంతమైన సూపరింటెండెంట్ నియామకం కోసం అన్వేషణ
- రేసులో మహబూబాబాద్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్?
- పలువురు మాజీలు సైతం ప్రయత్నాలు ముమ్మరం

వరంగల్ మెడికల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కొన్ని నెలలుగా గాడితప్పిన ఎంజీఎం ఆస్పత్రి పరిపాలనను పక్షాళన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదల ఆస్పత్రి నిత్యం వివాదాలతో సతమతమవుతోంది. ఆస్పత్రిలో సూపరింటెండెంట్ పోస్టుతోపాటు సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్, ఆర్ఎంవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సూపరింటెండెంట్‌గా ప్రభుత్వం పలువురిని నియమించినప్పటికీ వారు విధుల్లో చేరేందుకు ఆసక్తి కనబర్చడం లేదు. గత్యంతరం లేక ఓ ప్రొఫెసర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా, మధ్యలోనే ఆయన విధుల నుంచి తప్పుకున్నారు. ప్రస్తుతం ఉన్న సూపరింటెండెంట్‌కు కలెక్టర్ ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. అయినప్పటికీ ఎలాంటి సంతకాలు చేయకపోవడంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. వందల సంఖ్యలో ఫైళ్లు పేరుకుపోయాయి. 8 నెలలుగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులన్నీ నిలిచిపోయాయి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపులో కూడా తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇలా గాడి తప్పిన ఎంజీఎం పరిపాలనను మెరుగుపర్చేందుకు సమర్థవంతమైన సూపరింటెండెంట్ కోసం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ వెతుకులాట ప్రారంభించినట్లు తెలుస్తోంది.

రేసులో డాక్టర్ లకావత్ వెంకట్

ఎంజీఎం పరిపాలనను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం సమర్థవంతమైన ప్రొఫెసర్‌ను సూపరింటెండెంట్‌గా నియమించేందుకు చర్యలు ప్రారంభించింది. మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ లకావత్ రేసులో ముందున్నట్లు తెలుస్తోంది. 2017 నుంచి 2021 వరకు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా, 2022 నుంచి 2024 వరకు మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా, గత ఏడాది కాలం నుంచి మహబూబాబాద్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగుతు న్నారు. గతంలో ఫ్యామిలీ ప్లానింగ్ సర్జన్‌గా అనేక అవార్డులు అందుకున్నారు.

కాగా, నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ రజామాలిక్ పేరును కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎంజీఎం ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా పనిచేసి బదిలీ అయిన మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ములుగు ప్రొఫెసర్‌గా బదిలీ అయిన చంద్రశేఖర్ కూడా అవకాశం కోసం ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఈ మాసాంతంలో సమర్థవంతమైన వైద్యుడిని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించే యోచనలో ఉన్నట్లు సమాచారం.

వరంగల్‌తో ఆరేళ్ల అనుబంధం

- ఇక్కడ పనిచేయడం చాలా సంతృప్తినిచ్చింది..
- బదిలీపై వెళుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

ఘనంగా వీడ్కోలు పలికిన కమిషనరేట్ పోలీసులు



అంబర్ కిషోర్ ఝా వాహనాన్ని తాడుతో లాగుతున్న పోలీసు అధికారులు

వరంగల్ క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌తో ఆరేళ్ల అనుబంధమని, ఇక్కడ పని చేయడం చాలా సంతృప్తినిచ్చిందని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం సీపీగా బదిలీపై వెళ్తున్న అం బర్ కిషోర్ ఝాతో పాటు ఈస్ట్‌జోన్ డీసీపీగా పనిచేసి సీఐడీ ఎస్పీగా బదిలీపై వెళ్తున్న రవీందర్‌ను ఆదివారం కమిషనరేట్ పోలీసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. జిల్లాలో ఓఎస్డీగా, ఎస్పీగా పనిచేయండంతో పాటు వరంగల్ పోలీస్ కమిషనర్‌గా పని చేయడం చాలా సంతోషాన్ని కలిగించంద న్నారు. నేరస్తులను పట్టుకోవడంలో వరంగల్ పోలీసులు దిట్ట అని, ఎలాంటి పని అయిన విజయవంతంగా పూర్తి చేయడంలో వరంగల్ పోలీసులకు ప్రత్యేకత ఉందన్నారు. రాణి రుద్రమదేవి పాలించిన నేలపై పని చేసినందుకు గర్వపడుతున్నానని అన్నారు.

సీఐడీ ఎస్పీ రవీందర్ మాట్లాడుతూ.. సిబ్బంది, పోలీసులు సమన్వయంతో పని చేయడం వరంగల్ పోలీసులు ప్రత్యేక అని, ఇక్కడ పని చేసినంత కాలం ప్రశాంతంగా విధులు నిర్వర్తించానన్నారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా ఉన్న పూలతో అలంకరించిన పోలీసు వాహనాన్ని డీసీసీ స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకు తాడుతో లాగుతూ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో డీసీసీలు షేక్ సలీమా, రాజ మహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, ఏఆర్ అడిషినల్ డీసీపీలు, ఏసీపీలు, సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ స్పాట్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని ఎల్బీ కళాశాలలో సోమవారం నుంచి ఇంటర్మీడియెట్ స్పాట్ క్యాంపును ప్రారంభిస్తున్నట్లు డీఐఈవో, క్యాంపు ఆఫీసర్ డాక్టర్ గంగిశెట్టి శ్రీధర్ సుమన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు ఈ ఏడాది నుంచి కొత్తగా ఎల్బీ కళాశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రంలో సంస్కృతం సబ్జెక్టుతో మూల్యాంకనం ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్రంలో అన్ని వసతులతో కూడిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈస్పాట్ క్యాంపులో వరంగల్ జిల్లాతో పాటు ములుగు, మహబూబాబాద్ జిల్లాల మూల్యాంకన సిబ్బంది పాల్గొనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మల్లన్న సన్నిధిలో పట్నాల కోలాహలం



నజర్ పట్నాలతో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఐనవోలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి వారాంతపు జాతరకు ఆదివారం వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి వరకు అలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంతోపాటు పరిసర ప్రాంతాల్లో ఆరుబయట విడిదిచేశారు. స్వామివారికి ఉదయం మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు కల్యాణం నిర్వహించి రుద్రాభిషేకాలు జరిపారు. ఆయా జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో నజర్, చెలక పట్నాలు వేసి బోనం వండి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాల వద్ద పూర్వీకులను స్తుతించారు. ఆపదల నుంచి గట్టెకించి కోర్కెలు తీర్చమని మల్లన్నను భక్తులు వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, ముతైదు సామగ్రిని ముట్టచెప్పగా కొందరు రథసేవను నిర్వహించారు. రథంలో ఉత్సవ విగ్రహాలను పెట్టి ఆలయం చుట్టూ లాగుతూ ప్రదక్షిణలు చేశారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ రాజనీతిశాస్త్ర విభాగాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

» వీసీ ప్రతాప్‌రెడ్డి » రాజనీతిశాస్త్ర అలుమ్నీ హాల్ ప్రారంభం

కేయూ క్యాంపస్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం వర్సిటీలోని అన్ని విభాగాలకు ఆదర్శంగా నిలుస్తోందని, వర్సిటీ తరఫున తాము మరింత అభివృద్ధి చేస్తామని వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి చెప్పారు. ఆదివారం రాజనీతిశాస్త్ర విభాగంలో నూతనంగా నిర్మించిన అలుమ్నీ హాల్‌ను వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంకినేని వెంకట్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీసీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజనీతిశాస్త్ర పూర్వ విద్యార్థులు, ప్రస్తుత అధ్యాపకులు, స్కాలర్లు స్వయంగా నిర్ణయం తీసుకుని అలుమ్నీ హాల్‌ను నిర్మించడం గర్వనీయమన్నారు. ప్రభుత్వం నుంచి సహకారం లేకున్నప్పటికీ సొంతంగా నిధులతో ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వర్సిటీలోని అన్ని విభాగాలకు రాజనీతిశాస్త్రం ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. వర్సిటీలోని అన్ని విభాగాల పూర్వ విద్యార్థులందరూ సహాయంతో విభాగాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. రాజనీతిశాస్త్ర విభాగంలో గదులు, కంప్యూటర్లు, ఫర్నిచర్‌తో పాటు ఇతర సౌకర్యాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. కృషి సంకల్పం ఉంటే సాధ్యం అవుతోందని చెప్పారు.

విశిష్ట అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. అంబేద్కర్ పేబ్లాక్ సొసైటీ నినాదంతో పూర్వ విద్యార్థులు ముందుకు రావడం హర్షణీయమని చెప్పారు. రాజనీతిశాస్త్ర విభాగం అభివృద్ధికి తన వంతుగా సహకరం అందిస్తానని వివరించారు. అధ్యాపకుల సమస్యలను తీరుస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ఏసీపీ జితేందర్‌రెడ్డి, డాక్టర్ జి.కృష్ణయ్య, ప్రొఫెసర్ గుగులోత్ వీరన్న నాయక్, ప్రొఫెసర్ కె.రఘురాంరెడ్డి, డాక్టర్ హరిప్రసాద్, వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వాడపల్లి నాగరాజు, డాక్టర్ సోమలింగం, బి.సారంగపాణి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, చిర్ర రాజు, స్కాలర్లు ఎ.శంకర్, కె. ప్రశాంత్, జి. సురేశ్, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

• ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా



కొత్తగూడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఐటీడీఏ మోడల్ క్రీడా పాఠశాలలో, బోయినపల్లిలోని వాటర్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. 2025, 2026 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు కొత్తగూడలోని మోడల్ క్రీడా పాఠశాలలో 5వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో 5సీట్లు, 8వ తరగతిలో 6సీట్లు, 9వ తరగతిలో 6సీట్లు, 10వ తరగతిలో 10సీట్లు ఉన్నాయన్నారు. బోయినపల్లిలోని వాటర్ స్పోర్ట్స్ స్కూల్‌లో 5వ తరగతిలో 10సీట్లు బాలికలకు, 10సీట్లు బాలుర విద్యార్థులకు ఉన్నాయన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి 15 వరకు ములుగు, భూపాలపల్లి జిల్లాల విద్యార్థులు పీఎంఆర్‌సీ ఏటూర్‌నాగరంలో, వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల విద్యార్థులు పీఎంఆర్‌సీ హన్మకొండలో, మహబూబాబాద్ జిల్లా విద్యార్థులు పీఎంఆర్‌సీ మహబూబాబాద్‌లో ధరకాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 17వ తేదీ నుంచి 20 వరకు ఆయా జిల్లాలో విద్యార్థుల ఎంపిక నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 26వ తేదీ నుంచి 28వరకు కొత్తగూడలో ఐటీడీఏ నియమించిన కమిటీ ఆధ్వర్యంలో తుది ఎంపిక నిర్వహిస్తున్న పేర్కొన్నారు.

మొరాయిస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు

» ఒక్కట్రిప్పుకే చార్జింగ్ నిల్
» అధికలోడుతో దెబ్బతింటున్న బస్సులు
» ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

హనుమకొండ టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) మారుతున్న కాలానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కాలుష్య రహితం కోసం ఎలక్ట్రిక్ బస్సులను తీసుకువచ్చింది. వరంగల్ రీజనల్‌కు 82 బస్సులను కేటాయించారు. ఈ బస్సులను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జనవరి 6న ప్రారంభించారు. ఈ బస్సులు పూర్తిగా చార్జింగ్‌తోనే నడుస్తుండడంతో ప్రయాణికులు ఈ బస్సుల్లో ప్రయాణించేందుకు ఉత్సాహం కనబరుస్తున్నారు. హనుమకొండ బస్టాండ్ నుంచి వివిధ రూట్లలో మొత్తం 82 ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.



హనుమకొండ బస్టాండ్‌లో ఉన్న ఎలక్ట్రిక్ బస్సు



వరంగల్-2 డిపోలో చార్జింగ్ పాయింట్ వద్ద ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్లు

మొరాయిస్తున్న బస్సులు

ఎలక్ట్రిక్ బస్సులు వరంగల్‌కు వచ్చి రెండు నెలలు పూర్తి కాక ముందే మొరాయిస్తున్నాయని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. అధికలోడుతో బస్సులు దెబ్బతింటున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. మహాలక్ష్మీ పథకంతో మహిళలకు ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రయాణించేందుకు వెసులుబాటు ఉన్నా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సులు మొరాయిస్తున్నాయని పేర్కొంటున్నారు.

నిర్వహణ అస్తవ్యస్తం

వరంగల్-2డిపోలో ఎలక్ట్రిక్ బస్సుల కోసం 22 చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 82 బస్సు సర్వీసులు నడుస్తున్నాయి హనుమకొండ బస్టాండ్ నుంచి హైదరాబాద్, ఉప్పల్, హనుమకొండ నుంచి ఖమ్మం, సిద్దిపేట, మంగపేట, సూర్యాపేట, నిజామాబాద్ వరకు ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా ప్రయాణికులకు సేవలందిస్తున్నారు. హనుమకొండ బస్టాండ్‌లో ఎలక్ట్రిక్ బస్సుల కోసం సరైన పార్కింగ్ లేక ఎక్కడ పడితే అక్కడ బస్సులను నిలపడంతో బస్టాండ్‌లో బస్సుల రద్దీ పెరిగి నిత్యం బస్సులను పాయింట్ల మీదకు తీసుక రావాలంటే ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్లు, ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బందికి గొడవలు జరుగుతున్నట్లు ఆర్టీసీ సిబ్బంది కొందరు చెబుతున్నారు.

ఒక్కట్రిప్పుకే చార్జింగ్ నిల్

హనుమకొండ నుంచి ఉప్పల్, హైదరాబాద్ వెళ్లి హనుమకొండకు వస్తుండగానే ఒక్కోసారి చార్జింగ్ అయిపోయి 60 స్పీడ్‌తో వెళ్లే బస్సులు 20 స్పీడ్‌తో వెళ్తున్నట్లు కొందరు ప్రయాణికులు వాపోతున్నారు.

వేసవికి ముందే బస్సుల సతమతం

వేసవి ఎండలు ముదరక ముందే టెంపరేచర్ పెరిగి బస్సులు అగిపోతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఎండలు ముదిరితే ఎలక్ట్రిక్ బస్సుల పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎలక్ట్రిక్ బస్సుల నిర్వాహణపై అధికారులు అప్రమత్తంగా ఉండి మొరాయిస్తున్న బస్సులపై ఎప్పటికప్పుడు టెక్నీషియన్లతో బస్సులు నిర్వాహణ చేపట్టాలని డ్రైవర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అవగాహన లేమితో సమస్యలు

ఎలక్ట్రిక్ బస్సులు నడిపే డ్రైవర్లు, టెక్నీషియన్లకు బస్సులపై పూర్తి అవగాహన లేకపోవడంతోనే బస్సులు నిలిచిపోతున్నట్లు ఎలక్ట్రిక్ బస్సుల నిర్వాహకులు చెబుతున్నారు. పూర్తి స్థాయి అవగాహనతోనే బస్సులను నడపాలని చెబుతున్నారు.

వర్గీకరణ అమలయ్యేంతవరకు నియామకాలు నిలిపివేయాలి

ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ



రిలే నిరాహార దీక్షలను ప్రారంభిస్తున్న మంద కుమార్ మాదిగ

హనుమకొండ టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలను నిలిపివేయాలని ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ హాజరై రిలే దీక్షలు ప్రారంభించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ చేస్తామని, అవసరమైతే నియామకాల ఫలితాల్లో వర్గీకరణ అమలు చేస్తామని చెప్పి గ్రూప్-1, 2, 3, హెచ్‌డబ్ల్యూవో, ఉద్యోగాల ఫలితాలు విడుదల చేయడం మాదిగలను మోసం చేసినట్లేనని అన్నారు. ముఖ్యమంత్రి మోసపూరిత వైఖరికి నిరసనగా మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎస్సీల వర్గీకరణ అమలు చేసేంత వరకు ఈ దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ప్రభుత్వం జాప్యం చేస్తే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు జన్ను దినేష్ మాదిగ, మంద రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, నాయకులు మంద చిన్న మాదిగ, చేతళ్ల శివ మాదిగ, దరిగి శ్రీనివాస్ మాదిగ, తోట శ్రీనివాస్ మాదిగ, సుంచు రజినీకుమార్ మాదిగ, భట్టు స్వామి మాదిగ, బొక్క రాజేష్ మాదిగ, మంద వర్ధన్ మాదిగ, ఎర్ర రాము మాదిగ, వస్కుల రాకేష్ మాదిగ, సౌరం రమేష్ మాదిగ, వద్దునూరి కిరణ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

సమీకృత రెసిడెన్షియల్‌కు నిధులు మంజూరు

కోనాయిచలం పరిధిలో గురుకులం ఏర్పాటు

జఫర్‌గడ్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్‌కు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమీకృత గురుకుల పాఠశాలల (యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్) ఏర్పాటు కోసం ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 55 పాఠశాలలకు 11 వేల కోట్ల నిధులను కేటాయించిందన్నారు. జిల్లాకు మంజూరైన ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలను స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని జఫర్‌గడ్ మండలం కోనాయిచలం శివారులో 161/సి/2 సర్వే నంబరులోని 21 ఎకరాల ప్రభుత్వ భూమిలో నిర్మించేందుకు నిర్ణయించారు. ఇందుకు గాను ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ స్థల పరిశీలన సైతం జరిపారు. ఈ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ఈనెల 16న స్టేషన్‌ఘన్‌పూర్‌కు విచ్చేస్తున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని ఆయన తెలిపారు. పాఠశాలలకు నిధులు మంజూరు చేయడం హర్షణీయమని, ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆ ప్రకటనలో తెలిపారు. నిరుపేద విద్యార్థుల విద్యా ప్రగతికి ఈ సమీకృత గురుకుల పాఠశాలలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి

జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్

జనగామ కల్చరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు క్రమశిక్షణ, సంస్కారంతో కూడిన విద్యను అందించాలని జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఎస్‌పీఆర్ స్కూల్‌లో గత ఐదు రోజులుగా రమేశ్ గురూజీ ఆధ్వర్యంలో సంస్కార వికాస సాధన యోగా శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి తల్లిదండ్రులకు, ఆచార్యుల పాదపూజా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఆచార్యులను భక్తిశ్రద్ధలతో పూజించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ కీర్తి వీరేందర్ అధ్యక్షత వహించగా డీసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల పిల్లలు తల్లిదండ్రులను, గురువులను గౌరవించడంతో పాటు సమాజంలో విలువలతో కూడిన పౌరులుగా తయారవుతారన్నారు. తల్లిదండ్రులు పిల్లలను నిరంతరం గమనిస్తూ వారు ఫోన్‌లో ఎలాంటి యాప్‌లకు ఆకర్షణ కాకుండా, చెడు వ్యసనాలకు గురి కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కేవీఎల్ ఎన్.రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఆచార్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

పీఎంశ్రీతో సర్కార్ బడులకు ట్యాబ్‌లు

• జిల్లాలో 11 పాఠశాలలకు 275 సరఫరా • త్వరలోనే విద్యార్థులకు పంపిణీ • ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

హనుమకొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ పథకం ద్వారా జిల్లాలోని 11 ప్రభుత్వ పాఠశాలలకు 275 అధునాతన ట్యాబ్‌లు సరఫరా అయ్యాయి. ఒక్కో పాఠశాలకు 25 చొప్పున ప్రభుత్వం వీటిని పంపిణీ చేసింది. ఇప్పటికే ఈ ట్యాబ్‌లు సంబంధిత పాఠశాలలకు చేరాయి. త్వరలో వాటిని పంపిణీ చేస్తారు. ఈ ట్యాబ్‌లతో పిల్లలకు పరిశోధనలు, ఆయా విషయాలపై పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ వేదికగా తరగతుల నిర్వహణ, తదితరాలు నిర్వహిస్తారు. సబ్జెక్టులపై పూర్తి స్థాయిలో పరిజ్ఞానం పెంపొందించే లక్ష్యంతో వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. పీఎంశ్రీ కింద సరఫరా చేసిన ట్యాబ్‌లతో పిల్లలకు మెరుగైన విద్య అందుతుందని హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి తెలిపారు.



ఈ పాఠశాలలకే ట్యాబ్‌లు

వంగర టీఎస్ఆర్ఈఐఎస్, వేలేరు టీఎస్ఆర్ఈఐఎస్ హెచ్ఎస్, ఎల్కతుర్తి టీఎస్ఎంఎస్, కమలాపూర్ బాలుర ఎంజేటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్, హసన్‌పర్తి జడ్పీఎస్ఎస్, ధర్మసాగర్ జడ్పీహెచ్ఎస్ (బాలికలు) మడికొండ జడ్పీహెచ్ఎస్, ఒంటిమామిడిపల్లి జడ్పీహెచ్ఎస్, పరకాల జడ్పీహెచ్ఎస్ (బాలికలు) పరకాల టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ హెచ్ఎస్, శాయంపేట ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్‌లకు 25 చొప్పున ట్యాబ్‌లు అందాయి.



సర్కార్ బడుల బలోపేతానికి కృషి

సర్కారు బడుల బలోపేతానికి ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత విద్యాలయాలను ఈ పథకం ద్వారా ఎంపిక చేసింది. ఎంపిక ప్రక్రియను రెండు దఫాలుగా చేపట్టారు. ఇందులో పిల్లలకు నాణ్యమైన విద్యా బోధతో పాటు మౌళిక వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఇప్పటికే విద్యాలయాల్లో పలు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. తాజాగా అధునాతన విద్యాబోధనకు అనుగుణంగా ట్యాబ్‌లను అందజేశారు. విద్యాబోధనలో కొత్త హంగులు సంతరించుకుంటున్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాలయాల స్థాయిలో సర్కారు బడులను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాల అమలు కోసం ఇప్పటికే కార్యాచరణ రూపొందించారు. దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారులు ప్రత్యేకంగా మార్గనిర్దేశం చేస్తున్నారు.

క్రైం కార్నర్

గొంతులో పల్లిగింజ అడ్డుపడి బాలుడి మృతి

గూడూరు మండలం నాయక్‌పల్లిలో ఘటన



అక్షయ్ శివ ప్రేమ్‌కుమార్ (ఫైల్)

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పల్లిగింజ గొంతులో అడ్డుపడి.. ఓ బాలుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం నాయక్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. నాయకపల్లి గ్రామానికి చెందిన గుండెల వీరన్న-కల్పన దంపతులకు ఇద్దరు కుమార్తెలు దివ్యశ్రీ, భవ్యశ్రీ, ఏడాదిన్నర బాలుడు అక్షయ్ శివ ప్రేమ్‌కుమార్ సంతానం. ఈనెల 7న శుక్రవారం ఇంటివద్ద పల్లిగింజలు తింటుండగా ఒక్కసారిగా పొలమారి గింజ ఊపిరితిత్తుల్లోకి వెళ్లింది. దీంతో శ్వాస పీల్చుకోవడం ఇబ్బంది పడుతుండడంతో గమనించిన కుటుంబసభ్యులు బాలుడిని మరుసటిరోజు శనివారం చికిత్స నిమిత్తం వరంగల్ ఏంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ. బాలుడు అక్షయ్ మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి బ్రెయిన్ డెడ్

అవయవదానానికి అంగీకరించిన తల్లిదండ్రులు



శ్రీనాథ్ (ఫైల్)

రఘునాథపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పెళ్లి బరాత్‌కు వెళ్లిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బ్రెయిన్ డెడ్ అయ్యింది. ఆ యువకుడి తల్లిదండ్రులు అవయవదానానికి అంగీకరించారు. ఈ సంఘటన మండలంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం శ్రీమన్నారయణపురానికి చెందిన చిన్నం రవి-సునీత దంపతులకు కుమారుడు శ్రీనాథ్(20), కూతురు శిరీష ఉన్నారు. శ్రీనాథ్ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 6న గ్రామంలో స్నేహితుడి పెళ్లి బరాత్‌లో పాల్గొనేందుకు స్నేహితులతో కలిసి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొంది. ఈ ఘటనలో శ్రీనాథ్ తలకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న శ్రీనాథ్ ఆదివారం బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బ్రెయిన్ డెడ్ కావడంతో అవయవదానంపై అక్కడి వైద్యులు శ్రీనాథ్ తల్లిదండ్రులకు వివరించగా, పుట్టెడు దుఃఖంతో ఉన్నప్పటికీ పెద్ద మనస్సుతో అవయవదానానికి అంగీకరించడంతో అవయవాలను సేకరించారు. శ్రీనాథ్ మరణించినా మరి కొందరి జీవి తాల్లో వెలుగులు నింపనుండడం వల్ల తల్లిదండ్రులను పలువురు అభినందించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన శ్రీనాథ్ సోదరి శిరీష వివాహం ఈ నెల 16న జరుగాల్సి ఉంది. శ్రీనాథ్ మృతితో పెళ్లి ఇంటితో పాటు శ్రీమన్నారయణపురంలో విషాదం అలుముకుంది.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వరంగల్ క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోమటిపల్లి తండాలో ఆదివారం లక్ష రూపాయల విలువ చేసే 40 కిలోల పీడీఎస్ బియ్యం, ఎలక్ట్రానిక్ కాంటాను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. పీడీఎస్ వ్యాపారం చేసే మాలోతు రవి పరారీ కాగా, పట్టుబడ్డ మరో వ్యాపారి రమాదేవి, బియ్యంను స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు.

ముగిసిన ప్రవీణ్‌కుమార్, చైత్రసాయి, సాయివర్ధన్ అంత్యక్రియలు

నెల్లికుదురు (మహబూబాబాద్ జిల్లా), మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఎస్సారెస్పీ కాలువలో కారు పడి, కొట్టుకపోయి మృతి చెందిన ప్రవీణ్‌కుమార్, చైత్రసాయి, సాయివర్ధన్ అంత్యక్రియలు స్వగ్రామం మేచరాజుపెల్లిలో ఆదివారం జరిగాయి. ప్రవీణ్‌కుమార్, చైత్రసాయి, సాయివర్ధన్ మృతదేహాలను శనివారం వరంగల్ ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం స్వగామం మేచరాజుల్లికి తీసుకువచ్చారు. గ్రామస్థులు మృతదేహాలను చూసి, కన్నీటి పర్వంతమయ్యారు. ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి చెందిన వార్తవిని సుదూర ప్రాంతాల నుంచి, బంధువులు, స్నేహితులు తరలివచ్చి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ముగ్గురి మృతదేహాలను స్వర్గరథంలో గ్రామశివారు చెరువు వద్దకు తీసుకవెళ్లారు. ప్రవీణ్‌కుమార్ తండ్రి సోమారపు సారంగపాణి ముగ్గురికి తలకొరివిపెట్టి, చితికి నిప్పంటించి అంత్యక్రియలు పూర్తి చేశారు.



ప్రవీణ్‌కుమార్ చివరిచూపులో రోదిస్తున్న తండ్రి సారంగపాణి

మామిడి తోటల్లో ఫ్రూట్ బ్యాగింగ్

సత్ఫలితాలిస్తున్న విధానం
కాయ నాణ్యత పెరిగి అధిక లాభాలు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బ్యాగులకు 50 శాతం రాయితీ

భీమదేవరపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో ఫ్రూట్ బ్యాగింగ్ పద్ధతితో సత్ఫలితాలు సాధిస్తున్నారు. మామూలు పద్ధతిలో పండిన మామిడి కాయకు టన్నుకు రూ.25 వేల ధర పలుకుతుండగా ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన మామిడి కాయలకు రూ.50-70వేల వరకు మార్కెట్లో ధర పలుకుతుంది. ఫ్రూట్ బ్యాగింగ్ చేయడం వల్ల కాయ ఎండ, వాన, క్రిమీ కీటకాల తాకిడిని తట్టుకోవడమే కాకుండా తేమను సైతం తట్టుకుంటుంది. దీంతో ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన కాయ నాణ్యతతో ఉండడంతో మార్కెట్లో ఇట్టే అమ్ముడుబోతుంది. ఫ్రూట్ బ్యాగింగ్ గోధుమ రంగు కవరు 50-55 జీఎస్ఎం లోనా బ్లాక్ పేపర్‌తో 30-35 జీఎస్ఎం ఉండాలి. బ్యాగు సైజు 18-30 సెంటీమీటర్ల వరకు వాటర్ ప్రూఫ్‌తో ఉం టుంది. ఇలా కాయను ఫ్రూట్ బ్యాగింగ్ చేయడం వల్ల శ్వాసక్రియకు అనుకూలంగా ఉండాలి. మార్కెట్లో డిమాండ్ ఉన్న హిమాయత్, కేసర్, మల్లిక, బంగినపల్లి మామిడి కాయ లకు ఫ్రూట్ బ్యాగింగ్ చేస్తే రైతులు అధిక లాభాలు పొందవచ్చు.

పిందె ఏర్పడిన 45 రోజుల్లోగా బ్యాగింగ్ చేయాలి

మామిడి పిందె ఏర్పడిన 45 రోజుల తర్వాత నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఫ్రూట్ బ్యాగింగ్ చేయాలి. ఫ్రూట్ బ్యాగింగ్ చేసేటప్పుడు పండ్ల ఆరోగ్యాన్ని నిర్ధారించేందుకు పర్యవేక్షణ, నిర్వహణ క్రమం తప్పకుండా చేయాలి.

బ్యాగు కట్టే విధానం

బ్యాగును మామిడి కాయకు కట్టిన తర్వాత నెల తేదీ వేసుకోవాలి. మార్కెట్లో ప్రైవేట్ కంపెనీల వారు ఫ్రూట్ బ్యాగింగ్‌ను రూ. 1.25 చొప్పున అమ్ము తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలోని మామిడితోటలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆ రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై ఫ్రూట్ బ్యాగులను అందజేస్తున్నారు. ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన 45-60 రోజుల తర్వాత సహజ చక్కెర, ఫినోలిక్ కంపౌండ్స్ ఏర్పడతాయి. ఒక చెట్టుకు ఎన్ని ఫ్రూట్ బ్యాగింగ్‌లైనా చేసుకోవచ్చు.

బ్యాగింగ్‌తో లాభాలు

మామిడి తోటల్లో మావిడి కాయలకు బ్యాగింగ్ చేయడం వల్ల కాయ మొత్తం మూసివేయబడుతుంది. దీంతో ఈదురుగాలుల నుంచి తట్టుకుంటుంది. వాటర్ ప్రూఫ్ కావడంతో వర్షం, ఎండ, క్రిమికీటకాలు, పక్షుల భారీ నుంచి తప్పిస్తుంది. అలాగే కాయ సైజు, పరిమాణం నాణ్యతగా ఉంటుంది. పండు వేగంగా పెరిగేందుకు సహాయ పడుతుంది. మామూలుగా బ్యాగులను జాగ్రత్తగా వాడుకుంటే మరోసారి వాడుకోవచ్చు.



ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన మామిడి చెట్టు



మామిడి కాయకు కట్టిన ఫ్రూట్ బ్యాగ్



ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన మామిడి పండ్లు

బ్యాగింగ్ చేయడం వల్ల అధిక లాభాలు



మామిడి తోటల్లో బ్యాగింగ్ చేయడం వల్ల అధిక లాభాలు సాధించవచ్చు. ఒక మామిడి కాయకు బ్యాగింగ్ చేస్తే ఎండ, వాన, క్రిమీ కీటకాల నుంచి సంరక్షించుకోవచ్చు. మామూలుగా బంగినపల్లి లాంటి మేలైన జాతి పండ్లకు టన్నుకు రూ.25వేల వరకు ధర పలుకుతుంది. బ్యాగింగ్ చేసిన మామిడి కాయకు టన్నుకు రూ. 50-70వేల వరకు మార్కెట్లో ధర పలుకుతుంది. మామిడి రైతులు మామిడి కాయకు బ్యాగింగ్ చేసుకుంటే మంచిది.

సుష్మిత, హార్టికల్చర్ ఆఫీసర్, హనుమకొండ

ఫ్రూట్ బ్యాగులకు రాయితీ ఇవ్వాలి



మామిడి ఫ్రూట్ బ్యాగులను రాయితీపై రైతులకు అందించాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు ఫ్రూట్ బ్యాగులను అక్కడి రైతులకు 50 శాతం రాయితీతో అందిస్తుంది. తెలంగాణ ప్రాంతంలో కూడా ఫ్రూట్ బ్యాగులను 50శాతం రాయితీపై రైతులకు అందించాలి.

మండల సురేందర్, బీఆర్ఎస్, మండలాధ్యక్షుడు

ఈ-సాక్షతో నేరస్థులకు పక్కా శిక్ష

కొత్త చట్టాల రూపకల్పన తర్వాత అమలులోకి వచ్చిన ఈ-సాక్ష యాప్
సంఘటన జరిగిన 48 గంటల్లోనే ఆన్‌లైన్‌లో కోర్టుకు సాక్ష్యాలు
సాక్ష్యాలను భద్రపరిచేందుకు ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు రెండు సెల్‌ఫోన్లు

వరంగల్ క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నేరాలు జరిగినప్పుడు దానికి సంబంధించిన ఆధారాలకు సేకరించి కోర్టులో సమర్పించడం, నేరానికి పాల్పడినట్లు రుజువు చేయడం పోలీసుశాఖకు చాలా సవాల్‌గా మారేది. దానిలో ఉన్న కొన్ని లొసుగులను సాకుగా చేసుకొని నేరస్థులతో పాటు సాక్ష్యులు తమను బలవంతం పెట్టడం వల్ల ఒప్పుకున్నామని తప్పించుకునేది. అలాంటి వాటికి చెక్ పెడుతూ గతంలో బ్రిటిష్ వాళ్ల తీసుకొచ్చిన పాత చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చి కొత్త చట్టాలను రూపొందించడంతో ఈ-సాక్ష యాప్ తెరపైకి వచ్చింది. 2024 జూలై తర్వాత నుంచి ప్రతీ కేసులో సాక్ష్యాధారాలకు సాక్ష యాప్‌నే వినియోగిస్తూ నేరం చేసిన వ్యక్తి శిక్ష నుంచి తప్పించుకోకుండా శిక్షల శాతంను పోలీసుశాఖ పెంచుతుంది.

ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు రెండు సెల్‌ఫోన్‌లు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ-సాక్ష్య యాప్‌లో ఆయా పోలీస్ స్టేషన్లలో జరిగే ప్రతీ నేరానికి సంబంధించిన సీన్ ఆఫ్ అఫెన్స్, సాక్ష్యాల వాంగ్మూలం, నేరస్థుడు తాను చేసిన నేరాన్ని ఒప్పుకోవడం వంటి అంశాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ యాప్‌లో రికార్డ్ చేసిన వివరాలన్నింటినీ పోలీసులు 48 గంటల్లో కోర్టుల్లోని ఐసీజేఎస్ వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్‌లో పంపిస్తారు. కేసు బెంచీపైకి వచ్చిన రోజు ఐసీజేఎస్‌లో భద్రపరిచిన కేసుకు సంబంధించిన వివరాలను న్యాయమూర్తికి అందజేస్తారు. రికార్డు రూపంలో సాక్ష్యాలు ఉండటంతో నేరస్థులు, తాయిలాలకు తలొగ్గి లేదా నేరస్థులకు సాక్ష్యులు భయపడి తప్పించుకునే వీలు లేకుండా పకడ్బందీగా రూపకల్పన చేశారు. గతంలో ఎలక్ట్రానిక్ డివైస్ సాక్ష్యాలకు అవకాశం ఉన్నప్పటికీ సీడీ, పెన్ డ్రైవ్ రూపంలో కోర్టులో సమర్పించి ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు ప్రాకారం 65-బీ అనే సర్టిఫికెట్ కోర్టుకు ఇవ్వాల్సి ఉండే దానికి చాలా సమయం అయ్యేది. కానీ సాక్ష యాప్‌తో ఆ తిప్పలన్నీ తప్పాయని పోలీసుశాఖ అంటుంది.



నేరస్థులకు శిక్ష పడటమే యాప్ ఉద్దేశం

ఇప్పటికే సాంకేతికతను వినియోగించిన సత్ఫలితాలను సాధిస్తున్న పోలీసుశాఖ ఈ సాక్ష యాప్‌తో నేరస్థులకు శిక్ష పడటంలో సక్సెస్ సాధిస్తోంది. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ తన మొబైల్ నెంబర్‌తో ఒక సారి లాగిన్ అయి నేరానికి సంబంధించి వివరాలను అప్‌లోడ్ చేస్తే ఎప్పటికైనా ఆ సాక్ష్యాలు అందులో పదిలంగా ఉంటాయి. మళ్లీ సాక్ష్యాల వివరాలు కావాలనుకుంటే యాప్‌లో కేసు నెంబర్, తేదీ, సంవత్సరం నమోదు చేస్తే ఆ రోజు జరిగిన నేరానికి సంబంధించిన వివరాలన్నీ కనిపిస్తాయి. స్టేషన్ అధికారులతో పాటు కోర్టు డ్యూటీ నిర్వహించేవారితో పాటు స్టేషన్ రైటర్స్‌కు ఈ యాప్‌పై అవగాహన కల్పించారు. కేసు ఇన్వెస్టిగేషన్‌పై కోర్టులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ సాక్ష యాప్‌తో సులవుగా అవుతుందని పోలీసువర్గాలు తెలుపుతున్నాయి. కేంద్రం యాప్ తీసుకొచ్చిన తర్వాత మొట్టమొదటిగా తెలంగాణ పోలీసులే యాప్ ద్వారా సాక్ష్యాలను కోర్టుకు సమర్పించినట్లుగా కమిషనరేట్ పోలీసులు పేర్కొంటున్నారు.

రారండోయ్.. ఇస్రోను చూసొద్దాం..

- 9వ తరగతి విద్యార్థులకు ఆహ్వానం
- యువ విజ్ఞాన కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రోత్సాహం
- ఏప్రిల్‌లో ఎంపిక, మేలో 14 రోజుల పాటు శిక్షణ
- అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన
- ఎంపికైన విద్యార్థులకు ఉచిత సౌకర్యాలు
- దేశ వ్యాప్తంగా 7 కేంద్రాల్లో నిర్వహణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్/జఫర్‌గఢ్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) యేటా యువ విజ్ఞాన కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ ఏడాది చేపట్టబోయే కార్యక్రమం కోసం దేశ వ్యాప్తంగా తొమ్మిదో తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో వంద ప్రయోగాలు పూర్తి చేసుకుని ప్రపంచంలో అగ్రదేశాల సరసన భారత్ నిలిచిందనడంలో ఎలాంటి సందేహంలేదు. భారత్ పలు పరిశోధనలు చేపడుతూ శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు తెలియజేసేందుకు, వారిలో స్ఫూర్తిని నింపేందుకు ఇస్రో ఈ బృహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఏటా అనేక మంది విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతోంది.

ఈ నెల 23 వరకు గడువు

సైన్స్ పట్ల ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఇస్రో అవకాశం కల్పించింది. విద్యార్థులు www.isro.gov.in లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునే విద్యార్థి 2025, జనవరి 1 నాటికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతూ ఉండాలి. విద్యార్థులు మొదట వారి ఈ-మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకున్న రెండు రోజుల తరువాత ఇస్రో ఏర్పాటు చేసే ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. ఈ ప్రక్రియ పూర్తయిన గంట తరువాత యువికా పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పూర్తి వివరాలు నమోదు చేసి ధ్రువ పత్రాలు అప్‌లోడ్ చేయాలి. ఏప్రిల్ నెలలో ఎంపిక జాబితాలను ప్రకటించనున్నారు. విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఏప్రిల్ 7న దేశవ్యాప్తంగా ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తారు. మే 19 నుంచి 30 వరకు యువికా-25 కార్యక్రమం నిర్వహిస్తారు. మే 31న ముగింపు కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు (బాలసైంటిస్టులు) బహుమతులు అందజేస్తారు.

శాస్త్ర, సాంకేతికంపై శిక్షణ

యువ విజ్ఞాన కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు శాస్త్ర, సాంకేతికం వంటి అంశాలపై శిక్షణ ఇస్తారు. మే నెలలో 14 రోజుల పాటు ఇస్రోకు సంబంధించిన దేశంలోని యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్- బెంగుళూరు, స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ -అహ్మదాబాద్, విక్రమ్ సారాబాయ్ స్పేస్ రీసెర్చ్ సెంటర్- తిరువనంతపురం, నార్త్ ఈస్ట్ అప్లికేషన్ సెంటర్ - షిల్లాంగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ - డెహ్రాడూన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ - హైద్రాబాద్, నిలీష్‌ధావన్ స్పేస్ సెంటర్ - శ్రీహరికోట ఏడు కేంద్రాల్లో శిబిరాలను నిర్వహించి శిక్షణ ఇవ్వనున్నారు. రెసిడెన్షియల్ పద్ధతిలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రయోగాత్మక ప్రదర్శన, ల్యాబ్ సందర్శన, నిపుణులతో ప్రాక్టికల్స్, ఫీడ్‌బ్యాక్ సెషన్‌లు, ప్రముఖ శాస్త్రవేత్తల అనుభవాలు, చర్చ కార్యక్రమాలు వంటివి నిర్వహించడంతో పాటు అంతరిక్ష విజ్ఞానం, రాకెట్ ప్రయోగాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పిస్తారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందిస్తారు. కాగా, ఎంపికైన విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరికి లేదా గైడ్ ఉపాధ్యాయుడికి ప్రయాణ ఖర్చులు చెల్లింపుతో పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను ఇస్రో కల్పిస్తుంది.



ఎంపికైన విద్యార్థులకు ఉచిత సౌకర్యాలు

ఇస్రో నిర్వహించే యువికా కార్యక్రమానికి ఎంపికైన పాఠశాల విద్యార్థులకు ప్రయాణ, భోజన వసతి, సౌకర్యాలను ఇస్రో ఉచితంగానే కల్పిస్తోంది. ఎంపికైన విద్యార్థులను మే నెలలో 14 రోజుల పాటు ఇస్రోకు చెందిన స్పేస్ సెంటర్లకు తీసుకువెళ్తారు. అక్కడ సైన్స్‌కు సంబంధించిన వింతలు, విశేషాలు, నవగ్రహ కూటమి మొదలగు అంశాలపై వారికి శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం విద్యార్థులకు కల్పిస్తారు.

ఎవరు అర్హులంటే..

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. 8వ తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. స్పేస్, సైన్స్ క్లబ్‌లలో ఉంటే 5 శాతం, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చూపితే 10 శాతం, ఎన్‌సీసీ, స్కౌట్స్‌అండ్ గైడ్స్ విభాగాల్లో ఉంటే 5 శాతం, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి 20 శాతం ప్రాధాన్యం ఇస్తారు.

దరఖాస్తుదారులకు వెయిటేజీ కేటాయింపు

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు దారులు 8వ తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇస్తారు. 9వ తరగతి విద్యార్థులు సహపాఠ్యాంశాలపై పట్టు కలిగి ఉండాలి. స్కౌట్స్ అండ్ గేమ్స్, ఎన్ఎస్ఎస్‌లో పాల్గొంటే 5 శాతం, గ్రామీణ ప్రాంత పాఠశాల విద్యార్థులకు మరో 15 శాతం అదనపు అర్హత కల్పిస్తారు. ఆన్‌లైన్ క్విజ్ ప్రతిభకు 10 శాతం, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొన్న వారికి 10 శాతం, ఒలింపియాడ్ సైన్స్ పోటీల్లో బహుమతులు పొందిన ప్రతిభావంతులకు 5 శాతం, క్రీడా పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పిస్తారు.

ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలి

డాక్టర్ ఎ. రవీందర్‌రెడ్డి, డీఈవో, మహబూబాబాద్



అంతరిక్ష పరిశోధనలో అగ్రగామిగా నిలుస్తున్న ఇస్రో విద్యార్థులకు కల్పిస్తున్న యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా)లో జిల్లా నుంచి ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలి. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఇస్రో కల్పిస్తున్న అద్భుత అవకాశాన్ని అత్యధికంగా విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా వారికి ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

ఎం.రమేశ్, డీఈవో, జనగామ



ఆసక్తి గల 9వ తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో శాస్త్రీయ సాంకేతిక అవగాహన, అంతరిక్ష పరిశోధన రంగాలపై ఈ శిక్షణ అవగాహన పెంచుతుంది. తద్వారా విద్యార్థులు యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడుతుంది. విద్యార్థులు తమ ప్రతిభను చూపేందుకు ఈ కార్యక్రమం చక్కటి వేదిక. జిల్లాలోని తొమ్మిదో తరగతి విద్యార్థులు ఈ నెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి, లేదా ఇస్రో యువికా వెబ్‌సైట్‌లో సంప్రదించాలి.

యువికాతో విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి

బి. అప్పారావు, డీఎస్వో, మహబూబాబాద్



యువ విజ్ఞాన కార్యక్రమంతో విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెరుగుతుంది. అనేక రంగాల్లో సేవలందిస్తూ కృత్రిమ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపిస్తూ, ప్రపంచంలో అగ్రస్థానాన్ని పొందిన ఇస్రో సంస్థ పాఠశాల విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలు, పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు దోహదపడుతోంది. ఇందులో ఎక్కువ మంది విద్యార్థులను భాగస్వాములను చేసేందుకు సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలి.

హర.. ముక్తీశ్వర..

» కల్పతరువు కాళేశ్వరం.. దినదినాభివృద్ధి
» ఆలయ అభివృద్ధితో ఎంతో మందికి జీవనోపాధి
» దండకారణ్యం నుంచి పట్టణ స్థాయి ప్రగతి

మహదేవపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు దండకారణ్యం.. కాకులు దూరని కారడవిలా ఉండేవి కాళేశ్వరం పరిసరాలు. ఇళ్లు అక్కడక్కడ కొన్ని మాత్రమే ఉండేవి. త్రివేణి సంగమ ఒడ్డున స్వల్పంగానే జనజీవనం సాగేది. ఆర్టీసీ బస్సులు కూడా రాని పరిస్థితి. రవాణా లేక, ఇతరత్రా సౌకర్యాలు లేక అష్టకష్టాలు ఎదుర్కొనే వారు అక్కడి వాసులు. దీంతో చాలా మంది వలస వెళ్లిపోయారు. ఇక్కడి భూములు వదులుకొని కాటారం, భూపాలపల్లి, వరంగల్, హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయానికి భక్తులు ఎడ్ల బండ్లలో వచ్చే వారు. 1976లో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి, దేవాదాయ శాఖ ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న చొక్కారావు చొరవతో ఆదిశంకరాచార్యుల సూచన మేరకు కాళేశ్వరాలయాన్ని అభివృద్ధి చేశారు. ఆయా పనులు చేపట్టి ఆలయానికి 1982లో జీర్ణోద్ధారణ చేశారు. ఆ తర్వాత ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. కాళేశ్వరంతో పాటు మహదేవపూర్ కూడా ప్రగతి వైపు పరుగులు పెడుతోంది. ఈ ఆలయం ద్వారా ఎంతో మంది జీవనోపాధి పొందుతున్నారు.

మెరుగైన రవాణా సౌకర్యం

మూడు రాష్ట్రాల వారధిగా కాళేశ్వరం రవాణా వ్యవస్థ మెరుగుపడింది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలను కలుపుతూ బ్రిడ్జీలు, రోడ్లు ఏర్పడటంతో ఇతర రాష్ట్రాల ప్రజలు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. త్రివేణి సంగమం వద్ద కాళేశ్వరుడికి నిత్యం వేలాది మంది పూజలు చేస్తుంటారు. ఈ క్రమంలో పుణ్య స్నానం ఆచరించి భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహిస్తుంటారు. ప్రయాగ్‌రాజ్ తర్వాత త్రివేణి సంగమంలో కొలువైన క్షేత్రంగా కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం ఖ్యాతి పొందింది. దీని దగ్గర ఉన్న నదిని అమ్మవారిగా పూజలు నిర్వహిస్తుంటారు. సాయంకాల ప్రదోషకాల వేళ నదీ హారతి ఇస్తారు. గోదావరి నది స్నాన మాచరిస్తే శరీర శుద్ధితో పాటు పాపాలు పోతాయని పురాణాలు చెబుతున్నాయి.



కాళేశ్వరాలయం వద్ద వెలిసిన భవనాలు

ప్రభుత్వానికి ఆదాయం

ఆలయానికి వచ్చే భక్తులతో రాష్ట్ర ప్రభుత్వానికి సైతం పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతోంది. కాళేశ్వరానికి రోజువారీగా ఆర్టీసీ బస్సులకు చాలామంది భక్తులు తరలివెళ్తుంటారు. దీంతో కాళేశ్వరానికి భూపాలపల్లి, హనుమకొండ, పరకాల, మంథని, కరీంనగర్ ఇతర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వస్తుండటంతో ఆర్టీసీకి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతోంది. ఆలయ హుండీలు, టెండర్లు, భక్తులు చేసే ప్రత్యేక పూజల ద్వారా వచ్చే డబ్బులు, టోకెన్లు, లడ్డూలు వసతి గృహాలతో పాటు ఇతర అవసరాలకు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. అలాగే ఇక్కడ హరిత హోటల్ ద్వారా మెరుగైన ఆదాయ వస్తోంది.

అర్చకులకు ఉపాధి

చనిపోయిన వారి అస్తికలు కలిపేందుకు కాళేశ్వరానికి జనం పెద్ద ఎత్తున తరలివస్తారు. త్రివేణి సంగమ గోదావరిలో కలిపితే వారి ఆత్మకు శాంతితో పాటు ముక్తి లభిస్తుందనే ఉద్దేశంతో పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. పూజా క్రతువులు నిర్వహించడానికి అర్చకులు అక్కడ ఉంటారు. వందలమంది అర్చక కుటుంబాలు సైతం ఉపాధి పొందుతున్నాయి.

బోటింగ్, ఆటోల ద్వారా..

త్రివేణి సంగమ గోదావరిలో బోటింగ్ సిస్టం ఉంది. వేల కొద్ది మంది భక్తులు త్రివేణి సంగమంలో బోటింగ్‌తో పాటు ప్రాణహిత అవతల వైపు వెళ్తుంటారు. బోటింగ్ సిస్టం ద్వారా వందల కొద్ది ఉపాధి పొందుతున్నారు. అలాగే కాళేశ్వరం ఆర్టీసీ బస్టాండ్ నుంచి గోదావరి వరకు నిత్యం ఆటోలు భక్తులను తరలిస్తుంటాయి. దీంతో వందల మంది ఆటో కార్మికులు పెద్ద ఎత్తున జీవనం సాగిస్తున్నారు.

హోటళ్లు, లాడ్జీల ద్వారా..

కాళేశ్వరంలో భక్తులు బస చేయడానికి హరిత హోటల్ ఉంది. దీంతోపాటు ప్రైవేటు హోటళ్లు, లాడ్జీలు ఉన్నాయి. అలాగే భోజన, టిఫిన్‌సెంటర్లు, కిరాణ దుకాణాలు ఇలా ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు.

పెరుగుతున్న రియల్ ఎస్టేట్

కాళేశ్వరం పరిసర ప్రాంతాల్లో ఒకప్పుడు సాగు భూములున్నా ఎవరూ ఉండేవారు కాదు. ప్రస్తుతం వ్యవసాయంతో పాటు రియల్ ఎస్టేట్ రంగంలో చాలామంది జీవనోపాధి పొందుతున్నారు. కాళేశ్వరం సమీపాన ఒక ఎకరం భూమి ధర రూ.కోటి పైమాటే. పంటలు సాగు చేసే భూములు రూ.10 లక్షల నుంచి రూ.30లక్షల వరకు అందుబాటులో ఉన్నాయి. ఇక ఇళ్ల స్థలాల మాట రేట్లు ఎక్కువగానే ఉన్నాయి.

మోదుగు పూసినదీ..

మోదుగు పూలు కనువిందు చేస్తున్నాయి. హోలీ వేడుకలకు సిద్ధం అన్నట్టు కళకళలాడుతున్నాయి. మోదుగుపూలు విరబూసి పండుగ వస్తున్న విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. ఆకురాలే కాలంలో అడవుల్లోని మోదుగు చెట్లకు పూసిన లేలేత ఎరుపురంగులోని పూలు అడవుల్లో అందంగా కనిపిస్తున్నాయి. గతంలో ప్రజలు మోదుగు పువ్వును హోలీ పండుగకు ఐదు రోజుల ముందు సేకరించి మట్టి పాత్రల్లో ఉడికించి రంగు తయారు చేసేవారు. ఈ రంగు శరీరంపై పోస్తే వారం రోజులు ఉండేది. అలాగే దుస్తులకు అంటిన మోదుగు పువ్వు మరకలు పోవు. మోదుగు పువ్వుతో ఎలాంటి చర్మ వ్యాధులు వచ్చేవి కావు. కానీ, నేటి ఆధునిక ప్రపంచంలో మార్కెట్లో లభించే రకరకాల రసాయన రంగులకు ప్రజలు ఆకర్షితులై చర్మవ్యాధులను కొని తెచ్చుకుంటున్నారు. దీంతో మోదుగు పూలు చెట్లకే పరిమితమవుతున్నాయి. భూపాలపల్లి జిల్లా కేంద్రం, నెక్కొండలో ఇవి విపరీతంగా విరబూయగా వాటిని పక్షులు ముద్దాడాయి. ఈ సుందర దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి/నెక్కొండ


నెక్కొండలో విరబూసిన మోదుగు పూలు





భూపాలపల్లిలో మోదుగు పువ్వులపై వాలిన పక్షులు





బాధితురాలికి బ్యాగు అప్పగింత


బాధితురాలికి బ్యాగును అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్

హసన్‌పర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధి భీమారం గ్రామానికి చెందిన నూనావత్ శారద ఆదివారం భీమారం నుంచి కేయూ క్రాస్ రోడ్డువైపు ఆటోలో వెళ్తోంది. ఈ క్రమంలో శారద ఆటో దిగిన తరువాత బ్యాగును మరిచిపోయింది. గుర్తించి వెంటనే కేయూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాగులో అరతులం రింగు, అరతులం బంగారు కమ్మలు, రూ.800 నగదు ఉన్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ ఏఎస్సై లాయక్ అలీఖాన్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్‌తో పాటు మహిళా కానిస్టేబుళ్లు లహరి, మానసలను అప్రమత్తం చేశారు. దీంతో వీరంతా ఒక గ్రూపుగా ఏర్పడి బాధితురాలు ప్రయాణిస్తున్న ఆటోను గుర్తించి బ్యాగును శారదకు అప్పగించారు. ఫిర్యాదు చేసిన గంటలోపే బ్యాగును రికవరీ చేసి బాధితురాలికి అప్పగించిన పోలీసు సిబ్బందిని కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవి కుమార్ అభినందించారు.

సాహిత్యం సమాజహితాన్ని కోరేదై ఉండాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

హనుమకొండ కల్చరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : సాహిత్యం సమాజ హితాన్ని కోరేదై ఉండాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు, జాతీయ సాహిత్య పరిషత్ అఖిల భారత పూర్వ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నగరానికి చెందిన ప్రముఖ కవి గన్నోజు ప్రసాద్ రచించిన శిలాక్షరం కవిత్వ సంపుటి పుస్తకాన్ని ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సామా జగన్‌మోహన్ స్మారక భవనంలో ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయ సాహిత్య పరిషత్ హనుమకొండ శాఖ అధ్యక్షులు తాడిచర్ల రవి అధ్యక్షత వహించగా, ఆత్మీయ అతిథిగా, పుస్తకావిష్కర్త కసిరెడ్డి వెంకటరెడ్డి, గౌరవఅతిథిగా జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, విశిష్ట అతిథులుగా కేయూ హిందీ విశ్రాంత ఆచార్యులు ఆచార్య చిలకమారి సంజీవ, ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాసులు, దొడ్డ ప్రతారెడ్డి, బొంపెల్లి దిలీప్‌రావు, గడ్డం లక్ష్మయ్య, మేరుగు అనురాధ, మద్దెల నాగరాజు, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

కాజీపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రైల్వే తెలుగు మీడియం 1998-99 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం హనుమకొండ ఐశ్వర్య గార్డెన్‌లో జరిగింది.. 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్‌జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సమ్మేళనంలో విద్యార్థులు పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అంతా కలిసి నాటి ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయులు టి.కుటుంబరావు, ఉపాధ్యాయులు వీరభద్రయ్య, మాధవరావు, హరిగోపాల్, దుర్గప్రసాద్, శరత్‌బాబు, వాసు, వెంకట్‌రెడ్డితోపాటు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల మధ్య ఆత్మీయ సమ్మేళనం

• 50ఏళ్ల కిందట చదువు చెప్పిన గురువులకు సన్మానం


స్వర్ణోత్సవాల సంబురాలలో పాల్గొన్న పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు

హసన్‌పర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : హసన్‌పర్తి సంస్కృతి విహార్ టీటీడీసీలో 1975 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సంబురాలు ఆదివారం ఘనంగా జరిగాయి. హసన్‌పర్తి జడ్పీఎస్ఎస్‌లో 10వ తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ముందుగా మృతి చెందిన తోటి పూర్వ విద్యార్థులు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తుచేసుకుని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సముద్రాల రాంనర్సింహాచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాగా, పాఠశాల అభివృద్ధికి అమెరికాలో స్థిరపడిన పూర్వ విద్యార్థిని వెలగందుల విజయ ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు రూ.3లక్షలు, వెలగందుల ఓంప్రకాష్ రూ.2 లక్షలు టాయిలెట్స్ ఇతర అభివృద్ధి పనుల కోసం ఆర్థిక చేయూతనందించడంపై తోటి పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆర్గనైజింగ్ ప్రతినిధులు చకిలం రాజేశ్వర్‌రావు, గూడూరు రంగారెడ్డి, వల్లాల రవిందర్, డాక్టర్ మనోహర్, ఎస్.మల్లేషం, వి.కొమురయ్య, కోమటి రాజేంద్రం, వి.కిషన్‌రెడ్డి, మాటేటి సచ్చితానందం, మోహన్, రాజిరెడ్డితో పాటు 100 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాజీపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ లోకో షెడ్‌వద్ద అనారోగ్యంతో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. కాజీపేట ఎస్సై వి.నవీన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడి వయస్సు 40-45 వరకు ఉంటుంది. ఎత్తు 5.6, తెల్లటి గడ్డం, నల్లని జుట్టు, బ్రౌన్‌కలర్ చెడ్డి, క్రీంకలర్ టీషర్ట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు 87126 85122, 87125 84495 నంబర్‌లకు సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కోకన్వీనర్‌గా భాస్కర్



మడికొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం హనుమకొండ జిల్లా కో కన్వీనర్‌గా మడికొండకు చెందిన కొలిపాక భాస్కర్‌ను నియమించినట్లు ఆదివారం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చీమ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నియామక పత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కళాకారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

భిన్న రంగాల మహిళలకు సత్కారం

• పురావస్తు శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

హనుమకొండ కల్చరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా ఆదివారం హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయ ప్రాంగణంలో భిన్న రంగాలకు చెందిన 16 మంది మహిళలను ఘనంగా సత్కరించారు. పింగిళి కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రామ రత్నమాల, భాషోపాధ్యాయినులు తిరునగరి పద్మ, మెరుగు అనురాధ, బాలబోయిన రమాదేవి, నల్లమాధవి, సుజాత, ప్రముఖ నాట్యాచారిణులు ఒద్దిరాజు నివేదిత, తాడూరి రేణుక, వెంపటి శ్రావణి, కుందె అరుణరాజ్‌కుమార్, లంక సుజాత తదితర ప్రముఖులను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో కేంద్ర పురావస్తు శాఖ ఏఎస్ఐ గోల్కొండ కోట ఇన్‌చార్జ్ మల్లేశం, రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ లేనిది సృష్టి లేదని మరవొద్దు

బాలసముద్రం: సమాజ నిర్మాణంలో, కుటుంబాల సుస్థిరతలో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో మహిళల పాత్ర అమూల్యమైనదని వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ కె. అనితారెడి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు తమ ప్రతిభ, శక్తి, సంకల్పంతో ప్రతీ రంగంలోనూ ముందుకు సాగుతున్నారని అన్నారు. వారి కృషి, పట్టుదల, అంకితభావం అందరికి ప్రేరణ కావాలన్నారు. సమాజంలో మహిళల పాత్రను మరింత బలోపేతం చేయడానికి వారి స్వప్నాలను సాకారం చేయడానికి వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ పనిచేస్తుందని, మహిళ లేనిదే సృష్టి లేదని మరువరాదని అన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన మహిళలను ఉమెన్ ఎక్స్‌లెన్సీతో సన్మానించారు. సంస్థ బాధ్యులు డాక్టర్ జైపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ కేశవరెడ్డి, రత్నమాల, సుజాత, అంజనీదేవి, సురేందర్, రవీందర్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి..

వడ్డేపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని రెడ్డి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర తిరుపతిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హనుమకొండ గోపాల్‌పూర్‌లో రెడ్డి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. రెడ్డి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు విర్రి వనజ, మాజీ అధ్యక్షురాలు పత్తి పద్మ కేక్‌కట్ చేశారు. అనంతరం మహిళలకు శాలువాకప్పి, బహుమతులు అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఉప్పుల తిరుపతిరెడ్డి, సభ్యులు ప్రసాద్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఉమ, ఉజ్వల, రజనీ, ఇందిర, అనిత, సునీత, రజిత, శోభ, విజయలక్ష్మీ, మమత, శ్రీలత, అమలతోపాటు సభ్యులు పాల్గొన్నారు.

పురుషులతో సమానంగా రాణించాలి

వడ్డేపల్లి: మహిళలు పురుషులతో సమానంగా రాణించాలని భద్రకాళి ఆలయ ఈవో శేషుభారతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విస్డమ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఉమెన్ ఐకాన్ అవార్డ్స్ -2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శేషుభారతితో పాటు నర్సంపేట ఉమెన్స్ ప్రిసన్ (సబ్‌జైలు) సూపరింటెండెంట్ లక్ష్మీశృతి మాట్లాడారు. మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన 51 మంది మహిళలకు ఉమెన్ ఐకాన్ అవార్డులను విస్డమ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రదానం చేశారు. కార్యక్రమంలో నర్సంపేట ఉమెన్స్ స్పెషల్ ప్రిసన్స్ జూనియర్ అసిస్టెంట్ కొండపల్లి ఉమాదేవి, రిటైర్డ్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కురాకుల భారతి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రముఖ రచయిత్రి డాక్టర్ వనపర్తి పద్మావతి, సామాజిక వేత్త బూర రాంచందర్, యాంసాని శ్రీనివాస్, విస్డమ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అనుమాండ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


వేయిస్తంభాల ఆలయ ప్రాంగణంలో సత్కారం అందుకున్న భిన్న రంగాల మహిళలు


బాలసముద్రంలో వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన మహిళలను సన్మానిస్తున్న కార్యక్రమ నిర్వాహకులు


గోపాల్‌పూర్‌లో సన్మానం పొందిన మహిళలు


ప్రెస్‌క్లబ్‌లో ఉమెన్ ఐకాన్ అవార్డులతో మహిళలు

నేడు ఎర్రగట్టు వెంకన్న జాతర వేలం పాటలు

హసన్‌పర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న హోలీ పర్వదినం నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించే ఎర్రగట్టు వెంకన్న జాతర వేలం పాటలు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వాహణ అధికారి వెంకట్రావు తెలిపారు. గత నెల 22వ తేదీ, ఈ నెల 5వ తేదీన రెండు సార్లు వెంకన్న జాతర వేలం పాటల టెండర్లకు పిలుపునివ్వగా గత ఏడాది జాతర కంటే తక్కువ వేలం రావడంతో ఆలయ ఈవో టెండరు వేలం పాటలను రద్దు చేశారు. సోమవారం ఉదయం నిర్వహించే వేలం పాటలో గతేడాది కంటే అధికంగా టెండర్లు వచ్చేనా అన్న పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు వేలం పాటలో పాల్గొనేందుకు ప్రస్తుతం లడ్డూ, పులిహోర, కొబ్బరి కాయలకు రూ.50వేల టెండర్ డిపాజిట్, పార్కింగ్‌కు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని ఆలయ ఈవో తెలిపారు.

గంజాయి పట్టివేత


గంజాయితో పట్టుబడిన నిందితుడు

కాజీపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. కాజీపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపిన ప్రకారం... కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలోని ఆటో స్టాండ్‌లో శనివారం రాత్రి ఎక్సైజ్‌పోలీసులు తనిఖీలు చేస్తుండగా అనుమానంగా అక్కడే తిరుగున్న వ్యక్తిని ఎస్సై తిరుపతి బృందం పట్టుకుని ఆరా తీశారు. పట్టుబడిన వ్యక్తి ఒడిస్సాకు చెందిన రమేశ్‌నాయక్ బ్యాగును తనిఖీ చేయగా అందులో గంజాయి ప్యాకెట్‌లు ఉన్నాయి. ఇచ్ఛాపురంలో 14.50కిలోల ఎండు గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి పునేలో ఎక్కువ ధరకు అమ్ముతున్నానని నిందితుడు రమేశ్‌నాయక్ ఒప్పుకున్నాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.75వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ తనిఖీలలో హెడ్‌కానిస్టేబుళ్లు ఖలీల్, రవీందర్, లాలయ్య, అయూబ్‌లు ఉన్నారు.

రమణారెడ్డి మృతిపై పోలీసుల విచారణ

హనుమకొండ టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలో ఆత్మహత్యకు పాల్పడిన కొమ్మిడి రమణారెడ్డి మృతిపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఆదివారం సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... హనుమకొండ జిల్లా పరకాల మండలం కామారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమ్మిడి రమణారెడ్డి(58) హనుమకొండలోని వికాస్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గతంలో పరకాలలో చిట్‌ఫండ్‌ను ముగ్గురు కలిసి నడిపించేవారు. చిట్‌ఫండ్‌లో నష్టాలు రావడంతో పార్ట్‌నర్స్‌తో గొడవలు జరగడంతో హనుమకొండలోని వికాస్‌నగర్‌లో ఉంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, ఈనెల 3న రమణారెడ్డి ఇంట్లోనే ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఫిర్యాదు చేయడంతో పోలీసులు గతంలో రమణారెడ్డితో పాటు ఎవరెవరు ఆర్థిక లావాదేవీలు కలిగి ఉన్నారో వారిని పోలీసు స్టేషన్‌లో విచారణ చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

శిథిలావస్థలో ఆలయ ద్వార తోరణం

• రోడ్డు వెడల్పులో కనుమరుగయ్యే ప్రమాదం
• పరిరక్షించాలని విజ్ఞప్తి


శిథిలావస్థలో ఉన్న కాకతీయుల కాలం నాటి ఆలయ ప్రవేశ ద్వార తోరణాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ శివనాగిరెడ్డి

హనుమకొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని రాజ్‌పుత్‌వాడలో కాకతీయుల నాటి శివాలయ ప్రవేశ ద్వారాన్ని పరిరక్షించాలని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కోరారు. వరంగల్ నగరానికి చెందిన పరిశోధకుడు అరవింద్ ఆర్యతో కలిసి ఆయన ఆదివారం హనుమకొండలో పర్యటించారు. అగ్గలయ్యగుట్ట సమీపంలో రాజ్‌పుత్‌వాడలో మారెమ్మ చెట్టుకు ఎదురుగా ఈ ఆలయ ప్రవేశ ద్వారం ఉంది. గతంలో ఈ ప్రవేశ ద్వారం శివాలయంతో కలిసి ఉండేది. రోడ్డు వెడల్పులో భాగంగా ఇది మీదికి వచ్చింది. ఇప్పుడు రాజ్‌పుత్‌వాడ రోడ్డును అభివృద్ధి చేసే క్రమంలో మరోసారి విస్తరిస్తున్నారు. దీనితో ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన ఈ ద్వార తోరణాన్ని అశాస్త్రీయంగా తొలగించినట్లయితే అదిపూర్తిగా ధ్వంసమయ్యే ప్రమాదం ఉంది. ఈ సందర్భంగా శివనాగిరెడ్డి మాట్లాడుతూ.. కాకతీయ శిల్పుల కళానైపుణ్యానికి నిలువెత్తు నిదర్శనంగా నేటికి నిలిచి ఉన్న ఈ ప్రాచీన ప్రవేశ ద్వారాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ స్థపతి బి.సుధాకర్ సింగ్, స్థానికుడు శంభు దయాల్ ఠాకూర్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం అడ్‌హక్ కమిటీ


పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా ఎన్నికైన ఈవీ శ్రీనివాస్‌రావును సత్కరిస్తున్న సభ్యులు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా ఈవీ శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. ఆదివారం వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని అలుమినీ సమావేశ మందిరంలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో అడ్‌హక్ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్‌రావుతో పాటు మరో 18 మంది సభ్యులను సంఘం గౌరవ అధ్యక్షుడు టీఎస్.స్వామి, ప్రధాన కార్యదర్శి పడిశాల ఆనంద్‌కుమార్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు ఎల్లయ్య, మధుసూదన్‌రావు, శంకర్, అక్షయ్‌కుమార్, మురళీధర్, భిక్షపతి, మహేందర్, కుమార్, సతీష్‌రెడ్డి, శ్రీనివాస్, శ్యాం, మధు, సతీష్, వసంత్‌కుమార్, అజయ్, రాజ్‌కుమార్, విఘ్నేష్, వెంకన్న, శ్రీకాంత్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లాపూర్‌లో పిచ్చికుక్క దాడి

ఇద్దరికి తీవ్ర గాయాలు

హసన్‌పర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్ గ్రామంలో ఆదివారం ఓ పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం ఎల్లాపూర్‌లో తన కూతురు కుమ్మరి ప్రమీల వద్ద ఆశ్రయం పొందుతున్న తిక్క ఉప్పలయ్య రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి నడచుకుంటూ వెళ్తుండగా పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేయడంతో కాలిపై తీవ్ర గాయమైంది. దీంతో బాధితుడి కూతురు ప్రమీల 108లో ఎంజీఎంకు తరలించారు. అలాగే అదే గ్రామానికి చెందిన ఎం.డి.మొయినొద్దీన్ అనే యువకుడిపై అదే పిచ్చి కుక్క దాడి చేయగా స్వల్ప గాయాలతో బయటపడినట్లు గ్రామస్తులు తెలిపారు.


ఉప్పలయ్యను అంబులెన్స్‌లో తరలిస్తున్న కుటుంబసభ్యులు

మహిళల కోసం సంక్షేమ కార్యక్రమాలు

ఆకుతోట ప్రభాకర్, ఏపీఎం



ముఖాముఖి

ఆంధ్రజ్యోతి: మహిళా మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళల కోసం ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారు?

ఏపీఎం: మహిళా మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు ఇందిరా మహిళా శక్తి వంటి 14 రకాల సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: మహిళలకు అందజేస్తున్న కీలకమైన పథకాలేవి?

ఏపీఎం: బ్యాంకు లింకేజీ ద్వారా మహిళా శక్తి క్యాంటీన్, వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి కార్యక్రమాలను చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: బ్యాంకు లింకేజీల ద్వారా ఇచ్చే రుణాలకు అర్హులెవరు?

ఏపీఎం: బ్యాంకు లింకేజీల ద్వారా ఇచ్చే రుణాలకు మహిళా సంఘం సభ్యురాలై ఉండాలి. డీఫాల్టర్ గ్రూపు సభ్యురాలై ఉండకూడదు.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని మహిళా సంఘాల గ్రూపులున్నాయి?

ఏపీఎం: మండలంలో 646 సంఘాలు ఉండగా, వాటిలో 30 సంఘాలు డీఫాల్టర్‌గా ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: ఈ ఆర్థిక సంవత్సరం ఎన్ని సంఘాలకు బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు అందజేశారు?

ఏపీఎం: 2024-2025 ఆర్థిక సంవత్సరానికి 358 గ్రూపులకు రూ.32.50 కోట్ల బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందివ్వగా, స్త్రీనిధి ద్వారా మరో 118 సంఘాలకు రూ.2.80కోట్ల రుణాలు అందించాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని గ్రామైక్య సంఘాలు ఉన్నాయి? ఎన్ని సంఘాలు కలిస్తే ఒక గ్రామైక్య సంఘంగా గుర్తిస్తారు?

ఏపీఎం: మండలంలో 24 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. ఒక్కో గ్రామైక్య సంఘానికి 20 నుంచి 30 మహిళా సంఘాలను ఒక గ్రామైక్య సంఘంగా గుర్తిస్తాం. అందులో ఒక్కో గ్రూపులో కనీసం 10 నుంచి 15 మంది సభ్యులుగా ఉంటే ఒక మహిళా సంఘంగా గుర్తిస్తాం.

ఆంధ్రజ్యోతి : సంఘాలకు లోన్ బీమా సౌకర్యం ఉంటుందా?

ఏపీఎం: బ్యాంకు లింకేజీ ద్వారా ప్రతీ గ్రూపునకు లోన్ బీమా సౌకర్యం ఉంటుంది. లోన్ తీసుకున్న గ్రూపులో ఒక సభ్యురాలు ఆకస్మికంగా మరణిస్తే ఆ సభ్యురాలికి రూ.2లక్షల లోపు బీమా వర్తిస్తుంది. ఆ తరువాత నుంచి గ్రూపు సభ్యులు లోన్ చెల్లించనవసరం లేదు.

ఆంధ్రజ్యోతి: ఇంకా ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

ఏపీఎం: ఎస్‌బీఐ బ్యాంకుల ద్వారా స్వయం సిద్ధ పథకం కింద మహిళా గ్రూపు సభ్యురాలికి కుటీర పరిశ్రమలు నెలకొల్పుకునేందుకు రూ.2లక్షల నుంచి వారి స్థాయిని బట్టి బ్యాంకు రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే స్వయం సిద్ధ పథకం కింద హసన్‌పర్తి ఎస్‌బీఐ నుంచి 5, సిద్ధాపూర్, మల్లారెడ్డిపల్లి ఎస్‌బీఐ నుంచి 12 మందిని ఎంపిక చేసి రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

- హసన్‌పర్తి(ఆంధ్రజ్యోతి)

డంపింగ్ నిర్మూలనే లక్ష్యంగా

ఏకమవుతున్న బాధితులు

▸▸ రాంపూర్‌లో సమావేశమైన గ్రామస్తులు


డంపింగ్ యార్డు తరలించే వరకు విశ్రమించేది లేదంటూ నినదిస్తున్న బాధిత ప్రజలు

మడికొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మడికొండ, రాంపూర్ పరిసర గ్రామాల ప్రజల పాలిట పెనుభూతంలా మారిన డంపింగ్ యార్డును పూర్తిగా నిర్మూలించాల్సిందేనని అప్పటి వరకు విశ్రమించేదిలేదని బాధితులంతా ఏకమవుతున్నారు. పోరు బాట పట్టి డంపింగ్ మహమ్మారిపై యుద్ధం ప్రకటిస్తున్నారు. ఆదివారం గ్రేటర్‌వరంగల్ 45వ డివిజన్ రాంపూర్‌లో మడికొండ డంపింగ్ నిర్మూలన అడ్‌హక్ కమిటీ సభ్యులతో కలిసి స్థానికులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. రాంపూర్‌లో సైతం డంపింగ్ యార్డు నిర్మూలన కమిటీ వేసుకుని ప్రజలందరినీ ఏకం చేసి డంపింగ్ యార్డు తొలగించే వరకు పోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇంకా ఉపేక్షిస్తే ఊర్లు వల్లకాడుల్లా మారతాయని, భవిష్యత్ తరాలు అవిటి వారుగా పుడతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తౌటిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, దువ్వ నవీన్, తక్కళ్లపల్లి మోహన్‌రావు, పిట్టల రమేష్ తదితరుల పాల్గొన్నారు.

దిండు లేకుండా పడుకోవడమే మేలు..!

రాత్రిపూట తల కింద దిండు పెట్టుకోకుండా పడుకోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు తీరుతాయని చెబుతున్నారు.

- దిండు మీద తల పెట్టి నిద్రించడం వల్ల మెడపై ఒత్తిడి పెరుగుతుంది. మెడనొప్పి, మెడ పట్టేయడం లాంటివి ఎదురవుతూ ఉంటాయి. అదే దిండు లేకుండా పడుకుంటే మెడ సరైన స్థితిలో ఉండి విశ్రాంతి పొందుతుంది.
- దిండు వేసుకోకుండా పడుకుంటే వెన్నెముక సరైన ఆకృతిలో ఉంటుంది. వీపు నొప్పి, నడుము నొప్పి తగ్గుతాయి.
- దిండు లేకుండా పడుకోవడం వల్ల తల నుంచి పాదాల వరకూ రక్తప్రసరణ ఒక క్రమ పద్ధతిలో వేగంగా జరుగుతుంది. దీనివల్ల శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. గుండె పని తీరు మెరుగుపడుతుంది.
- దిండు వేసుకుని పడుకుంటే ముఖభాగాలన్నీ రాపిడికి గురై నుదుటి మీద చెంపలపై ముడుతలు వస్తాయి. మొటిమలు, గుల్లల సమస్య కూడా పెరుగుతుంది.



- దిండు వల్ల కురుల సమస్యలు ఏర్పడతాయి. తలలో చుండ్రు పెరుగుతుంది. సమతలంగా లేని దిండు వేసుకోవడం వల్ల శిరోజాలకు రాపిడీ పెరిగి అవి చిక్కు పడడమే కాకుండా రాలిపోతాయి.
- దిండు లేకుండా పడుకుంటే మానసిక ఒత్తిడి, అలసట తగ్గుతాయి. ప్రశాంతమైన నిద్ర లభిస్తుంది. ఉదయం లేవగానే ఉత్సాహంగా ఉంటుంది.

పిల్లలకు ఎలాంటి పనులు చెప్పాలి?

పిల్లలతో వారి వయసుకు తగ్గట్టు చిన్నచిన్న పనులు చేయించడం వల్ల వాళ్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. పిల్లల చేత ఎటువంటి పనులు చేయించాలో తెలుసుకుందాం.

- చిన్న పిల్లలకు వారు తేలికగా చేయ గలిగే పనులు చెప్పాలి. మొక్కలకు నీళ్లు పోయడం, పెంపెడు జంతువులకు ఆహారం పెట్టడం, చెప్పులు-షూలను స్టాండ్‌లో పెట్టడం, బొమ్మలను చక్కగా సర్దడం లాంటి పనులు చెప్పవచ్చు. ఇలాంటి పనులను పిల్లలు ఇష్టంగా చేస్తారు కూడా.
- పెద్ద పిల్లలకు ఉదయం లేవగానే దుప్పట్లు మడతపెట్టడం, పరుపు-దిండ్లు సర్దడం, భోజనం చేసేటప్పుడు టేబుల్ సిద్ధం చేయడం, భోజనం తరవాత టేబుల్ శుభ్రం చేయడం, తిన్న కంచం కడగడం లాంటి పనులు చెప్పవచ్చు. దీనివల్ల పిల్లలకు కుటుంబంలో బాధ్యతగా మెలగడం అలవడుతుంది.



- యుక్తవయసులోకి అడుగుపెట్టిన పిల్లలకు బజారు నుంచి కిరాణా సరుకులు తేవడం, కూరగాయలు కొనడం, ఆరిన బట్టలు మడత పెట్టడం లాంటి పనులు చెప్పవచ్చు.
- పిల్లలు పనులు చేసిన తరవాత వారిని తల్లిదండ్రులు ప్రశంసించాలి. చిన్నపాటి తప్పులున్నప్పటికీ వాటిని ఎత్తిచూపకూడదు. పిల్లలు చేసిన సహాయం తమకు ఎంత బాగా ఉపయోగపడిందో చెబుతూ ఆ పనులను మరింత బాగా చేసే విధానాన్ని వివరించి చెప్పాలి. అప్పుడే పిల్లలు కొత్తవాటిని నేర్చుకోవడానికి ఆసక్తి కనబరుస్తారు.

ఇలా చేస్తే పగుళ్లు రావు!

దంతాలు ఎంత బలంగా ఉన్నప్పటికీ కొన్ని పొరబాట్ల వల్ల వాటిపై పగుళ్లు ఏర్పడుతూ ఉంటాయి. క్రమం తప్పకుండా కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ దంతాలను సంరక్షించుకుకోవచ్చు.

- నోటిని పరిశుభ్రంగా ఉంచుకుంటే దంతాల దృఢత్వం చెదరదు. రోజుకు రెండుసార్లు దంతాలను శుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి.
- నిద్రలో కొంతమంది... ముఖ్యంగా పిల్లలు... పళ్లు కొరుకుతూ ఉంటారు. ఇలా చాలాకాలం కొనసాగితే దంతాలపై పగుళ్లు ఏర్పడతాయి. వైద్యుని సంప్రతించి పళ్లు కొరికే సమస్యను పరిష్కరించుకోవడం మంచిది.
- శరీరంలో కాల్షియం, డి విటమిన్ లోపించినప్పుడు దంతాలు బలహీనమై విరిగిపోతుంటాయి. నిత్యం పాలు, పాల పదార్థాలు, చేపలు, గుడ్లు, ఆకుకూరలు లాంటి పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి. ఉదయాన్నే లేత సూర్యకిరణాలు శరీరానికి తాకేలా చూసుకోవాలి.
- పుల్లని పదార్థాలు, దంతాలపై ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తాయి. దంతాలను సంరక్షించే ఎనామిల్ పొరను దెబ్బతీస్తాయి. దీంతో దంతాలు విరిగిపోవచ్చు. ఊరగాయలు, పండ్ల రసాలు, పుల్లని పండ్లు, టమాటా కెచప్ లాంటివి తీసుకున్న తరవాత మంచి నీటితో నోటిని పుక్కిలించాలి. శీతల పానీయాలు, కాఫీ, టీలు తాగడాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలి.





ఆ హాలీవుడ్ సూట్లు మనవే

పై ఫొటోలో సూట్ కుడుతూ బిజీగా కనిపిస్తున్న మహిళ పేరు మేకల కీర్తి. చదివింది నాలుగో తరగతే. అయితేనేం... ఆమె చేత్తో కుడుతున్న సూట్లు ధరించేది మాత్రం హాలీవుడ్ హీరోలు. తిరుపతి సమీపంలోని శ్రీసిటీలో ఇలాంటి వారు ఎంతో మంది కనిపిస్తారు..

శ్రీసిటీలో ఎమ్మెస్సార్ గార్మెంట్స్ అనే సంస్థ 2010లో తన కార్యకలాపాలు ప్రారంభించింది. దీనిలో ప్రస్తుతం 148 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో 120 మంది మహిళలే కావటం ఒక విశేషం. పైగా వీరిలో చాలా మంది ఐదు క్లాసు వరకే చదువుకున్నారు. ఈ సంస్థలో పనిచేసేవారు తమ చేతితో శ్రద్ధగా సూట్లను కుడతారు. వీరు తయారుచేసే సూట్లు మన దేశంలో అందుబాటులో ఉండవు. అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ ఇటలీ, స్వీడన్ వంటి దేశాలకు ఎగుమతి అవుతూ ఉంటాయి. వీటి ఖరీదు 2.5 లక్షల నుంచి 11 లక్షల వరకూ ఉంటుంది. "మా దగ్గర తయారయిన సూట్లను ఎక్కువగా హాలీవుడ్ సినిమాల్లో వాడుతూ ఉంటారు.." అని సంస్థ ప్రతినిధి వివరించారు.

> కీర్తికి చిన్నప్పుడే పెళ్లి చేసేశారు. భర్త లారీ డ్రైవర్. ముగ్గురు పిల్లలు. భర్త తెచ్చే డబ్బులతో ఆమెకు ఇల్లు గడవటం చాలా కష్టమయ్యేది. అందుకే కీర్తి కూలిపనికి వెళ్లేది. ఆ సమయంలో తనకు కుట్టు వచ్చని కూడా ఆమెకు తెలియదు. కానీ తనతో పాటు కూలీకి వెళ్లేవారు కొందరు శ్రీసిటీలో చేరితే తాను కూడా వెళ్లింది. అక్కడ సంస్థలో చేరింది. ప్రత్యేకమైన శిక్షణ పొందింది. ప్రస్తుతం నెలకు కీర్తికి నెలకు 20 వేలు వస్తుంది. శ్రీ సిటీలో కీర్తిలాంటి వారు మనకు ఎంతో మంది కనిపిస్తారు.

అంత సులభం కాదు..

సాధారణంగా మనకు మార్కెట్లో లభించే సూట్లు మన శరీర కొలతలకు తగినట్లుగా ఉండవు. చేతితో కుడితే మాత్రం శరీర కొలతలకు అనుగుణంగా ఉంటాయి. ఈ విధంగా కుట్టాలంటే విదేశాలలో



చాలా ఎక్కువ ఖరీదు అవుతుంది. అందువల్ల వారు తమ కొలతలను ఈ సంస్థకు పంపిస్తారు. దీనికి అనుగుణంగా ఇందులో పనిచేసే సిబ్బంది సూట్లను కుడతారు. అయితే ఇది సులభమైన పని కాదు. "దీనికి ప్రత్యేక నైపుణ్యం అవసరం. అందుకే మేము ముందు కొద్ది మందిని ఎంపిక చేసుకున్నాం. వారికి సుమారు ఆరేళ్ల పాటు శిక్షణ ఇచ్చాం. వారు బాగా ఆరితేరారని నమ్మకం వచ్చిన తర్వాత ఆర్డర్లు తీసుకోవటం ప్రారంభించాం. మా సంస్థ 2010లో ప్రారంభమయినా - 2016లోనే సూట్లను ఎగుమతి చేయటం ప్రారంభించాం. ప్రస్తుతం మాకు ఏడాదికి 12 కోట్ల టర్నోవర్ ఉంది" అని సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు. ఒక మిషన్ ద్వారా తయారుచేసిన సూట్లలో ఎన్ని కుట్లు ఉంటాయో తెలియదు. కానీ చేతితో కుట్టేడప్పుడు కొన్ని వేల కుట్లు వేయాల్సి వస్తుంది. "ఒక విషన్‌తో సూటు కుడితే ఎనిమిది గంటలు పడుతుంది. మా దగ్గర ఎనిమిది రోజులు పడుతుంది. కానీ ఒక సెంటీమీటర్ కూడా తేడా ఉండదు" అని సంస్థ ప్రతినిధి వెల్లడించారు.

> శ్రీసిటీలో ప్రస్తుతం 34 వేల మందికి పైగా మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఏడాదికి 60 వేల కోట్లకు పైగా ఉత్పత్తులు తయారుచేస్తున్నారు. వీటిలో ఎక్కువ శాతం విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. బరువులు ఎత్తే ఫోర్క్ లిఫ్టలను నడపటం దగ్గర నుంచి మెయింటినెన్స్ ఇంజినీర్ల వరకు రకరకాల హోదాల్లో పనిచేస్తున్నారు.

• కవరకుంట్ల శివప్రసాద్
ఫొటోలు: సాయికుమార్

'విల్ పవర్'తో గెలుపే లక్ష్యంగా

పోలియోతో రెండేళ్ల వయసు నుంచి ఇంటికే పరిమితమైనా... ఏనాడూ నైరాశ్యాన్ని ఆమె దగ్గరకు రానీయలేదు. 41 ఏళ్ల వయసులో ఎదురైన అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. పట్టుదలతో సాధన చేసి విజయాలు అందుకుంటున్నారు. పారా పవర్‌లిఫ్టింగ్‌లో కేరళ తరపున ఎన్నో ఘనతలు సాధించిన పి.వి. లతిక వచ్చేవారం జరగబోయే జాతీయ పోటీల్లో మరోసారి పతకాల వేటకు సిద్ధమవుతున్నారు.



"కొన్నాళ్ళ క్రితం కన్నూర్‌లోని ఒక పాఠశాలలో నిర్వహించిన క్రీడా దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యాను. కార్యక్రమం ముగిసిన తరువాత ఒక విలేకరి 'ప్రతిష్ఠాత్మకమైన పోటీల్లో పతకాలు సాధించారు కదా! మీ జీవితంలో అత్యుత్తమంగా అనిపించిన సందర్భం ఏది?" అని అడిగారు. "ఇదే... ఈ కార్యక్రమానికి హాజరు కావడమే" అని చెప్పాను. అది అక్షరాలా నిజం. ఎన్నడూ బడి ముఖం కూడా చూడని నేను రెండువేల మంది విద్యార్థులున్న పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావడం కన్నా గుర్తుండిపోయే సందర్భం ఇంకేం ఉంటుంది? "నా మాటలు అందరూ శ్రద్ధగా విన్నారు. వారిలో కొందరికైనా నా ద్వారా ప్రేరణ కలిగి ఉండే ఉంటుంది. అది ఎంతో సంతృప్తి కలిగిస్తోంది" అని అన్నాను.

పాకుతూ తిరిగేదాన్ని...

అందరిలా బడికి వెళ్ళాలి. బాగా చదువుకోవాలి... ఇది నా తీరని కోరిక. కానీ రెండేళ్ళ వయసులో పోలియో వచ్చి, నా కాళ్ళు చచ్చుబడిపోవడంతో అది నెరవేరలేదు. మాది కేరళలోని పయ్యన్నూర్ సమీపంలో ఉన్న మాతమంగళం అనే ఊరు. మా నాన్న పోర్టర్. అమ్మ వ్యవసాయ కూలీ. నాకు ఒక అక్క, ఒక చెల్లి. మాది నిరుపేద కుటుంబం. ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో మా అక్కని మా అమ్మమ్మ ఇంట్లో ఉంచి చదివించారు. "నాకు కనీసం సైకిలైనా ఉంటే నిన్ను బడికి తీసుకువెళ్ళేవాణ్ణి" అనేవాడు నాన్న. ఒకే గది ఉన్న ఇంట్లోనే రోజంతా ఉండలేక... నేల మీద నుంచి పాకుతూ... వీధిలో ఉన్న చెట్ల కింద కూర్చొని, వచ్చీపోయేవారిని చూస్తూ గడిపేదాన్ని. మా చెల్లెలు స్కూల్ నుంచి వచ్చేవరకూ ఎదురుచూసేదాన్ని. తను వచ్చి బడి కబుర్లు చెప్పేది. ఇలా కొన్నేళ్ళు గడిచాయి. నా తోబుట్టువులకు పెళ్ళయ్యాక అత్తవారిళ్ళకు వెళ్ళడంతో... పూర్తి ఒంటరితనంలో మునిగిపోయాను. అయితే నేను ఎన్నడూ కుంగిపోలేదు. నాకు ఏదో మంచి జరుగుతుందనే ఎప్పుడూ అనుకొనేదాన్ని. తొమ్మిదేళ్ళ క్రితం అలాంటి రోజు వచ్చింది.

మా రాష్ట్రం నుంచి మొదటి మహిళను నేనే...

అంగవైకల్యం ఉన్నవారికి ప్రభుత్వం మూడు చక్రాల స్కూటర్లు పంపిణీ చేస్తోందని తెలుసుకొని... దరఖాస్తు చేశాను. కొన్నాళ్ళలోనే నాకు స్కూటర్ మంజూరైంది. నా సోదరి కుమారుడి సహకారంతో... మూడు రోజుల్లోనే దాన్ని నడపడం నేర్చుకున్నాను. దాంతో నాకు కొత్తగా రెక్కలొచ్చినట్టు అనిపించింది. అప్పటివరకూ ఇంటికే పరిమితమైన నేను... ఆ స్కూటర్ మీద ఊరంతా తిరిగేదాన్ని. ఆలయాలకు, ఉత్సవాలకు వెళ్ళేదాన్ని. కొన్నిసార్లు మావాళ్ళతో దూర ప్రాంతాలకు కూడా వెళ్ళొచ్చాను. కాలం ఇలా గడుస్తూ ఉండగా... మా పొరుగున ఉన్న అబ్దుల్ బషీర్ అనే పెద్దాయన ఒక రోజు మా ఇంటికి వచ్చారు. ఆయన నాకు చిన్నప్పటినుంచీ తెలుసు. రోడ్డు ప్రమాదంలో నడుము వరకూ ఆయనకు చచ్చుబడింది. "ఈ రోజు సాయంత్రం ఒక చోటుకు వెళ్దాం వస్తావా?" అని అడిగారు. సరేనన్నాను. మా ఊరుకు నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇండోర్ స్టేడియంకు నన్ను తీసుకువెళ్ళారు. అక్కడ పారా పవర్ లిఫ్టింగ్‌లో ఎంపికలు జరుగుతున్నాయి. 'వాటిని చూపించడానికి ఆయన తీసుకువచ్చారేమో?' అనుకున్నాను. నిర్వాహకులతో బషీర్ మాట్లాడారు. నా దగ్గరకు వచ్చి... "నువ్వు పవర్ లిఫ్టింగ్‌కు ప్రయత్నిస్తే బాగుంటుంది కదా!" అన్నారు. అంతకుముందు ఆ క్రీడను నేను కనీసం చూడనైనా లేదు. కానీ 'ప్రయత్నిస్తే తప్పేముంది?' అనిపించింది. మొదటి ప్రయత్నంలోనే ముప్పై కిలోలు అవలీలగా ఎత్తగలిగాను. జాతీయ పారా పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాను. కేరళ తరపున ఈ క్రీడలో క్వాలిఫై అయిన మొదటి మహిళను నేనని తెలిసినప్పుడు... ఆశ్చర్యం, ఆనందం నన్ను ముంచెత్తాయి. కేరళ పారా పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు జోబీ మాథ్యూ నాతో ప్రత్యేకంగా మాట్లాడారు. "నీకు సామర్థ్యం ఉంది, కానీ శిక్షణ లేదు. జాతీయ పోటీలకు ఇంకా రెండు నెలల సమయం ఉంది. కాబట్టి శిక్షణ తీసుకో" అని చెప్పారు. మా ఊరుకు దగ్గర్లోని టౌన్‌లో చక్కటి సౌకర్యాలున్న జిమ్‌ల పేర్లను ఆయన సూచించారు. అయితే అవన్నీ పై అంతస్తుల్లోనే ఉన్నాయి. నేను పైకి ఎక్కడం కష్టం. చివరకు, ఇంట్లో జిమ్ నడుపుతున్న పుష్ప అనే మహిళా శిక్షకురాలు దొరికారు. ఆ సమయంలోనే నా గురించి తెలుసుకున్న 'ఇన్‌స్పైర్' అనే స్వచ్ఛంద సంస్థ నా ప్రయాణ ఖర్చులను స్పాన్సర్ చేసింది. నా చెల్లెలిని సాయం తీసుకొని జాతీయ పోటీల కోసం నాగపూర్ వెళ్ళాను. నేను విమానం ఎక్కడం అదే తొలిసారి.



> బరువు పెరగడంతో... 2023లో డిల్లీలో నిర్వహించిన పోటీల్లో 67 కిలోల కేటగిరీలో పాల్గొనాల్సి వచ్చింది. అందులో రజత పతకం దక్కింది. కానీ మరిన్ని స్వర్ణాలు గెలవాలనేది నా ఆశ. కానీ హఠాత్తుగా అనారోగ్యం పాలయ్యాను. వైద్యులు విశ్రాంతి అవసరమని చెప్పడంతో... కిందటి ఏడాది పోటీలకు వెళ్ళలేకపోయాను. కోలుకున్న వెంటనే మళ్ళీ అభ్యాసం కొనసాగించాను. ఈనెల (మార్చి) 16 నుంచి 18 వరకూ నోయిడాలో జరగబోయే 22వ సీనియర్ నేషనల్ పారా పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు సిద్ధమవుతున్నాను. నేను పవర్ లిఫ్టింగ్ ప్రారంభించి ఏడేళ్ళయింది. ఇప్పటికీ కేరళ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక మహిళను నేనే.

ఆ కల నెరవేర్చుకున్నా...

పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నాను. కానీ ఇతర పోటీదారుల ముందు నా నైపుణ్యం సరిపోలేదు. నాలుగో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దాంతో నాలో పట్టుదల పెరిగింది. మరిన్ని ఎక్కువ సౌకర్యాలున్న జిమ్‌లో చేరాను. రోజూ మెట్ల మీద పాక్కుంటూ పైకి వెళ్ళేదాన్ని. మా ట్రైనర్ మోహనన్ నా దగ్గర డబ్బులేవీ తీసుకోలేదు. అయితే "పవర్ లిఫ్టింగ్‌లో రాణించాలంటే దారుఢ్యం ఎంతో అవసరం. తగిన ప్రోటీన్ కోసం రోజూ పదిహేను గుడ్లు, చికెన్ తినాలి. తీపి పదార్థాలు, వేపుళ్ళు మానేయాలి" అంటూ సూచనలు చేశారు. ఆయన వద్దన్నవి తీసుకోలేదు, కానీ అవసరమన్నవి తీసుకొనే స్థోమత మాకు లేదు. కాబట్టి వీలైన మేరకే పాటించేదాన్ని. పూర్తిగా సిద్ధమైన దశలో... కొవిడ్ విజృంభించింది. పోటీలు వాయిదా పడ్డాయి. ఆ సమయాన్ని నేను శిక్షణ కోసం వినియోగించుకున్నాను. తరువాత... 2021లో... బెంగళూరులో జరిగిన నేషనల్స్‌లో పాల్గొని, రెండో స్థానంలో నిలిచాను. కానీ నా లక్ష్యం స్వర్ణ పతకం సాధించడం. అందుకోసం తీవ్రంగా సాధన చేశాను. 2022లో... అరవై ఒక్క కిలోల కేటగిరీలో బంగారు పతకం సాధించి నా కల నెరవేర్చుకున్నాను. పారా పవర్‌లిఫ్టింగ్‌లో ఈ ఘనత సాధించిన తొలి కేరళ మహిళగా నిలిచాను. ఒకప్పుడు ఇల్లు దాటని నాకు ఇప్పుడు సమాజంలో గుర్తింపు లభించింది. నా కథ ఏ ఒక్కరిలో స్ఫూర్తి కలిగించినా... నా జీవితం సఫలమైనట్టే. రాబోయే పోటీల్లో రాణించాలి. అంతర్జాతీయ పోటీల్లో కూడా నా ప్రతిభ కనబరచాలి. ప్రస్తుతం ఇదే నా ఆకాంక్ష."

రక్తదానం చేస్తే...

రక్తదానం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడడమే కాకుండా రక్తదాతకు ఎన్నో ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

- రక్తదానం చేస్తున్నప్పుడు శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. వీటివల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది.
- రక్తదానం చేసినవెంటనే శరీరంలో కొత్త రక్తకణాల ఉత్పత్తి ప్రారంభమౌతుంది. మెదడు నుంచి పాదాల వరకూ రక్తప్రసరణ వేగంగా జరుగుతుంది.
- రక్తదానం చేయడం వల్ల మనసులో ప్రతికూల ఆలోచనలు తగ్గి మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఒంటరితనం అనే భావన తొలగిపోతుంది. మానసిక సంతృప్తి లభిస్తుంది.



- రక్తదానం చేస్తే శరీరంలో పేరుకున్న అదనపు ఇనుము బయటికి వెళ్లడానికి అవకాశం ఏర్పడుతుంది దీనివల్ల అవయవాల పనితీరు సక్రమంగా మారుతుంది.
- రక్తదానం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గి గుండె జబ్బులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు రావు. గుండె, రక్తనాళాల పని తీరు మెరుగుపడుతుంది.
- పద్దెనిమిది నుంచి అరవై ఏళ్ల వయసు ఉన్న ఆరోగ్యవంతులంతా రక్తదానం చేయవచ్చు. చెడు అలవాట్లు, హెపటైటిస్- బీ/సి, హెచ్ఐవీ, అధిక రక్తపోటు ఉన్నవారు రక్తదానం చేయడానికి వీలు లేదు. ఒకసారి రక్తదానం చేస్తే దాంతో ముగ్గురికి ప్రాణదానం చేసే వీలుంది.
- రక్తదానం చేసేటప్పుడు గుండె కొట్టుకునే వేగం, రక్తపోటు స్వల్పంగా పెరగవచ్చు. కాబట్టి వదులుగా ఉండే దుస్తులు ధరించడం మంచిది. రక్తదానం చేసిన తరవాత రెండు రోజుల వరకూ వ్యాయామం చేయకూడదు.

ఇంటికి శోభనిచ్చే మనీ ప్లాంట్!

చాలామంది ఇళ్లలో మనీ ప్లాంట్ పెంచుకుంటూ ఉంటారు. ఈ తీగ అందంగా అల్లుకోవాలంటే ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం.

- మనీ ప్లాంట్‌ని ఏ సైజు కుండీలోనైనా పెంచవచ్చు. పెద్ద కుండీ అయితే ఆకులు వెడల్పుగా వస్తాయి.
- గాజు సీసాలో నిండుగా నీరు పోసి అందులో ఈ మొక్కను ఉంచినా కూడా బాగా పెరుగుతుంది. పదిహేను రోజులకు ఒకసారి నీళ్ల మారిస్తే చాలు.
- ఈ మొక్కకు ఎక్కువగా ఎండ తగలకూడదు. కొద్దిగా వెలుతురు ఉంటే చాలు తీగలా చక్కగా పెరుగుతుంది.
- కుండీలో తరచూ నీళ్లు పోయకూడదు. మట్టి తేమగా ఉంటే చాలు. ఆకులపై కొన్ని నీళ్ల పిచికారీ చేస్తూ ఉంటే అవి పచ్చగా మెరుస్తూ కనిపిస్తాయి.
- కుండీలో మట్టికి మూడు నెలలకు ఓసారి ఆవుపేడతో తయారుచేసిన సేంద్రీయ ఎరువు కలపాలి.
- మొక్క మొదళ్లలో నాచుకర్రలు పాతితే వేళ్లకు నిరంతరం తేమ అందుతూ ఉంటుంది. మొక్క పొడవుగా పెరుగుతుంది.
- ఎండిన, పండిన ఆకులను ఎప్పటికప్పుడు తీసివేస్తూ తీగను అందంగా అమరుస్తూ ఉంటే మొక్క పెరుగుతూనే ఉంటుంది. కుండీ మధ్యలో పొడవాటి కర్రను ఉంచి దాని చుట్టూ తీగను చుడుతూ ఉంటే మొక్క గుబురుగా పెరుగుతుంది. చూడడానికి అందంగా కనిపిస్తుంది.



రోజూ తలస్నానం మంచిదేనా?

వాతావరణ కాలుష్యం వల్ల కురులలో మురికి చేరుతూ ఉంటుంది. దీనిని తొలగించి శిరోజాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటే తలస్నానం తప్పనిసరి. తలస్నానానికి సంబంధించి నిపుణుల సూచనలు ఇవి....

- మాడు మీద ఉత్పత్తి అయ్యే జిడ్డుకు దుమ్ము, ధూళి తోడై తలలో కురుపులు ఏర్పడవచ్చు. కాబట్టి తలలో జిడ్డు చర్మం ఉన్నవారు వారానికి నాలుగుసార్లు తలస్నానం చేయాలి. వీరు ప్రతిరోజూ చేసినా కూడా మంచిదే.
- తలలో పొడి చర్మం ఉన్నవారు తరచూ తలస్నానం చేయకూడదు. దీనివల్ల మాడుమీద సహజనూనెల ఉత్పత్తి తగ్గిపోయి శిరోజాలు పొడిబారి నిర్జీవంగా కనిపిస్తాయి. వీరు వారానికి రెండుసార్లు తలస్నానం చేస్తే చాలు.
- పది రోజులకు ఒకసారైనా తలస్నానం చేయని పక్షంలో కుదుళ్ల దగ్గర బ్యాక్టీరియా వృద్ధి పొందుతుంది. దీనివల్ల చుండ్రు సమస్యలు వస్తాయి శిరోజాలకు రక్తప్రసరణ జరగక అవి రాలిపోతాయి.



- స్విమ్మిగ్ పూల్‌లో ఈత కొట్టాక తప్పనిసరిగా తలస్నానం చేయాలి. పూల్‌లో నింపిన నీటిలో క్లోరిన్ కలుపుతారు. ఇది శిరోజాలకు హాని కలిగిస్తుంది.
- దుమ్ము, ధూళి, కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నివశించేవారు; ఎక్కువ దూరాలు ప్రయాణం చేసేవారు ప్రతిరోజూ తలస్నానం చేయడం మంచిది. లేదంటే తలలో ఫంగస్ పెరిగే అవకాశం ఉంది.
- వేసవికాలంలో తలలో ఎక్కువగా చెమట పడుతూ ఉంటుంది. దీనివల్ల మాడు మీద చెమటకాయలతోపాటు శిరోజాల సమస్యలు వస్తూ ఉంటాయి. అందుకే వేసవిలో వారానికి నాలుగుసార్లు తలస్నానం చేయడం మంచిది.

దిక్సూచి DIKSUCHI

విదేశీ భాషా కోర్సులు ఇక్కడ చదవొచ్చు



భాష అనేది కేవలం భావ వ్యక్తీకరణకు సంబంధించిన సాధనం మాత్రమే కాదు. ఆధునిక కాలంలో అది కెరీర్ కూడా. మాతృభాషతోపాటు విదేశీ భాషలు నేర్చుకుని అద్భుతమైన కెరీర్ సొంతం చేసుకోవచ్చు. ఎన్ని ఎక్కువ భాషలు వస్తే అన్ని అవకాశాలు పెరుగుతాయి కూడా. భారతదేశంలో విదేశీ భాషలను ప్రైవేటు సంస్థలతోపాటు పలు ప్రభుత్వ విద్యా సంస్థలు కూడా అందిస్తున్నాయి. ఇందులో బిగినర్ కోర్సులు, ఇంటర్మీడియెట్ కోర్సులు, అడ్వాన్స్‌డ్ కోర్సులు, స్పెషలైజ్డ్ కోర్సులు ఉంటాయి. బిగినర్ కోర్సులు కొంత ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందిస్తే ఇంటర్మీడియెట్ కోర్సులు భాషా పరిజ్ఞానాన్ని పెంచుతాయి. అడ్వాన్స్‌డ్, స్పెషలైజ్డ్ కోర్సులు అయితే కెరీర్‌కు కావాల్సిన భాషా సంపదను కలిగిస్తాయి. మన దేశంలో భాషకు సంబంధించి కోర్సులు అందించే ప్రభుత్వ వర్సిటీల్లో కొన్ని....

ఢిల్లీ యూనివర్సిటీ: ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, ఇటాలియన్, పర్షియన్, మోడరన్ అరబిక్, పాలీ, టిబెటన్ భాషా - సాహిత్యంలో సర్టిఫికెట్ కోర్సులను అందిస్తోంది. ఇంటర్ పూర్తి చేసిన వారు ఈ కోర్సుల్లో చేరడానికి అర్హులు. https://www.du.ac.in/

బనారస్ హిందూ యూనివర్సిటీ: పలు విదేశీ భాషలకు సంబంధించిన డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను బనారస్ హిందూ యూనివర్సిటీ అందిస్తోంది. ఫ్రెంచ్, స్పానిష్, రష్యన్, చైనీస్ భాషలు ఇందులో ఉన్నాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. https://www.bhu.ac.in/

గురునానక్‌దేవ్ యూనివర్సిటీ, అమృత్‌సర్: ఈ వర్సిటీలో ఫ్రెంచ్‌లో ఫుల్‌టైమ్ డిప్లొమాలు, చైనీస్, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, రష్యన్ భాషల్లో పార్ట్‌టైమ్ డిప్లొమాలు ఉన్నాయి. అంతేకాకుండా ఫ్రెంచ్‌లో పార్ట్‌టైమ్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా కూడా అందుబాటులో ఉంది. వీటికి దరఖాస్తు చేయడానికి ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు. https://www.gndu.ac.in/

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూఢిల్లీ: భాషలకు సంబంధించిన పలు కోర్సులను ఈ యూనివర్సిటీ అందిస్తుంది. జర్మన్, రష్యన్, స్పానిష్, జపనీస్, కొరియన్, చైనీస్ తదితర భాషలకు సంబంధించిన యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు ఇక్కడ ఉన్నాయి. www.jnu.ac.in/main/

సీఫెల్, హైదరాబాద్: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ సమీపంలో ఉన్న 'సీఫెల్' పలు యూరోపియన్ భాషలకు సంబంధించిన కోర్సులను అందిస్తుంది. ఇందులో ఫ్రెంచ్, ఫ్రాన్సోఫోన్ స్టడీస్, జర్మనిక్ స్టడీస్, హిస్పానిక్ స్టడీస్, లాటిన్, రష్యన్‌కు స్టడీస్ తదితరాలపై పలు కోర్సులు ఉన్నాయి. https://www.efluniversity.ac.in

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో డిప్లొమా అడ్మిషన్లు

హైదరాబాద్ బాలానగర్‌లో ఉన్న 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్'(సీఐటీడీ)లో 2025-26 సంవత్సరానికి కింది డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నారు. 1968లో ఏర్పాటైన కేంద్రప్రభుత్వ సంస్థ ఇది. ఇందులో సర్టిఫికెట్, డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా, ఎంఈ, ఎంటెక్ కోర్సులు ఉన్నాయి. ప్రస్తుతం డిప్లొమా కోర్సులకు నోటిఫికేషన్ వెలువడింది.

కోర్సులు	సీట్లు
డిప్లొమా ఇన్ టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్(డీటీడీఎం)	60
డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(డీఈసీఈ)	60
డిప్లొమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇంజనీరింగ్(డీఏఆర్ఈ)	60
డిప్లొమా ఇన్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్(డీపీఈ)	60

(డీటీడీఎం కోర్సు నాలుగు సంవత్సరాలు - మిగిలిన కోర్సు మూడు సంవత్సరాలు)

విద్యార్హతలు: డీటీడీఎం కోర్సు చేయాలంటే కనీసం 50 శాతం మార్కులతో పది పాసై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం చాలు.

వయోపరిమితి: 2025 మే 22 తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 19 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు గరిష్ఠ వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక: జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలో చేయవచ్చు.

పరీక్ష విధానం: పదో తరగతి స్థాయిలో మేథ్స్, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతోపాటు, ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్‌లపై ప్రశ్నలు ఉంటాయి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 మే 22. **ప్రవేశ పరీక్ష:** 2025 మే 25

Contact Details: Admission Desk at Diploma Block
Ph: 9502405170, 040-29561795 **E-Mail:** training@citdindia.org,
Website: https://www.citdindia.org

ఐఐఐటీ శ్రీసిటీలో ఎంటెక్



వీఎల్ఎస్ఐ, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ స్పెషలైజేషన్

గ్లోబల్ సెమీ కండక్టర్ ఇండస్ట్రీ 2026 నాటికి 64 బిలియన్ డాలర్లు చేరుకుని, 2030 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు దాటుతుందని మెకిన్సే కంపెనీ అంచనా వేసింది. అందువల్ల వీఎల్ఎస్ఐ, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ ప్రొఫెషనల్స్‌కు డిమాండ్ విపరీతంగా ఉంటుందని చెబుతోంది. అలాగే 2025 సంవత్సరం చివరి నాటికి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ) మార్కెట్ రెండు బిలియన్ డాలర్లు ఉండవచ్చని నాస్కామ్ చెబుతోంది. అటానమస్ వెహికిల్స్ డ్రోన్లు తదితరాల కారణంగా ఎంబెడెడ్ సిస్టమ్స్, అటానమస్ టెక్నాలజీ అవసరాలు పెరుగుతున్నాయి. ఇక సైబర్ సెక్యూరిటీ గురించి చెప్పాల్సిన పని లేదు. 2025 చివరి నాటికే ట్రిలియన్ల డాలర్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో తమ కంపెనీ సైబర్ సెక్యూరిటీ బడ్జెట్‌ను అన్ని కంపెనీలు రెండింతలు చేయనున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ చిత్తూరులోని శ్రీసిటీలో ఉన్న 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ'(ఐఐఐటీ) ఎడ్ కంపెనీ టీమ్ లీజ్‌తో కలిసి అడ్వాన్స్‌డ్ ఆన్‌లైన్ ఎగ్జిక్యూటివ్ ఎంటెక్ ప్రోగ్రామ్‌లు ప్రారంభించింది. వీఎల్ఎస్ఐ, ఐవోటీ అండ్ అటానమస్ సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీల్లో ఈ ఎంటెక్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

ఎంటెక్ - వీఎల్ఎస్ఐ: సెమీ కండక్టర్ టెక్నాలజీస్, డిజిటల్, అనలాగ్ సర్క్యూట్ డిజైన్, సిస్టమ్ ఆన్ చిప్ డెవలప్‌మెంట్‌పై కోర్సు ఉంటుంది. దీనితోపాటులో పవర్ వీఎల్ఎస్ఐ, నానో స్కేల్ డివైజెస్, మిక్స్‌డ్ సర్క్యూట్ డిజైన్‌లపై ఫోకస్ ఉంటుంది. సెమీ కండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్, చిప్ డిజైన్, ఎంబెడెడ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ రోల్స్ కోసం పనిచేసేలా విద్యార్థులను తయారు చేస్తారు.

ఎంటెక్ - ఐవోటీ అండ్ అటానమస్ సిస్టమ్స్: ఐవోటీ ఆర్కిటెక్చర్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, అటానమస్ డెసిషన్ మేకింగ్, అడ్వాన్స్‌డ్ వైర్‌లెస్ కమ్యూనికేషన్స్, 5జీ/6జీ టెక్నాలజీస్, డిజిటల్ ట్విన్ అప్లికేషన్స్ తదితరాల్లో ప్రావీణ్యం ఉండేలా రూపొందిస్తున్నారు.

ఎంటెక్-సైబర్ సెక్యూరిటీ: క్రిప్టోగ్రఫి, ఎథికల్ హాకింగ్, క్లౌడ్ సెక్యూరిటీ, ఏఐ ఆధారిత థ్రెట్ డెసిషన్ తదితరాల్లో నాలెడ్జ్ ఉండేలా రూపొందించారు. బ్లాక్‌చైన్ అప్లికేషన్స్, డిజిటల్ ఫోరెన్సిక్స్ లాంటి వాటిలో హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్ వచ్చేలా చేస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు తదితరాల సైబర్ సెక్యూరిటీ ప్రాబ్లమ్స్ పరిష్కరించేలా ఉంటారు. 2025 జూలై నుంచి ఈ కోర్సులు ప్రారంభం అవుతాయి. సంవత్సరంలో ఒక వారం క్యాంపస్‌కి రావాల్సి ఉంటుంది. మిగిలిన క్లాసులు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో బీటెక్/బీఈ/ ఎమ్మెస్సీ/ఎంసీఏ డిగ్రీని పూర్తిచేయాలి. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు 50 శాతం చాలు. అభ్యర్థులకు 'గేట్' స్కోరు తప్పనిసరి కాదు.

ఫీజు: సెమిస్టరుకు రూ. 65000/- చొప్పున నాలుగు సెమిస్టర్లకి కలిపి రూ. 2,60,000/- అవుతుంది.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్, ఫోన్‌లను సంప్రదించవచ్చు.
040-49170726, admission@iiitsricityonline.com
https://cep.digivarsity.com/iiit-sricity/

SCHOLARSHIP ALERT

Narotam Sekhsaria Scholarships for Higher Studies

Description: Narotam Sekhsaria Scholarships for Higher Studies 2025-26 is a merit-based scholarship initiative of the Narotam Sekhsaria Foundation that aims to provide financial assistance to outstanding Indian students aspiring to pursue higher education at prestigious institutions in India and abroad.

Eligibility: Applicants must be an Indian national residing in India and a graduate from an accredited Indian university. They should be under 30 years old as of 31st January 2025. They must plan to pursue a postgraduate degree in top-ranking institutions in India or abroad, starting in the Fall 2025.

Prizes & Rewards: The scholarship offers interest-free loans as financial assistance including mentorship support.

Last Date: 17-03-2025 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/NSSP1

India High Fliers Undergraduate



Description: India High Fliers Undergraduate Scholarships 2025 is provided by the University of Birmingham to students pursuing selected full-time undergraduate programs at the university. A total of 20 scholarships will be available for the academic year 2025-26.

Eligibility: Applicants must be a domiciled resident of India holding an offer for a full-time undergraduate program. They must be classified as overseas fee-payer student.

Prizes & Rewards: The scholarship offers an amount of GBP 5,000 for the first year of undergraduate studies.

Last Date to Apply: 31-05-2025

Application mode: Offline applications via local representatives and partnered schools

Short Url: www.b4s.in/aj/IHFS1

Vahani Scholarship

Description: The Vahani Scholarship for 2025-26 is offered by the Vahani Group to Class 12 students. This scholarship aims to support students from economically disadvantaged backgrounds in India to pursue their higher education.

Eligibility: Open to Indian citizens currently studying in Class 12 and appearing for the final board examination next year. Applicants must have secured at least 85% marks in Class 10. The applicant's annual family income must be less than 300,000 from all sources.

Prizes & Rewards: Full tuition fees, stipend, and other benefits. ***Last Date:*** 01-12-2025

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/VAHS1

buddy4study.com

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

షూటింగ్ పూర్తి



కంగనా రనౌత్, మాధవన్ జంటగా మరోసారి ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమయ్యారు. వారిద్దరూ ప్రధాన పాత్రధారులుగా ఏఎల్ విజయ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని కంగన సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. చిత్రబృందంతో సెట్‌లో దిగిన ఫొటోలను షేర్ చేశారు. త్వరలోనే టైటిల్‌ను ప్రకటించి, సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని తెలిపారు. సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం తెరకెక్కింది. 'తను వెడ్స్ మను రిటర్న్స్' చిత్రం తర్వాత కంగన, మాధవన్ కలసి నటించిన చిత్రమిది. అలాగే 'తలైవి' చిత్రం తర్వాత మరోసారి ఏఎల్ విజయ్ దర్శకత్వంలో కంగన నటించారు. తమిళ, హిందీ భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

కొత్త ప్రయాణం మొదలు



నటి అభినయ వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. చిన్ననాటి స్నేహితుణ్ణి ప్రేమించాననీ, త్వరలో అతన్ని పెళ్లి చేసుకుంటానని గతంలో ఆమె తెలిపారు. ఇటీవలే నిశ్చితార్థం జరిగినట్లు ఆదివారం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభినయ తెలిపారు. కాబోయే భర్తతో కలసి ఆలయంలో గంట కొడుతున్న ఫొటోను షేర్ చేసి, 'కొత్త ప్రయాణం మొదలైంది' అని చెప్పారు. అయితే కాబోయే భర్త వివరాలు, పెళ్లి ఎప్పుడు జరగబోతోంది అనే విషయాలను ఆమె తెలపలేదు. పలు దక్షిణాది సినిమాల్లో నటించిన అభినయ 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు, శంభో శివ శంభో తదితర చిత్రాలతో తెలుగునాట గుర్తింపు తెచ్చుకున్నారు.

భయానక అనుభవాల కథ



యదార్థ సంఘటనల ఆధారంగా సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన చిత్రం 'శారీ'. ఆర్జీవీ - ఆర్వి ప్రొడక్షన్స్ బేనర్‌పై గిరి కృష్ణ కమల్ దర్శకత్వంలో రవిశంకర్ వర్మ నిర్మించారు. సత్య యాదు, ఆరాధ్యదేవి జంటగా నటించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. పలు భారతీయ భాషల్లో ఈ నెల 21న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ 'సోషల్ మీడియా ప్రభావం వల్ల యువత ఎదుర్కొన్న భయానక అనుభవాల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అన్నారు. ఓ మంచి సినిమాతో నిర్మాతగా పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉందని రవిశంకర్ చెప్పారు.



శ్రీలీలకు చిరంజీవి కానుక

నటి శ్రీలీలకు చిరంజీవి ఓ విలువైన కానుకను బహూకరించారు. చిరంజీవి కథానాయకుడిగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమా సెట్స్‌లో శ్రీలీల సందడి చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా దుర్గాదేవి ప్రతిమ ఉన్న ఓ వెండి శంఖాన్ని ఆమెకు కానుకగా ఇచ్చారు చిరంజీవి. ఈ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి, అభిమానులతో తన ఆనందాన్ని పంచుకున్నారు శ్రీలీల. భారీ బడ్జెట్‌తో వంశీ, విక్రమ్, ప్రమోద్ 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శ్రీలీల కూడా ఓ ప్రత్యేక పాత్రలో నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు.

చరిత్రలో నిలిచిపోయే చిత్రం...



'మల్లేశం', 8 ఏఎమ్ మెట్రో చిత్రాల దర్శకుడు రాజ్ రాచకొండ. ఆయన దర్శకత్వంలో కొత్త చిత్రం రాబోతోంది. నటుడు రానా దగ్గుబాటి సొంత నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా, స్టూడియో 9తో కలసి నిర్మిస్తోంది. తేజ, తన్మయి, ఝాన్సీ, తాగుబోతు రమేశ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 1990ల్లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిస్తున్న ఈ సినిమాకు '23' అనే టైటిల్‌ను ఖరారు చేసి టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రాజ్ రాచకొండ మాట్లాడుతూ "ఈ సినిమా మానవ హక్కుల గొప్పతనాన్ని ఆవిష్కరిస్తుంది. అన్యాయానికి గురైన వారికి అండగా ఉంటుంది. తప్పు చేయడం తప్పని చెప్పడంతో పాటు హింసకు వ్యతిరేకంగా ఉంటుంది" అని అన్నారు. "ఈ సినిమాను ప్రేక్షకులు వెతుక్కుంటూ వచ్చి చూస్తారు. చరిత్రలో నిలబడిపోతుంది" అని నటి ఝాన్సీ చెప్పారు.

స్పెషల్ సాంగ్‌తో సిద్ధమా?

సినిమాల్లో కథానాయిక పాత్రల్లో అలరించడమే కాదు, అప్పుడప్పుడూ రూటు మార్చి ప్రత్యేక గీతాల్లోనూ మెరుస్తుంటారు తారామణులు. జనాల్లో క్రేజ్ పెంచడమే కాకుండా సినిమా విజయానికీ దోహదపడుతుంటారు. తాజాగా అగ్రహీరోలతో ప్రత్యేక గీతాలు చేస్తున్నారంటూ కొంతమంది హీరోయిన్ల పేర్లు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి. వారెవరో తెలుసుకుందాం.



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'రాజా సాబ్'. ఈ హారర్ థ్రిల్లర్‌లో మాంచి జోష్‌తో నిండిన ప్రత్యేక గీతం ఉందట. ఈ పాటలో స్టెప్పులేసేందుకు ఓ స్టార్ హీరోయిన్ అయితే బావుంటుందని భావించిన చిత్రబృందం నయనతారని సంప్రదించారని టాక్. ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. గతంలో ప్రభాస్‌కు జంటగా 'యోగి' సినిమాలో హీరోయిన్‌గా నటించారు నయనతార. ఇక 'యానిమల్' సినిమాలో అందాల ఆరబోతతో అలరించిన త్రిప్తి డిమ్రీని సైతం మేకర్స్ సంప్రదించినట్లు ప్రచారం జరిగింది. అయితే, వీరిలో ఎవరు ఫైనల్‌గా పాటలో కనపడతారనేది తెలియాల్సి ఉంది.

ఎన్టీఆర్.. హృతిక్‌తో

2022లో వరుణ్‌ధావన్ హీరోగా నటించిన 'భేడియా' చిత్రంలో 'తుమ్‌కేశ్వరీ' అనే ప్రత్యేక గీతంలో మెరిశారు శ్రద్ధా. 'పుష్ప 2'లో 'కిస్సిక్' సాంగ్ కోసం మొదట శ్రద్ధాని సంప్రదించినా పారితోషికం తక్కువని ఆమె అంగీకరించలేదు. ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న చిత్రం 'వార్ 2'లో ఆమె స్పెషల్ సాంగ్ చేయబోతున్నారట. 2019లో విడుదలై సూపర్ హిట్ సాధించిన 'వార్'కు ఇది కొనసాగింపు. ఈ సినిమాపై తారస్థాయిలో ఉన్న అంచనాలను మరింత పెంచేలా ప్లాన్ చేస్తున్నారు నిర్మాతలు. అందు కోసం ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేస్తున్నారు. 'స్త్రీ 2'తో ఇండస్ట్రీ హిట్ కొట్టిన శ్రద్ధా కపూర్‌ను ఈ పాట కోసం సంప్రదించారని టాక్. మంచి డ్యాన్సరైన శ్రద్ధా తన స్టెప్పులతో.. ఎన్టీఆర్, హృతిక్ ఎనర్జీని పర్ఫెక్ట్‌గా మ్యాచ్ చేస్తారని మేకర్స్ అభిప్రాయపడుతున్నారట.

ఒకేసారి రెండు చిత్రాల్లో..

'గేమ్ ఛేంజర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించారు కియారా అడ్వాణీ. యశ్ కథానాయకుడిగా 'ముఫ్తీ' ఫేమ్ గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'టాక్సిక్'. ఇందులో కియారా ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. అలాగే, ఈ సినిమాలో ఓ ప్రత్యేక గీతంలో కూడా ఆమె కనిపించనున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా వచ్చిన 'సలార్' చిత్రానికి సీక్వెల్‌లో కీలక పాత్రతో పాటు ప్రత్యేక గీతంలో కియారా తళుక్కున మెరవనున్నారనే టాక్ నడుస్తోంది. 2022లో విక్కీ కౌశల్ హీరోగా నటించిన 'గోవింద్ మేరా నామ్' చిత్రంలో 'బిజిలీ' అనే ప్రత్యేక గీతంలో నటించారు కియార.

సీక్వెల్‌లోనూ ఛాన్స్

రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'జైలర్' సినిమా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో తమన్నా భాటియా చేసిన 'నువ్వే కావాలయ్యా' ప్రత్యేక గీతం పెద్ద హిట్ అయింది. దీంతో ఈ సినిమా సీక్వెల్‌లో తమన్న పాత్ర నిడివిని పెంచడంతో పాటు ఆమెతో ప్రత్యేక గీతం ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. ఇటీవలే తమన్న 'స్త్రీ'లో ఓ స్పెషల్ సాంగ్ చేయడం.. ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో.. ఆ సెంటిమెంట్ కలిసొస్తుందనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నారట మేకర్స్.

ఓజీ కోసం రాధిక

'డీజే టిల్లు' చిత్రంతో యువతరాన్ని ఆకట్టుకున్న కథానాయిక నేహా శెట్టి. ఆ చిత్రంతో ఆమె క్రేజ్ ఒక్కసారిగా పెరిగింది. ప్రస్తుతం ఈ భామకు ఓ సూపర్ ఆఫర్ వచ్చింది. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓజీ'. ఈ సినిమా సెకండ్ హాఫ్‌లో వచ్చే ప్రత్యేక గీతం కోసం నేహా శెట్టిని ఎంపిక చేశారు. అయితే, ఇందులో ఆమె కేవలం ఓ పాటకే పరిమితమవుతారా లేదా కీలక పాత్రలో నటిస్తున్నారా అనేది తెలియాల్సి ఉంది.

మరోసారి ప్రత్యేక గీతంలో

సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'రెట్రో'. మే 1న విడుదలవనున్న ఈ సినిమాలో శ్రియ ఓ ప్రత్యేక గీతంలో స్టెప్పులేశారని తెలుస్తోంది. కాగా, ఇప్పటికే పవన్‌కల్యాణ్ నటించిన 'పులి'.. వెంకటేశ్ నటించిన 'తులసి'.. తరుణ్ నటించిన 'సోగ్గాడు'.. ప్రభాస్ నటించిన 'మున్నా' వంటి పలు చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌లో తళుక్కుమన్నారు శ్రియ.



వన్డే చరిత్రలో అత్యధికంగా 15 సార్లు వరుసగా టాస్ ఓడిన జట్టుగా భారత్. 2011-13 మధ్య నెదర్లాండ్స్ 11సార్లు వరుసగా టాస్ కోల్పోయింది.

1



చాంపియన్స్ ట్రోఫీ ఓ ఎడిషన్‌లో అత్యధిక స్కోరు సాధించిన కివీస్ ప్లేయర్‌గా రచిన్ రవీంద్ర. మొత్తం 263 పరుగులు చేసిన రచిన్.. 2017 టోర్నీలో విలియమ్సన్ 244 పరుగుల రికార్డును అధిగమించాడు. కాగా, ఓవరాల్‌గా ఓ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా వెస్టిండీస్ బ్యాటర్ క్రిస్ గేల్ (474 పరుగులు) టాప్‌లో ఉన్నాడు.

భారత్ తరపున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన రెండో ఆటగాడిగా కోహ్లీ. మూడు ఫార్మాట్లలో కలిపి విరాట్ 550 మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. కాగా, సచిన్ 664 మ్యాచ్‌లతో టాప్‌లో ఉన్నాడు. 538 మ్యాచ్‌లతో ధోనీ, 509 మ్యాచ్‌లతో ద్రవిడ్ మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నారు.

2



చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలోనే అత్యధిక పరుగులు సమర్పించుకొన్న రెండో భారత బౌలర్‌గా షమి. 9 ఓవర్లు బౌల్ చేసిన షమి 8.20 ఎకానమీతో 74 పరుగులిచ్చి.. ఓ వికెట్ పడగొట్టాడు. 2013 టోర్నీలో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఉమేశ్ యాదవ్ 10 ఓవర్లలో 1/75 టాప్‌లో ఉన్నాడు.

5

టోర్నీలో ఎక్కువ జీవనదానాలు లభించిన ఆటగాడిగా రచిన్. అతడు ఐదుసార్లు అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకొన్నాడు. ఫైనల్ మ్యాచ్‌లోనే షమి, అయ్యర్ రెండుసార్లు రచిన్‌కు లైఫ్ ఇచ్చారు.

దుబాయ్‌లో ధూంధాం
మనమే చాంపియన్స్

ప్రైజ్‌మనీ
భారత్‌కు - రూ. 19.4 కోట్లు
న్యూజిలాండ్‌కు - రూ. 9.7 కోట్లు



గతేడాది టీ20 వరల్డ్‌కప్.. తాజాగా మన ఖాతాలో మరో ఐసీసీ టైటిల్. ఎప్పుడో పుష్కర కాలం కింద దక్కిన చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) తిరిగి టీమిండియా గూటికి చేరింది. అజేయ ఆటతీరుతో, అన్ని విభాగాల్లోనూ అదరగొడుతూ వహ్వా అనిపించుకున్న రోహిత్ సేన మూడో సీటీని సగర్వంగా అందుకుంది. అయితే ప్రమాదకర న్యూజిలాండ్ ఫైనల్లో అంత సులువుగా పట్టు వీడలేదు. భారత స్పిన్నర్ల ధాటికి ఆ జట్టు చేసింది 251 పరుగులే. ఛేదనలో రోహిత్ ధనాధన్ ఆటతీరుతో 17 ఓవర్లలోనే భారత్ స్కోరు 100కి చేరింది. ఈ దశలో సునాయాస విజయం ఖాయమనిపించినా.. మధ్య ఓవర్లలో పోటీలోకి వచ్చిన కివీస్ ఆటను రసవత్తరంగా మార్చింది. 31-40 ఓవర్ల మధ్య 55 పరుగులే ఇచ్చి గుబులు రేపింది. కానీ శ్రేయాస్, రాహుల్ సంయమన ఆటతీరు చూపారు. చివరికి జడేజా విన్నింగ్ ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించిన భారత్.. కోట్లాది మంది అభిమానులను సంబరాల్లో ముంచెత్తింది.

4

ఈ మ్యాచ్‌లో భారత ఫీల్డర్లు నాలుగు క్యాచ్‌లను చేజార్చారు. ఓ నాకౌట్ మ్యాచ్‌లో టీమిండియా ఆటగాళ్లు ఇన్ని క్యాచ్‌లు వదిలేయడం చాలా అరుదు. రచిన్ ఇచ్చిన క్యాచ్‌లను షమి, అయ్యర్ నేలపాలు చేశారు. అయితే, అయ్యర్ క్యాచ్‌ను వదిలేసినప్పుడు స్టాండ్స్‌లో అనుష్క శర్మ రియాక్షన్ నెట్‌లో వైరల్‌గా మారింది. 38 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద మిచెల్ ఇచ్చిన క్లిష్టమైన క్యాచ్‌ను మిడ్‌వికెట్‌లో రోహిత్ అందుకోలేక పోయాడు. ఇక, ఫిలిప్స్ కొట్టిన క్యాచ్‌ను గిల్ చేజార్చాడు.

12

కెప్టెన్‌గా వన్డేల్లో రోహిత్ వరుసగా కోల్పోయిన టాస్‌లు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో హిట్‌మ్యాన్ చివరిసారి టాస్ గెలిచాడు. 1998-99 మధ్య వెస్టిండీస్ సారథి బ్రియాన్ లారా 12 సార్లు వరుసగా టాస్ ఓడాడు. ఈ రికార్డును రోహిత్ సమం చేశాడు.

కన్నీళ్లు పెట్టుకొన్న హెన్రీ..



గాయంతో ఫైనల్‌కు దూరమైన కివీస్ పేసర్ మ్యాట్ హెన్రీ కన్నీళ్లు పెట్టుకొన్నాడు. భుజం నొప్పితో అతడు బాధపడుతున్నాడు. మ్యాచ్ సమయానికి కోలుకొంటాడని భావించారు. కాగా, ఉదయం నిర్వహించిన ఫిట్‌నెస్ టెస్టులో హెన్రీ విఫలం కావడంతో అతడికి తుదిజట్టులో చోటుదక్కలేదు. దీంతో అతడు భావోద్వేగాన్ని అదుపు చేసుకోలేక పోయాడు.

రోహిత్‌కు కోహ్లీ సలహా



న్యూజిలాండ్ ఓపెనర్లు యంగ్, రచిన్ పవర్‌ప్లేలో దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. పైగా ఏడో ఓవర్‌లో రచిన్ ఇచ్చిన రిటర్న్ క్యాచ్‌ను షమి చేజార్చాడు. దీంతో రోహిత్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. షమి చేతికి బంతి బలంగా తగలడంతో అతడు నొప్పితో విలవిల్లాడు. ఈ సమయంలో ఫిజియో చికిత్స చేస్తుండగా.. రోహిత్‌తో కోహ్లీ మాట్లాడుతూ కనిపించాడు. ఫీల్డింగ్‌లో మార్పుచేర్పులు చేయాలని సూచించాడు. ఆ తర్వాతి ఓవర్‌లో వరుణ్‌ను రంగంలోకి దించగా.. అతడు యంగ్‌ను ఎల్బీ చేసి జట్టుకు బ్రేక్ ఇచ్చాడు.

వరుణ్‌కు గాయం



కీలక సమయంలో యంగ్, ఫిలిప్స్‌ను అవుట్ చేసిన వరుణ్.. కెప్టెన్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొన్నాడు. అయితే, మ్యాచ్ మధ్యలో అతడు కుంటుతూ కనిపించాడు. తన కోటా ఓవర్లు పూర్తి చేసుకొన్న తర్వాత కానీ అతడు మైదానం వీడలేదు. ఇన్నింగ్స్ బ్రేక్‌లో తన కాలు నొప్పిగా ఉందని.. పెయిన్ కిల్లర్ తీసుకోవాలని వరుణ్ చెప్పాడు.



కళ్లు చెదిరే రీతిలో గిల్ క్యాచ్‌ను పట్టేసిన గ్లెన్ ఫిలిప్స్

• ఫైనల్లో కివీస్‌పై భారత్ విజయం
• స్పిన్నర్ల విజృంభణ • సత్తా చాటిన రోహిత్

మూడోసారి ట్రోఫీ కైవసం



రోహిత్ (76)

1 చాంపియన్స్ ట్రోఫీలో ఒక్క మ్యాచ్‌లో కూడా టాస్ నెగ్గకుండా టోర్నీ విజేతగా నిలిచిన ఏకైక జట్టుగా భారత్.

దుబాయ్: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో భారత్ విజేతగా నిలిచింది. ఆశించిన రీతిలోనే నలుగురు స్పిన్నర్లు ప్రత్యర్థిని కట్టడి చేయగా.. బ్యాటింగ్‌లో కెప్టెన్ రోహిత్ (76), శ్రేయాస్ (48) నిలకడ చూపారు. దీంతో ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్లో టీమిండియా 4 వికెట్ల తేడాతో నెగ్గింది. తద్వారా 2000లో ఇదే టోర్నీ ఫైనల్లో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నట్టయ్యింది. అలాగే భారత్ ఖాతాలో ఇది మూడో (2002, 2013, 2025) చాంపియన్స్ ట్రోఫీ. మరోవైపు తాజా టోర్నీలో భారత్ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలవడం విశేషం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 251 పరుగులు చేసింది. డారిల్ మిచెల్ (63), బ్రేస్‌వెల్ (53 నాటౌట్) అర్ధసెంచరీలు సాధించగా రచిన్ (37), ఫిలిప్స్ (34) సహకారం అందించారు. కుల్దీప్, వరుణ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 49 ఓవర్లలో 6 వికెట్లకు 254 పరుగులు చేసి గెలిచింది. గిల్ (31), అక్షర్ (29) రాణించారు. స్పిన్నర్లు బ్రేస్‌వెల్, శాంట్నర్‌లకు రెండేసి వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా రోహిత్, 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా రచిన్ రవీంద్ర నిలిచారు.

శతక భాగస్వామ్యంతో..: ఓ మాదిరి ఛేదనలో భారత్‌కు మెరుపు ఆరంభమే దక్కింది. కానీ కివీస్ బౌలర్ల పోరాటంతో ఈ పోరు దాదాపు ఆఖరి ఓవర్ వరకు సాగి కాస్త ఉత్కంఠను రేకెత్తించింది. మొదటి నుంచీ రోహిత్ తన సహజశైలిలోనే చెలరేగాడు. ఈసారి చక్కగా క్రీజులో కుదురుకొని ఎక్కడా తగ్గకుండా బౌండరీలతో బెదరగొట్టాడు. గిల్‌కన్నా ఎక్కువగా తనే స్ట్రయికింగ్ తీసుకుంటూ స్కోరును పరిగెత్తించాడు. తొలి ఓవర్‌లోనే సిక్సర్ బాదిన అతడు రెండో ఓవర్‌లో రెండు ఫోర్లతో మరింత ఒత్తిడి పెంచాడు. ఇక ఎనిమిదో ఓవర్‌లో రోహిత్ 6,4,4తో 14 పరుగులు వచ్చాయి. ఈ జోరుతో హిట్‌మ్యాన్ ఫిఫ్టీ 41 బంతుల్లోనే పూర్తయ్యింది. అలాగే జట్టు స్కోరు 17 ఓవర్లలోనే 100 పరుగులకు చేరింది. కానీ ఈ దశలో కివీస్‌కు కాస్త ఊరట లభించింది. నిలకడగా సహకరిస్తున్న గిల్‌ను 19వ ఓవర్‌లో శాంట్నర్ అవుట్ చేశాడు. అతడి క్యాచ్‌ను ఎక్స్‌ట్రా కవర్‌లో ఫిలిప్స్ అమాంతం గాల్లోకి ఎగిరి ఒంటి చేత్తో పట్టేయడం హైలైట్‌గా నిలిచింది. దీంతో తొలి వికెట్‌కు 105 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. తర్వాతి ఓవర్‌లోనే విరాట్ (1)ను బ్రేస్‌వెల్ అవుట్ చేయడంతో స్టేడియం ఒక్కసారిగా మూగబోయింది. విరాట్ రివ్యూకు వెళ్లినా ఫలితం లేకపోయింది. రెండు వికెట్లు వేగంగా కోల్పోవడంతో జట్టు ఆటతీరులోనూ మార్పు కనిపించింది. బ్రేస్‌వెల్ పకడ్బందీ బంతులకు రోహిత్-శ్రేయాస్ అతి జాగ్రత్తగా ఆడాల్సి వచ్చింది. ఓ దశలో 12 బంతుల్లో ఒక్క పరుగే రావడంతో ఓపిక నశించిన రోహిత్ రచిన్ ఓవర్‌లో ముందుకొచ్చి భారీషాట్ కొట్టే యత్నంలో స్టంపౌటయ్యాడు. అటు స్పిన్నర్లు మధ్య ఓవర్లలో కట్టడి చేయడంతో సాధించాల్సిన రన్‌రేట్ ఆరు దాటింది. అక్షర్ సహాయంతో అడపాదడపా శ్రేయాస్ బౌండరీలు సాధించినా కివీస్ బౌలర్లదే పైచేయి అయ్యింది. ఈ దశలో జేమిసన్ అతడి సులువైన క్యాచ్‌ను వదిలేసినా... స్వల్ప వ్యవధిలోనే రచిన్ అద్భుత క్యాచ్‌కు శ్రేయాస్ వెనుదిరగాల్సి వచ్చింది. అప్పటికే ఈ జోడీ మధ్య నాలుగో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యం సమకూరింది. మరోవైపు బ్రేస్‌వెల్ విసిరిన చివరి ఓవర్‌లో అనవసర షాట్‌కు వెళ్లి అక్షర్ పెవిలియన్‌కు చేరాడు. ఈ దశలో మ్యాచ్ నువ్వానేనా అన్న రీతికి చేరింది. అయితే ఆఖర్లో రాహుల్‌కు జతగా హార్దిక్ (18) జోరు చూపాడు. 24 బంతుల్లో 21 రన్స్ కావాల్సిన వేళ హార్దిక్ ఓ సిక్స్, ఫోర్‌తో పరిస్థితి తేలిక చేశాడు. 48వ ఓవర్‌లో తను క్యాచ్ అవుటైనా అప్పటికే ఫలితం తేలిపోయింది. తర్వాతి ఓవర్‌లో ఓ ఫోర్‌తో జడేజా మ్యాచ్‌ను ముగించాడు.

కివీస్ జోరుకు స్పిన్నర్ల బ్రేక్: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ ఆరంభం, ముగింపుల్లో అదరగొట్టినా.. మధ్య ఓవర్లలో భారత స్పిన్నర్ల ధాటికి కుదేలైంది. లేదంటే 300 స్కోరు దాటేదే. అయితే ఫీల్డింగ్‌లో రోహిత్ సేన నాలుగు క్యాచ్‌లు జారవిడిచినా స్కోరు అతిక ష్టంగా 250కి చేరింది. చివర్లో బ్రేస్‌వెల్ వేగంగా ఆడాడు. సెమీస్‌లో శతకం సాధించి ఊపుమీదున్న ఓపెనర్ రచిన్ కళ్లుచెదిరే షాట్లతో ఆకట్టుకున్నాడు. నాలుగో ఓవర్‌లో 6,4,4.. ఐదో ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో వణికించాడు. అతడికి యంగ్ (15) సహకరించడంతో స్కోరు 7 ఓవర్లలోనే 50 దాటింది. కానీ ప్రమాదకరంగా మారిన ఈ జోడీని స్పిన్నర్ వరుణ్ విడదీశాడు. యంగ్‌ను ఎల్బీ చేయడంతో తొలి వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక తొలి పవర్‌ప్లేలో 69/1 స్కోరుతో జోరు మీదున్న కివీస్‌కు కుల్దీప్ తన వరుస ఓవర్లలో గట్టి ఝలక్ ఇచ్చాడు. ముందుగా ఓ గూగ్లీతో రచిన్‌ను క్లీన్ బౌల్డ్ చేయగా, తర్వాత వెటరన్ విలియమ్సన్ (11)ను రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్‌కు చేర్చాడు. అక్కడి నుంచి స్పిన్నర్ల హవా ఆరంభం కావడంతో కివీస్ పరుగుల కోసం చెమటోడ్చింది. 15-26 ఓవర్ల మధ్య కనీసం ఫోర్ కూడా సాధించకపోగా లాథమ్ (14) వికెట్‌ను కూడా కోల్పోయింది. చివరకు 81 బంతుల తర్వాత ఫిలిప్స్ ఓ సిక్సర్‌తో మురిపించాడు. 38వ ఓవర్‌లో ఫిలిప్స్‌ను వరుణ్ బౌల్డ్ చేయడంతో మిచెల్‌తో కలిసి ఐదో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వికెట్లు పడుతున్నా మిచెల్ మాత్రం ఓపికగా ఆడుతూ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. 46వ ఓవర్‌లో రెండు ఫోర్లు బాదాక అతను వెనుదిరిగినా, బ్రేస్‌వెల్ ధాటికి ఆఖరి ఐదు ఓవర్లలో జట్టు 50 రన్స్ రాబట్టడం విశేషం.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్: యంగ్ (ఎల్బీ) వరుణ్ 15; రచిన్ (బి) కుల్దీప్ 37; విలియమ్సన్ (సి అండ్ బి) కుల్దీప్ 11; మిచెల్ (సి) రోహిత్ (బి) షమి 63; లాథమ్ (ఎల్బీ) జడేజా 14; ఫిలిప్స్ (బి) వరుణ్ 34; బ్రేస్‌వెల్ (నాటౌట్) 53; శాంట్నర్ (కోహ్లీ/రోహిత్-రనౌట్) 8; స్మిత్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 50 ఓవర్లలో 251/7. వికెట్ల పతనం:** 1-57, 2-69, 3-75, 4-108, 5-165, 6-211, 7-239; **బౌలింగ్:** షమి 9-0-74-1; హార్దిక్ 3-0-30-0; వరుణ్ 10-0-45-2; కుల్దీప్ 10-0-40-2; అక్షర్ 8-0-29-0; జడేజా 10-0-30-1.

భారత్: రోహిత్ (స్టంప్-లాథమ్) (బి) రచిన్ 76; గిల్ (సి) ఫిలిప్స్ (బి) శాంట్నర్ 31; విరాట్ (ఎల్బీ) బ్రేస్‌వెల్ 1; శ్రేయాస్ (సి) రచిన్ (బి) శాంట్నర్ 48; అక్షర్ (సి) ఓరౌర్కీ (బి) బ్రేస్‌వెల్ 29; రాహుల్ (నాటౌట్) 34; హార్దిక్ (సి అండ్ బి) జేమిసన్ 18; జడేజా (నాటౌట్) 9; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 49 ఓవర్లలో 254/6; వికెట్ల పతనం:** 1-105, 2-106, 3-122, 4-183, 5-203, 6-241.**బౌలింగ్:** జేమిసన్ 5-0-24-1; ఓరౌర్కీ 7-0-56-0; స్మిత్ 2-0-22-0; శాంట్నర్ 10-0-46-2; రచిన్ 10-1-47-1; బ్రేస్‌వెల్ 10-1-28-2; ఫిలిప్స్ 5-0-31-0.



'టాప్'లో నిలిపే వైదొలగాలి

దూకుడుగా ఆడాలనుకుంటా..

టోర్నీ ఆసాంతం మా ఆటగాళ్లు మెరుగైన ప్రదర్శన కనబర్చారు. ఇక దూకుడుగా ఆడడం నా నైజం కాదు. కానీ అలా ఆడాలని కోరుకునే వాణ్ని. అయితే విభిన్నంగా ఆడాలంటే టీమ్ మేనేజ్‌మెంట్ ప్రోత్సాహం తప్పనిసరి. అప్పటి కోచ్ ద్రవిడ్, తాజాగా గంభీర్‌తోనూ ఇదే విషయం చర్చించి ఫలితం సాధించా. నేను వన్డేల నుంచి రిటైరవుతున్నట్టు వస్తున్న వార్తలు నిజం కావు. - కెప్టెన్ రోహిత్ శర్మ

ఇదో అద్భుత విజయం. ఆసీస్ టూర్‌లో దారుణ పరాభవం తర్వాత తిరిగి పుంజుకోవాలని గట్టిగా భావించాం. అందుకే చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ ప్రత్యేకమైంది. యువ ఆటగాళ్లతో నేనెక్కువగా మాట్లాడుతూ అనుభవాలను పంచుకుంటా. ఒకవేళ ఎవరైనా కెరీర్ నుంచి వైదొలిగితే జట్టును అత్యున్నత స్థానంలో నిలిపాకే వెళ్లాలి. ఇప్పుడు మా జట్టులో 8-10 ఏళ్ల కాలానికి ప్రపంచ క్రికెట్‌ను శాసించగల ఆటగాళ్లు ఉన్నారు. -విరాట్ కోహ్లీ

అసాధారణం.. అపూర్వం..

చాంపియన్స్ ట్రోఫీని మూడుసార్లు గెలిచిన ఏకైక జట్టుగా నిలిచిన టీమిండియాకు శుభాకాంక్షలు.
— రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

అసాధారణమైన ఆట.. అపూర్వమైన విజయం.. భారత క్రికెట్ జట్టు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ నెగ్గడం గర్వంగా ఉంది. టోర్నమెంట్ ఆద్యంతం అద్భుతంగా ఆడారు. మన ఆటగాళ్లకు అభినందనలు.
— ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

ఈ గెలుపుతో భారత జట్టులోని సభ్యులంతా కోట్లాది మంది హృదయాలను గర్వంతో ఉప్పొంగేలా చేశారు.
— కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

భారత జట్టు అమోఘమైన ఆటతీరుతో చాంపియన్‌గా నిలిచి మరోసారి సత్తా చాటింది.
— రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అద్భుతమైన విజయంతో భారత జట్టు మరోసారి మనల్ని గర్వపడేలా చేసింది. జట్టు చూపిన అంకితభావం, సాధించిన ఘనతకు అభినందనలు.
ఏపీ సీఎం చంద్రబాబు

డబ్ల్యూపీఎల్‌లో నేడు ముంబై x గుజరాత్ — రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో



రాహుల్, జడేజా విజయానందం

ఆల్‌రౌండ్ షో

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

తొమ్మిది నెలల్లో రెండో ఐసీసీ ట్రోఫీతో ప్రపంచ క్రికెట్‌లో తనకు తిరుగు లేదని భారత జట్టు నిరూపించింది. గత జూన్‌లో జరిగిన టీ20 వరల్డ్ కప్‌ను రోహిత్ సేన సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీలోనూ విజేతగా అవతరించింది. ముచ్చటగా మూడోసారి ఈ ట్రోఫీని ముద్దాడింది. గ్రూప్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై సంపూర్ణ ఆధిపత్యం చెలాయించిన భారత్.. ఫైనల్లోనూ ఆ జట్టును చిత్తు చేసింది.

ఆత్మవిశ్వాసంతో అడుగుపెట్టి..: చాంపియన్స్ ట్రోఫీకి ముందు స్వదేశంలో వన్డే సిరీస్‌లో టీమిండియా 3-0తో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. దాంతో మనోళ్లు ఇనుమడించిన ఆత్మవిశ్వాసంతో టోర్నమెంట్‌లో అడుగుపెట్టారు. తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై గెలుపొందడం ద్వారా మొదలైన రోహిత్ సేన విజయ పరంపర తుదిపోరులో న్యూజిలాండ్‌ను ఓడించే వరకు అప్రతిహతంగా సాగింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై ఆరు వికెట్ల విజయం భారతీయులందరికీ గర్వ కారణం. క్రికెట్ సమష్టి ఆట. జట్టులోని పదకొండు మంది తలోచేయి వేస్తేనే విజయం సాధించుకోగలుతారు. చాంపియన్స్ ట్రోఫీలో భారత్ అదే సమష్టి తత్వాన్ని ప్రదర్శించింది. ఒకరిద్దరు బ్యాటర్లు, ఇద్దరు ముగ్గురు బౌలర్లుకాకుండా జట్టు సభ్యులంతా సత్తా మేరకు రాణించారు. రోహిత్ నాయకత్వ బాధ్యతలను అమోఘంగా నిర్వర్తించాడు. ఎందుకు వచ్చిందో తెలియదుకానీ..చాంపియన్స్ ట్రోఫీ అనంతరం రోహిత్ వన్డేలకు వీడ్కోలు పలుకుతాడన్న వార్త బయటకొచ్చింది. కీలకమైన ఫైనల్‌కు ముందు చక్కర్లు కొట్టిన ఈ వార్త.. ఎంతలేదన్నా రోహిత్‌పై ఒత్తిడి తెచ్చేదే. కానీ ఆ ఒత్తిడిని దరిచేరనీకుండా తుదిపోరులో జట్టును రోహిత్ అద్భుతంగా నడిపించాడు. ఈ పిచ్‌పై క్లిష్టమైన లక్ష్య ఛేదనలో 76 పరుగులతో జట్టు విజయానికి రోహిత్ పునాది వేశాడు. తీవ్ర ఒత్తిడిలో టోర్నమెంట్ బరిలోకి దిగిన మరో సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పాకిస్థాన్‌పై సెంచరీ, ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లో 84 పరుగుల ఇన్నింగ్స్‌తో తానెంత విలువైన ఆటగాడినో చాటి చెప్పాడు. బౌలింగ్ విభాగంలో..పేస్ దళపతి బుమ్రా లేకపోవడంతో వెటరన్ షమిపై ఎంతో బాధ్యత నిలిచింది. గాయంతో సుదీర్ఘ విరామం అనంతరం..అందునా చాంపియన్స్ ట్రోఫీ లాంటి పెద్ద టోర్నీలో పేస్ బౌలింగ్ భారాన్ని మోయడం ఆషామాషీ కాదు. కానీ తన అనుభవాన్ని రంగరించిన షమి అంచనాలను 100 శాతం నిలబెట్టుకున్నాడు. వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, జడేజా ప్రత్యర్థులను స్పిన్ ఉచ్చులో బిగిస్తే..బౌలింగ్, బ్యాటింగ్‌తో ఆల్‌రౌండర్లుగా హార్దిక్, అక్షర్ పటేల్ జట్టు విజయాలలో తమ పాత్రను సమర్థంగా పోషించారు. వైస్-కెప్టెన్ గిల్, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్ బ్యాటర్లుగా సత్తా చాటి భవిష్యత్‌లో భారత జట్టులో తాము ఎంత కీలకమో చాటి చెప్పారు. ఇలా ప్రతి ఒక్కరూ తమ పాత్రలకు పూర్తి న్యాయం చేస్తూ టీమిండియా సిగలో మరో ఐసీసీ ట్రోఫీని చేర్చారు.

ఆ విమర్శలు తిప్పికొట్టారు..: భద్రతా కారణాలతో భారత జట్టు పాకిస్థాన్ వెళ్లకపోవడంతో..టీమిండియా మ్యాచ్‌లకు దుబాయ్‌ను ఎంపిక చేసింది ఐసీసీ. అలాంటప్పుడు భారత్ తన మ్యాచ్‌లన్నీ ఒకే చోట ఆడుతోందని, అది ఆ జట్టుకు అదనపు ప్రయోజనం చేకూరుస్తోందని ప్రస్తుత, మాజీ క్రికెటర్లు చేసిన ఆరోపణలు అర్థ రహితం. దుబాయ్ టీమిండియాకు హోమ్ గ్రౌండ్ కాదు. పైగా రోహిత్ సేన మ్యాచ్‌లన్నీ భిన్న పిచ్‌లపై ఆడింది. ఈనేపథ్యంలో 'అదనపు ప్రయోజనం' ఎక్కడిది? టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన చేసి చాంపియన్‌గా నిలవడం ద్వారా భారత జట్టు ఆ విమర్శలకు దీటైన బదులిచ్చింది.

ఐసీసీ ఫైనల్స్‌లో టీమిండియా

టోర్నీ	స్థానం	కెప్టెన్
1983 వన్డే వరల్డ్‌కప్	విజేత	కపిల్ దేవ్
2000 చాంపియన్స్ ట్రోఫీ	రన్నరప్	గంగూలీ
2002 చాంపియన్స్ ట్రోఫీ	విజేత	గంగూలీ
2003 వన్డే వరల్డ్‌కప్	రన్నరప్	గంగూలీ
2007 టీ20 వరల్డ్‌కప్	విజేత	ధోనీ
2011 వన్డే వరల్డ్‌కప్	విజేత	ధోనీ
2013 చాంపియన్స్ ట్రోఫీ	విజేత	ధోనీ
2014 టీ20 వరల్డ్ కప్	రన్నరప్	ధోనీ
2017 చాంపియన్స్ ట్రోఫీ	రన్నరప్	కోహ్లీ
2021 వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్	రన్నరప్	కోహ్లీ
2023 వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్	రన్నరప్	రోహిత్
2023 వన్డే వరల్డ్‌కప్	రన్నరప్	రోహిత్
2024 టీ20 వరల్డ్‌కప్	విజేత	రోహిత్
2025 చాంపియన్స్ ట్రోఫీ	విజేత	రోహిత్


బీటీ నాయుడు


బీద రవిచంద్ర


కావలి గ్రీష్మ

ప్రాంతాల మధ్య సమతూకం!

- ఏపీలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఇద్దరు బీసీ, ఒక ఎస్సీకి చాన్స్
- బీటీ నాయుడు, బీద రవిచంద్ర, కావలి గ్రీష్మలకు టికెట్లు

అమరావతి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల నడుమ సమతూకం పాటిస్తూ చంద్రబాబు ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలో తాజాగా ప్రకటించిన మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండింటిని బీసీలకు కేటాయించింది. ఒక స్థానాన్ని ఎస్సీ మహిళకు ఇచ్చింది. వీరిలో బీటీ నాయుడు, బీద రవిచంద్ర యాదవ్, కావలి గ్రీష్మ ఉన్నారు. ప్రస్తుతం 5 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కాగా పొత్తులో భాగంగా జనసేనకు ఒకటి, బీజేపీకి మరొకటి కేటాయించగా మూడూ స్థానాలను టీడీపీ తీసుకుంది. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల నుంచి ఒక్కొక్కరిని పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. రాయలసీమలోని కర్నూలు జిల్లాకు చెందిన బీసీ సామాజికవర్గానికి(బోయ) చెందిన బెందుల తిరుపతి నాయుడు(బీటీ నాయుడు)కి మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. రాయలసీమలో బోయలు బలమైన సామాజికవర్గంగా ఉండడం, పార్టీ పట్ల విధేయతతో వ్యవహరించడం ఆయనకు కలిసొచ్చింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన బీద రవిచంద్రయాదవ్ టీడీపీకి తొలి నుంచీ విధేయుడిగా ఉంటున్నారు. అందరినీ కలుపుకొని వెళ్లడం.. అవసరమైన సమయంలో పార్టీకి ట్రబుల్ షూటర్‌గా పనిచేయడం బీద రవిచంద్రను ఎమ్మెల్సీ రేసులో విజయం సాధించేలా చేశాయి. పార్టీలో యువరక్తాన్ని తీసుకురావాలన్న ఆలోచనతోపాటు ఎస్సీ మహిళకు ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో శ్రీకాకుళానికి చెందిన కావలి గ్రీష్మకు ఎమ్మెల్సీ అవకాశం దక్కింది. మండలిలో వైసీపీకి ఆధిక్యం ఉన్న నేపథ్యంలో వారిని దీటుగా ఎదుర్కోవాలంటే టీడీపీ నుంచి బలమైన గళాన్ని వినిపించే వారు ఉండాలన్న ఉద్దేశంతో ఫైర్ బ్రాండ్‌గా పేరు పొందిన గ్రీష్మకు అవకాశం కల్పించారు.

అన్ని కోణాల్లో ఆలోచించే అభ్యర్థుల ఎంపిక

- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



హైదరాబాద్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అన్ని కోణాల్లో ఆలోచించే ఎమ్మెల్సీ అభ్యర్థులను పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. పార్టీ అభ్యర్థులు అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్ నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 30 ఏళ్లుగా పార్టీకి నిబద్ధతతో పనిచేస్తున్న.. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన శంకర్ నాయక్‌కు అవకాశమివ్వడం ద్వారా కాంగ్రెస్ కార్యకర్తల పార్టీ అన్న భరోసా ఇచ్చిందన్నారు. 2014 నుంచి కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పని చేస్తున్న అద్దంకికి తెలంగాణ ఉద్యమకారుడిగానూ పేరుందన్నారు. కాంగ్రెస్ గొంతుకగా.. బీజేపీ, బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడారని గుర్తు చేశారు. బీసీ మహిళకు అవకాశం ఇవ్వాలనుకున్న అధిష్ఠానం.. బీసీ సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ పోరాట నేత విజయశాంతికి టికెట్ ఇచ్చిందన్నారు.కాగా, రాష్ట్రంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేయడానికి సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎంపీ అనిల్‌కుమార్, పార్టీ నేతలు తాహెర్ బిన్ హమ్దాన్, బెల్లయ్య నాయక్, వెన్నెల గద్దర్‌తో కూడిన సమన్వయ కమిటీని మహేశ్‌గౌడ్ ఏర్పాటు చేశారు

అభ్యర్థిత్వం.. అనూహ్యం

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అద్దంకి, విజయశాంతి, శంకర్‌నాయక్



హైదరాబాద్/న్యూఢిల్లీ/నల్లగొండ/ములుగు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠకు తెర పడింది. అయితే అనూహ్యంగా పార్టీ ఫైర్ బ్రాండ్ విజయశాంతి పేరు తెర పైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, సుదీర్ఘకాలంగా డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న కేతావత్ శంకర్‌నాయక్, మాజీ ఎంపీ విజయశాంతి పేర్లను పార్టీ అధిష్ఠానం ఆదివారం ప్రకటించింది. ఒక సీటును మిత్రపక్షం సీపీఐకి కేటాయించింది. ఈ మేరకు ప్రతిపాదనను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ (సంస్థాగత వ్యవహారాలు) ప్రకటించారు. మొత్తం ఐదు సీట్లకు ఎన్నికలు జరుగుతుండగా.. పార్టీకి ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి నాలుగు సీట్లలో పోటీ చేస్తున్న కాంగ్రెస్.. అందులో ఒకటి మిత్రపక్షం సీపీఐకి కేటాయించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మిత్రధర్మంలో భాగంగా ఆ పార్టీకి ఇచ్చింది. మొత్తంగా ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పెద్దపీట వేసింది. ఎస్సీ, ఎస్టీతో పాటు ఒక మహిళకు అవకాశం కల్పించింది.

రేవంత్‌రెడ్డి సూచించిన అభ్యర్థులకే!

ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా తనకు కావాల్సిన వారికి దక్కించుకున్నారని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. అద్దంకి దయాకర్‌కు సరైన సమయంలో అవకాశం కల్పిస్తామని రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రస్తావించారు. మిగిలిన ఇద్దరు అభ్యర్థుల ఎంపికలోనూ ఆయన వ్యూహాత్మకంగా వ్యవహరించారని అంటున్నారు. వాస్తవానికి అభ్యర్థుల పేర్లను ఖరారు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఉదయమే ఢిల్లీకి రావాల్సి ఉంది. అయితే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అందుబాటులో లేకపోవడంతో చివరి నిమిషంలో వారు పర్యటనను రద్దు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లోనే అభ్యర్థుల ఖరారుకు సంబంధించిన చర్చలు జరిపారు. ఆ మేరకే కాంగ్రెస్ అధిష్ఠానం అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. కాగా, ఈ దఫా ఓసీలకు సీటు కేటాయించొద్దని అధిష్ఠానం నిర్ణయించడంతో ఎమ్మెల్సీ సీటుపై ఆశలు పెట్టుకున్న ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి నిరాశ ఎదురైంది. ఆయనతోపాటు రేసులో చివరిదాకా ఉన్న ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీనియర్ నేత జెట్టి కుసుమ్ కుమార్‌కూ నిరాశే ఎదురైంది.

ఎట్టకేలకు అద్దంకికి అవకాశం..

తెలంగాణ ఏర్పడిన దగ్గర్నుంచీ అద్దంకి దయాకర్‌ను ఊరిస్తూ వస్తున్న చట్టసభల్లో ప్రాతినిథ్యం.. ఎట్టకేలకు దక్కనుంది. 2014, 2018 ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన దయాకర్ స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2023 ఎన్నికల్లో తుంగతుర్తి సీటును మందుల సామేలుకు ఇచ్చిన అధిష్ఠానం.. అద్దంకికి ఎమ్మెల్సీ సీటు హామీ ఇచ్చింది. ఇటీవల రెండు సీట్లకు జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక సీటును తొలుత అద్దంకి దయాకర్‌కు ఖరారు చేసినా.. చివరి క్షణంలో అభ్యర్థిని మార్చేసింది. ఈ దఫా ఎమ్మెల్సీ సీటు కూడా చివరి వరకూ సస్పెన్స్‌గానే నిలిచింది. ఈ సీటును మాదిగకు కేటాయించాలా.. లేక మాలకు కేటాయించాలా అన్న తర్జనభర్జన నడిచింది. ఒక దశలో మాదిగ, మాల సామాజిక వర్గాలకు చెరోటి కేటాయించాలన్న అంశంపైనా చర్చ నడిచింది. అయితే సీపీఐకి ఒక సీటు కేటాయించడంతో రెండు సామాజిక వర్గాల్లో ఒక దానికే సీటు కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదివారం సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌తో ఫోన్ ద్వారా చర్చలు జరిపిన అధిష్ఠానం.. చివరికి అద్దంకి దయాకర్ పేరును ఖరారు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతోనే అద్దంకి దయాకర్‌కు అభ్యర్థిత్వం లభించిందని పార్టీ వర్గాలు తెలిపాయి. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్‌కు చెందిన దయాకర్ అద్దంకి దయాకర్ విద్యార్థి దశ నుంచి సామాజిక, విద్యార్థి ఉద్యమాల్లో పనిచేశారు.

అధిష్ఠానం ఆశీర్వాదంతో విజయశాంతి

తొలుత వెండితెరపై, ఆ తర్వాత రాజకీయాల్లోనూ ఫైర్‌బ్రాండ్‌గా కొనసాగిన విజయశాంతి.. ఎమ్మెల్సీ అభ్యర్థుల రేసులో అనూహ్యంగా తెరపైకి వచ్చారు. ఇటీవల ఆమె అధిష్ఠానం పెద్దలను కలిసి తన అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు చేసుకున్నారు. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సోనియా సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన విజయశాంతి.. 2018 ఎన్నికల తర్వాత బీజేపీలో చేరారు. అయితే ఆ పార్టీ రాజకీయాల్లో ఇమడలేక 2023 ఎన్నికలకు ముందు తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఆమె చేరే సమయంలోనే పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ సీటు ఇస్తామని అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే హామీ ఇచ్చారు. అధిష్ఠానాన్ని కలిసిన విజయశాంతి ఈ హామీని గుర్తు చేసినట్లు చెబుతున్నారు. ఈ హామీతోపాటు బీసీ మహిళ కోటాలో విజయశాంతిని అభ్యర్థిగా అధిష్ఠానం నిర్ణయించింది. అయితే విజయశాంతిని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆమె మూలాలకు సంబంధించిన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. 2005లో తల్లి తెలంగాణపార్టీని స్థాపించిన తొలిరోజుల్లో తన స్వస్థలం ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలం రామన్నగూడెంగా విజయశాంతి ప్రకటించుకున్న సంగతి తెలిసిందే.

సామాన్య కార్యకర్త నుంచి ఎదిగిన శంకర్‌నాయక్

కేతావత్ శంకర్‌నాయక్.. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఎదిగారు. ప్రస్తుతం నల్లగొండ డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న శంకర్‌నాయక్.. జానారెడ్డికి సన్నిహితుడిగా పేరుంది. దీనికితోడు టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి ఉత్తమ్ ఆయన అభ్యర్థిత్వానికి మద్దతుగా నిలిచారు. పార్టీలో 30ఏళ్ల సీనియారిటీ ఉండడం కూడా శంకర్‌నాయక్‌కు కలిసొచ్చింది. శంకర్‌నాయక్ స్వగ్రామం నల్లగొండ జిల్లాలోని కేతావత్ తండా. డిగ్రీ పూర్తయిన వెంటనే యూత్ కాంగ్రెస్ నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించిన శంకర్‌నాయక్ రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరించేవారు. సొంత మండలం దామరచర్ల నుంచి రెండు పర్యాయాలు జడ్పీటీసీ సభ్యుడిగా, ఒక పర్యాయం ఎంపీపీగా ఎన్నికయ్యారు. మూడు పర్యాయాలూ జనరల్ స్థానం నుంచే శంకర్ నాయక్ ఎన్నికవడం రాజకీయాల్లో అప్పట్లో విశేషంగా చెప్పుకొన్నారు.

నామినేషన్ల దాఖలుకు నేడే ఆఖరు

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు తుది గడువు సోమవారం సాయంత్రం 3 గంటలకు ముగియనుంది. ఇప్పటి దాకా 4 నామినేషన్లు దాఖలైనా.. వాటిలో ఒక్కటీ ప్రధాన పార్టీల నుంచి వచ్చినవి కావు. ఈ నామినేషన్లు.. స్క్రూటినీలో తిరస్కరణకు గురికావడం లాంఛనమే. కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్ అభ్యర్థులు సోమవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. బీజేపీ, ఎంఐఎం పార్టీలకు అభ్యర్థులను ప్రతిపాదించేంత సంఖ్యలో ఎమ్మెల్యేలు లేకపోవడంతో ఆ రెండు పార్టీలూ తమ అభ్యర్థులను రంగంలోకి దింపే అవకాశం లేదు. బీజేపీ.. తన అభ్యర్థిని రంగంలోకి దించాలంటే బీఆర్ఎస్ మద్దతు తీసుకోవడం ఒక్కటే మార్గం. అయితే బీఆర్ఎస్ మద్దతు తీసుకునే ప్రసక్తే ఉండదంటూ బీజేపీ నేతలు చెబుతున్నారు. ఇక ఎంఐఎం తన అభ్యర్థిని రంగంలోకి దింపాలంటే.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో ఒకరి మద్దతు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ముగ్గురు అభ్యర్థులను ప్రకటించి, ఒకటి సీపీఐకి ఇవ్వడంతో ఆ పార్టీ మద్దతు ఎంఐఎంకు లభించే అవకాశం లేదు.

బీఆర్ఎస్ అభ్యర్థిగా దాసోజు

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీఆర్ఎస్ తరఫున.. బీసీ వర్గానికి చెందిన దాసోజు శ్రవణ్ పేరును ఆ పార్టీ అధినేత కేసీఆర్ అధికారికంగా ఖరారు చేశారు. సోమవారం ఉదయం శ్రవణ్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇటీవల జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్న బీఆర్ఎస్.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించింది. సాంకేతికంగా చూస్తే.. ఫిరాయించిన 10 మంది సభ్యులతో కలిపి ఆ పార్టీకి అసెంబ్లీలో 38 మంది ఎమ్మెల్యేలు ఉండడంతో తొలుత రెండు స్థానాలకు పోటీ చేయాలని భావించింది. ఈ మేరకు ఇద్దరి పేర్లను ప్రకటిస్తారనే ప్రచారం జరిగింది. శ్రవణ్‌తో పాటు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సత్యవతి రాథోడ్ పేర్లు వినిపించాయి. కానీ వాస్తవ బలాబలాలను బట్టి చూస్తే బీఆర్ఎస్ ఒక్క స్థానాన్ని మాత్రమే గెలుచుకునే అవకాశం ఉండడంతో ఒక్కరి పేరునే కేసీఆర్ ప్రకటించారు.

సీపీఐ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నెల్లికంటి సత్యం

ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీసీ (యాదవ) సామాజిక వర్గానికి చెందిన నేత.. నెల్లికంటి సత్యం పేరును సీపీఐ ఖరారు చేసింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయం తీసుకున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. నెల్లికంటి సత్యం సోమవారం ఉదయం 10 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ప్రస్తుతం ఆయన నల్గొండ జిల్లా సీపీఐ కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. పదవులను బాధ్యతగా భావిస్తామని చెప్పడమే కాకుండా ఆచరించే నాయకుల్లో ముందు వరసలో ఉంటారనే పేరు ఆయనకు ఉంది. సత్యం స్వస్థలం.. నల్లగొండ జిల్లాలోని ఎలగలగూడెం గ్రామం. విద్యార్థి దశ నుంచే ఆయన వామపక్ష భావజాలంతో పెనవేసుకుపోయారు. మునుగోడు నియోజకవర్గంలో ఫ్లోరోసిస్ సమస్యపైన, కాలుష్య కారక పరిస్థితులపైనా నెల్లికంటి సత్యం బలమైన ఉద్యమం చేస్తున్నారు. మునుగోడు ఉప ఎన్నికలోనూ పార్టీ బలపర్చిన అభ్యర్థి విజయానికి కృషిచేసి అధిష్ఠానం మన్ననలు పొందారు. ఉప ఎన్నిక, 2023ఎన్నికల సందర్భంగా అధిష్ఠానం.. సత్యం సేవలను గుర్తిస్తామని ఇచ్చిన హామీ మేరకు ఆయనకి ఈ అవకాశం ఇచ్చింది.

బిజినెస్

22,850 పైన బుల్లిష్

(మార్చి 10-13 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 22,633-21,965 పాయింట్ల మధ్యన కదలాడి 428 పాయింట్ల లాభంతో 22,553 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,850 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22,442, 22,321, 22,559, 22,946 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 22,850 బ్రేక్‌డౌన్ స్థాయి: 22,250

నిరోధ స్థాయిలు: 22,750, 22,850, 22,950 (22,650 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 22,350, 22,250, 22,150 (22,450 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	420
వరంగల్	412	గోదావరి	415
చిత్తూరు	443	విశాఖపట్నం	415
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	63	విజయవాడ	85
వరంగల్	63	గుంటూరు	80
కరీంనగర్	63	ఒంగోలు	80
మహబూబ్‌నగర్	63	చిత్తూరు	72
కర్నూలు	63	నెల్లూరు	77
విశాఖపట్నం	84	అనంతపురం	77
గోదావరి	85		

చతికిల పడిన ఐపీఓ మార్కెట్

మార్కెట్ కరెక్షన్‌తో ఢమాల్



న్యూఢిల్లీ: సెకండరీ మార్కెట్లో కనిపిస్తున్న దిద్దుబాటు (కరెక్షన్) ప్రభావం ప్రైమరీ మార్కెట్‌పైనా కనిపిస్తోంది. గత మూడు వారాలుగా ఒక్క ప్రధాన కంపెనీ షేరు కూడా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ కాలేదు. గత ఏడాది డిసెంబరులో 16 కంపెనీలు నిధుల సమీకరణ కోసం ఐపీఓలు జారీ చేశాయి. ఈ ఏడాది జనవరి నాటికి వీటి సంఖ్య ఐదుకు, ఫిబ్రవరికి నాలుగుకు పడిపోయాయి. ఇన్వెస్టర్లు ఆదరిస్తారో.. లేదోననే భయంతో అడ్వాన్స్‌డ్ సిస్టెక్, ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్, వినీ కార్పొరేషన్ అనే మూడు కంపెనీలు ఏకంగా తమ ఐపీఓలనే పక్కన పెట్టాయి.

వేచి చూసే వైఖరి

గత ఏడాది 91 కంపెనీలు ఐపీఓల ద్వారా దాదాపు రూ.1.6 లక్షల కోట్లు సమీకరించాయి. అయితే ఈ ఏడాది ప్రారంభం నుంచి 'బేర్' పట్టుతో మార్కెట్ ట్రెండ్ మారింది. గత రెండు నెలల్లో లిస్టయిన ఐపీఓలూ మదుపరులకు పెద్దగా లాభాలు పంచలేక పోయాయి. అయినా మార్కెట్ కోలుకుంటే రూ.67,000 కోట్ల సమీకరణ కోసం ఐపీఓలు జారీ చేసేందుకు ఇప్పటికే 45 కంపెనీలు సెబీ ఆమోదం పొందాయి. ఇంకో రూ.1.15 లక్షల కోట్ల సమీకరణ కోసం మరో 69 కంపెనీలు సెబీ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాయి. ఇందులో 45 కంపెనీలు గత రెండు నెలల్లోనే దరఖాస్తు చేయడం విశేషం. మార్కెట్ కోలుకున్నా ఐపీఓల వాల్యుయేషన్లు సముచితంగా ఉంటే తప్ప మదుపరులు ఆదరించక పోవచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

ఏప్రిల్‌లో ఏథర్ ఎనర్జీ ఐపీఓ

మరో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ఏథర్ ఎనర్జీ ఐపీఓకు సిద్ధమవుతోంది. వచ్చే నెల (ఏప్రిల్)లో ఐపీఓకు వచ్చే అవకాశం ఉందని మర్చంట్ బ్యాంకింగ్ వర్గాల సమాచారం. ఈ ఐపీఓకు నాందిగా 1.73 కోట్ల కంపల్సరీ కన్వర్టబుల్ ప్రిఫరెన్స్ షేర్లను ఒక్కోటి రూపాయి ముఖ విలువ ఉన్న 24.04 కోట్ల ఈక్విటీ షేర్లుగా మార్చేందుకు ఏథర్ ఎనర్జీ బోర్డు ఈ నెల 8న ఆమోదం తెలిపింది. ఈ ఐపీఓ కూడా రూ.5,000 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం.

టాటా క్యాపిటల్ రూ. 17,000 కోట్ల ఐపీఓ!

టాటా గ్రూప్ నుంచి మరో బాహుబలి ఐపీఓ మార్కెట్‌కు రాబోతోంది. టాటా మోటార్స్ ఫైనాన్స్ కంపెనీని తనలో విలీనం చేసుకునేందుకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం లభించిన వెంటనే ఐపీఓకు వచ్చేందుకు టాటా క్యాపిటల్ సిద్ధమవుతోంది. ఎన్‌సీఎల్‌టీ ఈ నెలాఖరులోగా ఇందుకు అనుమతిస్తుందని భావిస్తున్నారు. ఈ ఐపీఓ రూ.17,000 కోట్ల వరకు ఉంటుందని మార్కెట్ వర్గాల అంచనా.

స్టార్టప్స్‌లో వేగుచుక్క 'స్విగ్గీ'

ఆలోచనను వ్యాపారంగా మార్చిన శ్రీహర్ష మాజేటి.. రూ.1,400 కోట్ల ఆస్తులు

ఒక ఆలోచన జీవితాలనే మార్చివేస్తుంది. ఇంకా ఎందరికో దిక్సూచిలా పని చేస్తుంది. ఫుడ్ డెలివరీ యాప్ 'స్విగ్గీ' సహ వ్యవస్థాపకుడు, సీఈఓ మాజేటి శ్రీహర్ష ప్రయాణమే ఇందుకు ఉదాహరణ. 'స్విగ్గీ'తో దేశ ఫుడ్ డెలివరీ బిజినెస్ స్వరూపాన్నే మార్చివేసి రూ.1,400 కోట్ల అధిపతిగా ఎదిగిన తెలుగు బిడ్డ మాజేటి శ్రీహర్ష విశేషాలు.



మాజేటి శ్రీహర్ష. భారత ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ 'స్విగ్గీ' సహ వ్యవస్థాపకుడు, సీఈఓ. మన దేశ అంకుర సంస్థ(స్టార్టప్)ల్లో స్విగ్గీలా సూపర్ డూపర్ హిట్టయిన స్టార్టప్ మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. ఈ యాప్ మన దేశ ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఫుడ్ బిజినెస్ స్వరూప, స్వభావాల్నే మార్చివేసింది. చేతిలో మొబైల్. అందులో స్విగ్గీ యాప్ ఉంటే చాలు. మనకు ఇష్టమైన ఏ రెస్టారెంట్ నుంచైనా పసందైన ఆహారాన్ని ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి నిమిషాల్లో ఆస్వాదించవచ్చు. మన దేశ ఫుడ్ బిజినెస్ స్వరూపాన్ని ఇంతగా మార్చివేసిన మాజేటి శ్రీహర్ష జీవితం ఎందరో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు చక్కటి ప్రేరణ.

చదువు, కుటుంబ నేపథ్యం : విజయవాడలో పుట్టి పెరిగిన శ్రీహర్ష ఉన్నత మధ్య తరగతి కుటుంబానికి చెందిన వారు. తల్లి డాక్టర్. తండ్రికి విజయవాడలో చిన్న రెస్టారెంట్ ఉండేది. శ్రీహర్ష ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీకి అదే ప్రేరణ అనుకోవచ్చు. తండ్రి వ్యాపార మెళకువలు, తల్లి క్రమశిక్షణ శ్రీహర్ష ఉన్నతికి పునాదుల్లా పని చేశాయి. ఎంతో మంది ప్రముఖులను తీర్చిదిద్దిన రాజస్థాన్‌లోని పిలానీలో ఉన్న బిట్స్‌లో ఆయన తన ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఇంజనీరింగ్‌తోనే ఆగక ఫిజిక్స్‌లోనూ పీజీ పూర్తి చేశారు. అంతటితోనూ ఆగకుండా చార్టర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్ కోర్సు లెవల్ 2 కూడా పూర్తి చేశారు. తర్వాత కోల్‌కతా ఐఐఎం నుంచి పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ పూర్తి చేశారు. ఈ కోర్సులన్నీ శ్రీహర్షలో దాగి ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తకు సానపట్టాయి.

ఉద్యోగ ప్రయాణం: ఉన్నత విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత శ్రీహర్ష కొద్దికాలం లండన్‌లోని నోమురా ఇంటర్నేషనల్ కంపెనీలో పని చేశారు. కొద్ది కాలానికే ఆ జాబ్ వదిలేసి పోర్చుగల్ నుంచి గ్రీస్ వరకు, టర్కీ నుంచి కజకిస్థాన్ వరకు దాదాపు 3,500 కిలోమీటర్ల సైకిల్ జర్నీ చేసి భిన్న సంస్కృతులను ఆకళింపు చేసుకున్నారు. ఈ అనుభవం మనుషుల ప్రవర్తనను అర్థం చేసుకోవడంలో ఆయనకు ఎంతగానో తోడ్పడింది.

స్విగ్గీ ఏర్పాటు: నోమురాలో జాబ్, యూరప్‌లో చాలా దేశాలు చుట్టి వచ్చాక, ఇంకా ఎన్నాళ్లు ఇక్కడ ఉంటాం. స్వదేశానికి వెళ్లి అక్కడే మన లక్ పరీక్షించుకుందాం అనుకున్నారు. వెంటనే ఇండియా వచ్చేసి బండిల్ పేరుతో ఒక కొరియర్ సర్వీసెస్ అగ్రిగేటర్ కంపెనీ ఏర్పాటు చేశారు. అయితే సరైన టెక్నాలజీ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఆ వ్యాపారం పెద్దగా కలిసి రాలేదు. దాంతో 2014లో బండిల్ పేరును స్విగ్గీగా మార్చి ఫుడ్ డెలివరీ బిజినెస్ ప్రారంభించారు. ఇందుకోసం నందన్ రెడ్డి అనే మిత్రుడు కూడా శ్రీహర్షతో చేతులు కలిపారు. ఈ యాప్ మన దేశ ఫుడ్ డెలివరీ వ్యాపార స్వరూప, స్వభావాల్ని పూర్తిగా మార్చివేసింది. రాహుల్ జైమిని అనే టెక్నాలజీ నిపుణుడు కూడా వీరికి తోడవడంతో స్విగ్గీ దేశంలోని ప్రతి నగరం, పట్టణానికి విస్తరించింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా స్విగ్గీ వాల్యుయేషన్‌ను 1,130 కోట్ల డాలర్లు (సుమారు రూ.96,000 కోట్లు)గా లెక్కగట్టారు. ప్రస్తుతం స్విగ్గీలో శ్రీహర్ష వాటా విలువే సుమారు రూ.1,400 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

మెటల్స్, కమోడిటీస్ షేర్లపై కన్నేయండి!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడొచ్చు. అంతర్జాతీయ పరిణామాలతో పాటు దేశీయంగా ద్రవ్యోల్బణ, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు సూచీలను నడిపించే వీలుంది. సూచీలు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్లో ఉన్నాయి. డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలను బట్టి మార్కెట్ మూమెంటమ్ కొనసాగనుంది. నాణ్యమైన షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తుండటంతో కొనుగోళ్లు పెరిగే అవకాశం లేకపోలేదు. మెటల్స్, కమోడిటీస్, ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంక్ షేర్లు బుల్లిష్‌గా ఉన్నాయి. ఆటుపోట్ల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండటం మంచిది. శుక్రవారం హోలీ సందర్భంగా మార్కెట్లకు సెలవు కావటంతో ఈ వారం నాలుగు రోజులు మాత్రమే పనిచేయనున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

మజగావ్ డాక్: గత ఏడాది జూలైలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. కొన్ని నెలలుగా అక్యుములేషన్ కొనసాగుతోంది. కీలకమైన రూ.2,000 స్థాయి వద్ద మరోసారి మద్దతు తీసుకుని పెరుగుతున్నాయి. గత వారం నిఫ్టీతో పోల్చితే 9% మేరకు పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.2,338 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.2,320/2,300 వద్ద పొజిషన్ తీసుకుని రూ.2,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,285 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

కొచ్చిన్ షిప్‌యార్డ్: జీవితకాల గరిష్ఠం నుంచి 60 శాతం మేర పతనమైన ఈ కౌంటర్‌లో ప్రస్తుతం అక్యుములేషన్ ఆరంభమైంది. కీలకమైన రూ.1,200 స్థాయిలో మద్దతు లభించింది. గత శుక్రవారం రూ.1,335 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,300 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,450 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,280 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

భారత్ రసాయన్: ఈ షేరు రూ.14,500 స్థాయి నుంచి 35 శాతం మేర దిద్దుబాటుకు లోనై తర్వాత రూ.10,000 స్థాయిలో మంచి బేస్ ఏర్పడింది. గత శుక్రవారం ఈ షేరు 6 శాతం లాభంతో రూ.11,140 వద్ద క్లోజయి బేస్ బ్రేకౌట్ చేసింది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.11,000 వద్ద ప్రవేశించి రూ.11,500/11,600 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.11,000 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

రైట్స్: కొన్ని నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. దాదాపు 50 శాతం మేర పతనమైంది. అయితే గత వారం వరుసగా నాలుగు సెషన్లు లాభపడింది. గత శుక్రవారం ఈ షేరు రూ.219 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.200 వద్ద పొజిషన్ తీసుకుని రూ.225/240 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.200 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా: ఈ ఏడాది ఆరంభం నుంచి 35 శాతం మేర దిద్దుబాటుకు గురైన ఈ కౌంటర్‌లో ప్రస్తుతం 'వీ' షేప్ రికవరీ కనిపిస్తోంది. రూ.220 వద్ద మద్దతు తీసుకున్న ఈ షేరు గత వారం 6 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం రూ.239 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.260 స్థాయిలో ప్రవేశించి రూ.310 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.245 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

నిరోధం 22,700


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం మైనర్ రికవరీ సాధించి 425 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయి 22,550 వద్ద నిలకడగా క్లోజయింది. అయితే ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ బలహీనంగానే ఉంది. సుదీర్ఘ బేరిష్ ధోరణి అనంతరం ఏర్పడిన రిలీఫ్ ర్యాలీగానే దీన్ని భావించాలి. అయితే తక్షణ డౌన్‌ట్రెండ్ ముప్పు నుంచి మాత్రం బయటపడిందనిపిస్తోంది. అలాగే మిడ్ క్యాప్-100 సూచీ 1,275 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 800 పాయింట్లు లాభపడ్డాయి. గత శుక్రవారం అమెరికా మార్కెట్లో ఏర్పడిన నిలకడతో కూడిన రికవరీ వల్ల మన మార్కెట్ కూడా మరింత రికవరీ బాటలో పయనించవచ్చు. కనిష్ఠ స్థాయిల నుంచి ఆకస్మిక రికవరీ ఏర్పడినందు వల్ల ఈ వారంలో కన్సాలిడేషన్ కూడా ఏర్పడవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: స్వల్పకాలిక సానుకూలత కోస స్వల్పకాలిక నిరోధం 22,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 23,000.

బేరిష్ స్థాయిలు: ప్రధాన మద్దతు స్థాయి 22,500 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది. దిగువన ప్రధాన మద్దతు స్థాయిలు 22,200, 22,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ 48,000 వద్ద మద్దతు తీసుకున్నట్టు కనిపిస్తోంది. ప్రధాన నిరోధం 49,000. ఆ పైన మాత్రమే మరింత సానుకూల ధోరణి ప్రదర్శిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 48,000 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనతను సూచిస్తుంది.

పాటర్న్: మార్కెట్ ఇప్పటికీ 25 డిఎంఎ 22,700 కన్నా దిగువనే ఉంది. ఈ నిరోధం వద్ద కన్సాలిడేషన్ ఉండవచ్చు. సానుకూలత కోసం అదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి. మార్కెట్ గత వారం ఓవర్ సోల్డ్ స్థితిని సద్దుబాటు చేసుకుంటున్నట్టు కనిపిస్తోంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,640, 22,700
మద్దతు	22,500, 22,430

ముఖ్యమంత్రి నిర్ణయం చారిత్రాత్మకం

55 సమీకృత గురుకులాలకు 11 వేల కోట్ల కేటాయింపుపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

» నిధుల మంజూరుపై మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి, పొంగులేటి హర్షం

హైదరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 55 యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి రూ.11 వేల కోట్లు కేటాయిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 55 పాఠశాలలకు నిధులు కేటాయిస్తూ విద్యాశాఖ ద్వారా శనివారం జారీ చేయించిన ఉత్తర్వులను విలేకరులకు చూపిస్తూ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. పేద, బడుగు, బలహీన, సామాన్య, మధ్యతరగతి పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకే సమీకృత గురుకులాలు ఏర్పాటు చేస్తున్నామని భట్టి తెలిపారు. దేశంలోని ప్రముఖ ప్రైవేటు పాఠశాలలను తలదన్నేలా ఈ గురుకులాలు ఉంటాయని పేర్కొన్నారు. సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే పాఠశాలలో తరగతి గదులతోపాటు అద్భుతమైన క్రీడా ప్రాంగణం, గ్రంథాలయం, ల్యాబ్‌లు, డిజిటల్ తరగతుల నిర్వహణకు అవసరమైన వసతులు ఉంటాయని భట్టి చెప్పారు. అలాగే, ఉపాధ్యాయులకు కూడా గృహ సముదాయం ఉంటుందని వివరించారు. ఈ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడే విధంగా సిలబస్ రూపొందిస్తున్నామని వెల్లడించారు. సామాజిక మార్పు అంశంలో తమ నేత రాహుల్ గాంధీ సూచనల మేరకు సమీకృత గురుకులాల ఏర్పాటుకు ప్రజాప్రభుత్వం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుందని భట్టి వెల్లడించారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ, ప్రభుత్వం పోగేస్తున్న ప్రతి పైసాను ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపరచడానికి మాత్రమే వినియోగిస్తున్నామని భట్టి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, బలరాంనాయక్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కాగా, సమీకృత గురుకులాలకు నిధులు కేటాయింపుపై బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. తన నియోజకవర్గం హుస్నాబాద్‌లో యంగ్ ఇండియా సమీకృత గురుకులం ఏర్పాటుకు రూ.200 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు.



సమీకృత పాఠశాలలకు నిధులు కేటాయిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను చూపుతూ మాట్లాడుతున్న భట్టి



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి; చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి తదితరులు

ప్రత్యేక ప్రణాళికలతో

ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి

» హ్యామ్ రోడ్ల మంజూరులో ప్రాధాన్యం: మంత్రి కోమటిరెడ్డి

» డిప్యూటీ సీఎం భట్టి, పొంగులేటి, తుమ్మల హాజరు

హైదరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మక ప్రణాళికలతో ముందుకెళ్తున్నదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో ఆదివారం ఖమ్మం జిల్లా అభివృద్ధిపై మంత్రి కోమటిరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు అనుసరించాల్సిన విధానాలపై చర్చించినట్టు తెలిపారు.వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో తాగు, సాగునీరు, విద్యుత్ సరఫరా వంటి అంశాలతో పాటు వరికోతల సీజన్ నడుస్తుండటంతో రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలనే విషయంపై కూలంకషంగా చర్చించామన్నారు. ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) విధానంలో నిర్మించదల్చిన రోడ్ల మంజూరులో జిల్లాకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే అంశం పైనా చర్చించామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో గురుకులాలను కోళ్ల ఫారమ్‌లలో నడిపించి నిరుపేదలను అవమానించారని, కానీ తాము అంతర్జాతీయ స్థాయి పాఠశాలలు నిర్మించి విద్యలో అసమానతలు లేకుండా చేస్తున్నామని చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో వేగం పెంచాలి

» మూడ్రోజుల్లో లబ్ధిదారుల ఎంపిక: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో వేగం పెంచాలని, కలెక్టర్లు క్రియాశీలకంగా వ్యవహరించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. అక్రమాలకు తావు లేకుండా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని, రెండు, మూడ్రోజుల్లో ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం.నరేందర్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కలెక్టర్లకు సందేహాలుంటే నేరుగా తనను సంప్రదించాలని, పథకం అమల్లో మాత్రం కాలయాపన చేయకూడదన్నారు. లబ్ధిదారుల ఎంపికలో స్థానిక ఎమ్మెల్యే అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని, కలెక్టర్లే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు కూడా లబ్ధిదారులను ఎంపిక పూర్తిచేయాలని, అసంపూర్తిగా ఉన్న ఇళ్లను కాంట్రాక్టర్లు పూర్తిచేయకపోతే లబ్ధి దారులే పూర్తిచేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్‌పోర్టు, ఔటర్, ఇన్నర్ రింగురోడ్లకు భూసేకరణను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, రెవెన్యూ ఉద్యోగులు కష్టపడి పనిచేస్తూ, ప్రజలకు ఉత్తమ సేవల అందిస్తూ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి పొంగులేటి అన్నారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సంఘాల నేతలు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగులకు ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు అర్థరహితం: పొన్నం

చేర్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ అవగాహనరాహిత్యంతో చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కోటి ఓట్లలో 3.50 లక్షల ఓట్లకు సంబంధించిన ఫలితాన్ని క్రికెట్ మ్యాచ్‌తో పోల్చడమే కాకుండా కాంగ్రెస్‌కు రంజాన్ గిఫ్ట్ ఇచ్చామని మాట్లాడటం అవివేకమని అన్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలోని మల్లన్న ఆలయాన్ని ఆదివారం కుటుంబ సమేతంగా పొన్నం దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి ఓట్లు వేసిన వారు హిందువులు, ఓటేయని వారంతా పాకిస్తానీలా? అని ప్రశ్నించారు. తెలంగాణలో తామే ప్రత్యామ్నాయమని చెప్పుకుంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి చిత్తశుద్ధి ఉంటే సిద్దిపేట జిల్లా ములుగు నుంచి మంచిర్యాల వరకు 8లేన్ల రోడ్డు మంజూరు చేయించాలని, కరీంనగర్ నుంచి రోజూ తిరుపతికి రైలు సౌకర్యం కల్పించి రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇచ్చిన ప్రజలకు బహుమతిగా ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ నేతలు కమీషన్లు తీసుకుంటుందన్న విషయం అర్థరహితమని, ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తుండటం తగదన్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా సోమశిల అభివృద్ధి

» పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



సోమశిల వద్ద కృష్ణానదిలో స్పీడ్ బోట్ నడుపుతున్న మంత్రి జూపల్లి

కొల్లాపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల పర్యాటకులను ఆకర్షించేలా కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని సోమశిలను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల వద్ద కృష్ణానదిలో వాటర్ స్పోర్ట్స్‌ను మంత్రి జూపల్లి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్పీడ్ బోట్ నడిపారు. అనంతరం కృష్ణారావు మాట్లాడారు. సోమశిలకు వచ్చే పర్యాటకులకు వసతులను సమకూర్చడంతో పాటు కృష్ణానదిలో విహరించేలా వాటర్ స్పోర్ట్స్‌ను ప్రారంభించామని తెలిపారు. సోమశిల అమరగిరి, మల్లేశ్వరం, మంచాలకట్ట ప్రాంతాలకు పర్యాటకులను ఆకర్షించేలా టూరిజం అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

బీసీల గొంతు నులిమే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఖచ్చితంగా అమలు చేసి తీరుతుందని స్పష్టం చేశారు. 2011లో సోనియాగాంధీ అధ్యక్షతన జనగణన చేస్తే తర్వాత వచ్చిన బీజేపీ ప్రభుత్వం నేటివరకు తొక్కిపెట్టిందని విమర్శించారు. రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా జోడో యాత్ర అనంతరం కులగణన చేసి తీరుతామని ప్రకటించిన నేపథ్యంలో ఈ క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కత్తి ప్రధాని మోదీ మెడకు చుట్టుకుంటుందని బీజేపీ నేతల భయపడుతున్నారని అన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 17వ అఖిల భారత పద్మశాలి, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి మహాసభలు నిర్వహించారు. ఈ సభలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పద్మశాలీలు ఆత్మగౌరవానికే కాకుండా త్యాగానికి సైతం మారుపేరు అని, కొండా లక్ష్మణ్ బాపూజీయే అందుకు నిదర్శనమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీది కీలకపాత్ర అని, ఆయన ఎన్నో త్యాగాలు చేశారని కొనియాడారు. ఆసిఫాబాద్‌లో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీకి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెడుతున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే టెక్స్‌టైల్ యూనివర్సిటీకి లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమం కోసం జలదృశ్యంలోని తన ఇంటిని ఇచ్చిన గొప్ప వ్యక్తి బాపూజీ అని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆవిర్భవించామని చెప్పుకొంటున్న ఓ రాజకీయ పార్టీకి ఆనాడు నెక్లెస్ రోడ్‌లోని తన ఇల్లునే కేటాయించిన ఘనత లక్ష్మణ్ బాపూజీది అని అన్నారు. అటువంటి మహనీయుడు మరణిస్తే మాజీ సీఎం కనీసం చూడడానికి కూడా రాకపోవడం శోచనీయమన్నారు. పద్మశాలీల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో ఇక్కడే స్పష్టమవుతోందని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆలె నరేంద్ర, కొండా లక్ష్మణ్ బాపూజీల ఉద్యమం వల్ల పద్మశాలీలకు పేరొస్తుందని టైగర్ నరేంద్రను ధృతరాష్ట్ర కౌగిలిలో ఖతం చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో రైతన్నలకు ఇస్తున్న ప్రాధాన్యం నేతన్నలకు కూడా ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. తనను ఆశీర్వదించిన కుటుంబాలకు ఏదైనా చేయాలనే తపనతో ఉన్నానన్నారు. తనను గుండెల్లో పెట్టుకుంటున్న నేతన్నల రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నాసిరకం చీరలను కొనుగోలు చేయడమే కాకుండా.. డబ్బులు కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. నేతన్నలకు ప్రభుత్వ ఆర్డర్లను రద్దు చేసిన అప్రతిష్ఠ ఉండొద్దని తాను భావించానని, మహిళా సంఘాల్లోని వారికి రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. 65 లక్షల మంది మహిళలకు రెండు చొప్పున 1.30 కోట్ల చీరలు నేసే ఆర్డర్లను రాష్ట్ర నేతన్నలకు ఇస్తున్నామని ప్రకటించారు. ఇందు కోసం రూ.600కోట్లు కేటాయించినట్లు తెలిపారు. సోలాపూర్‌లో నేతన్నల కోసం నిర్మిస్తున్న మార్కండేయ భవన్‌కు తెలంగాణ ప్రభుత్వం తరఫున రూ.కోటి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఇ.అనిల్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు కామార్తపు మురళి పాల్గొన్నారు.



సీఎంను సన్మానిస్తున్న పద్మశాలీ సంఘాల నేతలు

రాహుల్ ఆశయం మేరకే..

భారత్ జోడో యాత్రలో బలహీన వర్గాల కష్టాలను రాహుల్ గాంధీ చూశారని సీఎం రేవంత్ అన్నారు. కులగణన చేసి జనాభా దామాషాలో బీసీలకు న్యాయం చేయాలనేది రాహుల్ ఆశయమని చెప్పారు. రాష్ట్రంలో లక్ష మంది ఎన్యుమరేటర్లను నియమించి పకడ్బందీగా కులగణన నిర్వహిస్తే కొంతమంది దానిని తప్పుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు ఎక్కడ జరిగిందో నిరూపించమంటే మాత్రం ఎవరూ ముందుకు రావడంలేదని, బీజేపీ, బీఆర్ఎస్ పారిపోయాయని అన్నారు. కులగణన తప్పు అంటే బడుగు, బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఎప్పటికీ రావనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు.

నేతన్నలకు సర్కారు కానుక

» రూ.లక్ష లోపు చేనేత రుణాల మాఫీ

» 5,691 మందికి ప్రయోజనం

హైదరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చేనేత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రూ.లక్ష లోపు ఉన్న చేనేత రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.33 కోట్లు మంజూరు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రూ.లక్ష లోపు రుణం ఉన్న 5,691 మందికి లబ్ధి చేకూరనుంది. 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉన్నవారి రుణాలను మాఫీ చేయనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియాకు ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వంలో చిన్నచూపునకు గురైన చేనేత రంగాన్ని ఏడాది కాలంలోనే తమ ప్రభుత్వం గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలు, సమాఖ్యలు టెస్కో నుంచే వస్త్రాలు కొనుగోలు చేసేలా ఉత్తర్వులు జారీ చేశామని పేర్కొన్నారు. వేములవాడ, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో యార్న్ డిపోను ఏర్పాటు చేసి, రూ.50 కోట్ల కార్పస్ ఫండ్‌ను కేటాయించామని వెల్లడించారు. ఇక తెలంగాణ చేనేత అభయ హస్తం పథకాన్ని అమలుచేసేందుకు కూడా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని పేర్కొన్నారు. ఈ పథకాన్ని రూ.168 కోట్లతో అమలుచేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. నేతన్న చేయూత పథకం ద్వారా రూ.290 కోట్లు విడుదల చేసి, ఇప్పటివరకు 33,133 మందికి లబ్ధి చేకూర్చామని చెప్పారు. టెస్కోకు రూ.494.48 కోట్లు విడుదల చేసి చేనేత సహకార సంఘాలు, ఎస్ఎస్ఐ, మాక్స్ సంస్థలకు పెండింగ్ బిల్లులు చెల్లించామని గుర్తుచేశారు. నేతన్నలు వృత్తిలో ఉన్నంతవరకు బీమా సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

హైదరాబాద్ దాహార్తిని తీర్చేలా..!

» గోదావరి ఫేజ్-2కు 2ప్యాకేజీల్లో టెండర్లు

» రూ.5383 కోట్ల అంచనా వ్యయం

హైదరాబాద్ సిటీ, మార్చి9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర దాహార్తిని తీర్చేలా వాటర్‌బోర్డు మరిన్ని గోదావరి జలాలను తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. 20 టీఎంసీల జలాలను మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి తీసుకొచ్చేందుకు గాను 'గోదావరి ఫేజ్-2' ప్రాజెక్టుకు టెండర్లను ఆహ్వానించింది. ఈ జలాలు నగర దాహార్తిని తీర్చడంతోపాటు.. ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను నింపుతుంది. అంతేకాదు.. మూసీనది పునరుజ్జీవానికి ఈ జలాలను వినియోగిస్తారు. గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టు పనులను హైబ్రీడ్ యాన్యూటీ మోడల్(హ్యామ్)లో రెండు ప్యాకేజీల్లో చేపట్టనున్నారు. ప్యాకేజీ-1 కింద రూ.3,330.95 కోట్లకు, ప్యాకేజీ-2 కింద రూ.2,052.72 కోట్లకు కలిపి.. మొత్తం రూ.5383 కోట్లకు టెండర్లను ఆహ్వానించారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ మహానగరానికి మొదటి దశలో ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఏడాదికి 10 టీఎంసీల గోదావరి జలాలను తీసుకొచ్చేలా వ్యవస్థను ఏర్పాటు చేశారు. నగర అవసరాల రీత్యా మరో 20 టీఎంసీలను మల్లన్న సాగర్ నుంచి తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు వాటర్‌బోర్డుకు రూ.7,360 కోట్లను మంజూరు చేస్తూ పాలనాపరమైన అనుమతులిచ్చింది. హైబ్రీడ్ యాన్యూటీ మోడల్‌లో చేపట్టే ఈ పనుల్లో వాటర్‌బోర్డు వాటా 40% కాగా, నిర్మాణ సంస్థ వాటా 60శాతంగా ఉండనుంది. ప్రాజెక్టు పూర్తయ్యేసరికి నిర్మాణ సంస్థకు 40% నిధులను వాటర్‌బోర్డు చెల్లిస్తుంది. నిర్మాణ సంస్థ భరించే 60 శాతాన్ని నిర్వహణ పదేళ్ల సమయంలో విడుతల వారీగా అందజేస్తుంది. ఇప్పటికే వాటర్‌బోర్డు వాటా 40% నిధులకు గాను హడ్కో నుంచి రుణాన్ని సేకరించారు. టెండర్ ప్రక్రియలో నిర్మాణ సంస్థతో ఒప్పందమయ్యాక ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

ప్యాకేజీలు ఇలా..

గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టులో ప్యాకేజీ-1 కింద మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు రెండు వరుసల్లో 3 వేల మిల్లీమీటర్ల డయా పైపులైన్‌ను నిర్మిస్తారు. ఈ పైపులైన సామర్థ్యం ఏడాదికి 10 టీఎంసీలుగా ఉంటుంది. నీటి తరలింపునకు మల్లన్నసాగర్ వద్ద పంప్‌హౌస్, సబ్-స్టేషన్‌ను ఏర్పాటు చేస్తారు. ఘన్‌పూర్ వద్ద రోజుకు 1,170 మిలియన్ లీటర్లను శుద్ధి చేసేలా వాటర్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్ నిర్మిస్తారు. 40మిలియన్ లీటర్ల రిజర్వాయర్, పంపుహౌస్ పనులను చేపడతారు. ప్యాకేజీ-2 కింద ఘన్‌పూర్ నుంచి ఉస్మాన్‌సాగర్, హిమయత్‌సాగర్‌కు 2,200 మిల్లీమీటర్లు, ఘన్‌పూర్ నుంచి ముత్తంగి వరకు 2,400 మిల్లీమీటర్ల డయా పైపులైన్‌ను ఏర్పాటు చేసి.. రింగ్ మెయిన్‌కు అనుసంధానం చేస్తారు. కోకాపేట గోల్డెన్ మైల్, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ తదితర ప్రాంతాల్లో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్లను నిర్మిస్తారు.

ఫ్యూచర్‌సిటీ వైపు వడివడిగా!

(మొదటిపేజీ తరువాయి)

వచ్చే 74 గ్రామ పంచాయతీల్లోని(56 రెవెన్యూ గ్రామాలు) వనరులపై ప్రభుత్వం లెక్కలు తీసింది. మొత్తం 765.28 చదరపు కిలోమీటర్ల పరిధిలోని 1.80లక్షల ఎకరాల్లో అభివృద్ధి పనుల కోసం మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నారు. ఏడు మండలాల పరిధిలోని 74 గ్రామాల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 1.30లక్షల జనాభా ఉండగా, ఇప్పుడు 2లక్షలకుపైనే ఉంటుందని అంచనా. దక్షిణాన రీజినల్ రింగురోడ్డు, ఉత్తరాన ఔటర్ రింగురోడ్డు మధ్య ఉన్న మెజారిటీ ప్రాంతమంతా అథారిటీ పరిధిలోకి వచ్చే అవకాశం ఉంది. ఫ్యూచర్‌సిటీ మధ్య భాగంలోకి ఆరు లైన్ల గ్రీన్ ఫీల్డ్‌రోడ్డు, మెట్రో రైలు నిర్మించాలని భావిస్తున్న ప్రభుత్వం భూసేకరణ పనులు మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. రావిర్యాలలోని ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ 13నుంచి ఫ్యూచర్ సిటీలోని స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ మీదుగా రీజినల్ రింగురోడ్డు వరకు 330అడుగుల వెడల్పుతో 41.5కిలోమీటర్ల పొడవైన ఆరు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం కోసం టెండర్లూ పిలిచింది. మొత్తం వెయ్యి ఎకరాలను సేకరిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.2000కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అథారిటీకి అవసరమైన సిబ్బంది నియామకాలు త్వరలో చేపట్టనుంది. అనుభవజ్ఞులైన అధికారులను నియమించి పనులు వేగంగా పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తోంది.

15వేల ఎకరాల్లో స్పెషల్ ఎకనమిక్ జోన్

హైదరాబాద్ భవిష్యత్తు రూపురేఖలు మార్చే విధంగా ఆర్థిక, వాణిజ్య రంగాలకు కేంద్రంగా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దనున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే సేకరించిన భూమికి మరికొంత కలిపి 15వేలఎకరాల్లో స్పెషల్ ఎకనమిక్ జోన్ ఏర్పాటు చేయనున్నారు. అన్ని విధాలా రవాణా సౌకర్యాలు కల్పిస్తున్న ఫ్యూచర్‌సిటీలో ఆతిథ్య రంగానికి పెద్ద పీట వేయనున్నారు. స్పెషల్ ఎకనమిక్ జోన్‌కు సమీపంలోనే రిక్రియేషన్, జనావాసాల జోన్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దేశంలోని ప్రముఖ క్లబ్‌లతో పాటు అంతర్జాతీయంగా ఆతిథ్య రంగంలో పేరున్న సంస్థలకు ఇక్కడ భూకేటాయింపులు చేయనున్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ రిక్రియేషన్ క్లబ్ నిర్వాహకులు సైతం ఇక్కడ భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. క్లబ్‌తోపాటు తమ సొసైటీకి భూమికి కేటాయిస్తే శరవేగంగా నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఇక్కడ ప్రత్యేకంగా పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఫ్యూచర్‌సిటీకి కనెక్టివిటీ కోసం బెంగుళూరు హైవే, సాగర్ హైవే మధ్య మరో రెండు రోడ్ల నిర్మాణాలపై కసరత్తు చేస్తోంది. ఈ ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న రహదారులను 60మీటర్ల మేర విస్తరించాలని భావిస్తోంది.



ఎఫ్‌సీడీఏ పరిధిలోని 74 పంచాయతీలు ఇవే

ఆమన్‌గల్: కోనాపూర్, రామనూతుల

ఇబ్రహీంపట్నం: కప్పాపహాడ్, పోచారం, తుర్కగూడ, ఎలిమినేడు, తులేకలాన్

కడ్తాల్: చేరికొండ, పల్లె చెల్కతండా, కడ్తాల్, అన్మాస్‌పల్లి, గన్గుమర్లతండా, కొండ్రిగాని బోడుతండా, మైసిగండి, గడ్డిమీద తండా, పెద్ద వేములోని బావి తండా, కర్కల్‌పహాడ్, నార్లకుంట తండా, గోవిందాయిపల్లి. గోవిందాయిపల్లి తండా, ముద్విన్, ఎక్వాయిపల్లి, మర్రిపల్లి

కందుకూరు: అన్నోజిగూడ, దెబ్బడగూడ, గుమ్మడివెల్లి, కొలాన్‌గూడ, కందుకూరు, కొత్తగూడ, గూడూరు, కొత్తూరు, లేమూరు, సరస్వతి గూడ, అగర్మియాగూడ, బైరాగిగూడ, మాదాపూర్, మీర్‌ఖాన్‌పేట, బేగరికంచె, ముచ్చెర్ల, సాయిరెడ్డిగూడ, సార్లరావులపల్లి, ఆకులమైలారం, రాచలూరు, బేగంపేట, కటికపల్లి, తిమ్మాపూర్, జబ్బరగూడ, దాసర్లపల్లి, దాసర్లపల్లి తండా

మహేశ్వరం: మెహబత్‌నగర్, తుమ్మలూరు

మంచాల: ఆగపల్లి, నోముల

యాచారం: చౌదరపల్లి, గున్‌గల్, గడ్డమల్లాయిగూడ, కొత్తపల్లి, కుర్మిద్ధ, మేడిపల్లి, నానక్‌నగర్,నందివనపర్తి, అయ్యావారిగూడ, మల్కీజ్‌గూడ, నజ్దిక్‌సింగారం,తక్కళ్లపల్లి, తక్కళ్లపల్లితండా, తట్టివనపర్తి, తులేఖుర్ధు, దామన్నగూడ, యాచారం, చింతపట్ల, తమ్మలోనిగూడ, నల్లవెల్లి, మాల్

అభినవ అన్నమయ్య గరిమెళ్ల అస్తమయం

» టీటీడీ ఆస్థాన విద్వాంసుడు బాలకృష్ణ ప్రసాద్ తుదిశ్వాస



తిరుపతి/అమరావతి/యాదగిరిగుట్ట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అభినవ అన్నమయ్యగా కీర్తినందుకున్న టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్(76) ఇక లేరు. తిరుపతి భవానీనగర్‌లో నివాసం ఉంటున్న ఆయన ఆదివారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. ప్రముఖ సంగీత విద్వాంసుడిగా ప్రఖ్యాతి గాంచిన గరిమెళ్ల 600కు పైగా అన్నమయ్య కీర్తనలను స్వరపరచి వెలుగులోకి తెచ్చారు. 6వేలకు పైగా కచేరీలు చేశారు. ప్రత్యేకించి 'వినరో భాగ్యము విష్ణుకథ', 'పిడికిట తలంబ్రాల పెండ్లికూతురు', 'జగడపు చనువుల జాజర', 'తిరువీధుల మెరసీ దేవదేవుడు', 'సందెకాడ పుట్టినట్టి ఛాయల పంట', 'ఇతడొకడే సర్వేశ్వరుడు', 'నమో నారాయణాయ నమో' వంటి కీర్తనలు ఆయనకు ఎంతో గుర్తింపు తెచ్చాయి. సంప్రదాయ కర్ణాటక సంగీతంతో పాటు లలిత సంగీతం, జానపద సంగీతంలోనూ ఆయన సుప్రసిద్ధులు. సిలికానాంధ్ర సంస్థ సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించిన లక్ష గళార్చనలో బాలకృష్ణ ప్రసాద్ ప్రధాన గాయకులు. ఆ కార్యక్రమం గిన్నిస్ బుక్‌లో నమోదైంది. 1948లో రాజమండ్రిలో కృష్ణవేణి, నరసింహారావు దంపతులకు గరిమెళ్ల జన్మించారు. ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్.జానకి ఈయనకు స్వయాన పిన్ని. మృదంగ విద్వాంసులైన తండ్రి నుంచి సంగీతం పట్ల మక్కువ పెంచుకున్నారు. 1978లో టీటీడీ అన్నమయ్య ప్రాజెక్టులో గాయకుడిగా చేరిన ఆయన 2006లో ఉద్యోగ విరమణ పొందారు. 2012 నుంచి 2023వరకూ టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా కొనసాగారు. కామకోటి పీఠం, అహోబిల మఠం ఆస్థాన సంగీత విద్వాంసులుగా సేవలు అందించారు. తెలుగునాట సంకీర్తనా యజ్ఞ ప్రక్రియను తొలిసారిగా ప్రవేశపెట్టిన ఘనత గరిమెళ్లకే దక్కుతుంది. 2020లో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుతోపాటు అపర అన్నమయ్య, అన్నమాచార్య సంకీర్తనా మహతి బిరుదులు స్వీకరించారు.

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతి పట్ల సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 1978 నుంచి 2006 వరకు టీటీడీలో ఆస్థాన గాయకుడిగా 600కు పైగా అన్నమాచార్య సంకీర్తనలకు స్వరకల్పన చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. గరిమెళ్ల మరణం సంప్రదాయ సంగీత ప్రపంచానికి తీరని లోటని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు.

యాదగిరిగుట్టతో అనుబంధం

తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట ప్రాంతంతో గరిమెళ్లకు ఎనలేని అనుబంధం ఉంది. ఈ నెల 6న నిర్వహించిన యాదగిరిగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొని అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. సింహ వాహన సేవలో పాల్గొన్నారు. ఇంతలోనే ఆయన కన్నుమూశారని తెలియడంతో సంగీతప్రియులు విచారం వ్యక్తం చేస్తున్నారు.


ప్రతిమ శ్రీనివాస్‌రావు, ఆయన కుమార్తెలతో గౌతమ్ అదానీ, కరణ్ అదానీ

హైదరాబాద్‌కు వ్యాపారవేత్త అదానీ

- 'ప్రతిమ' చైర్మన్ శ్రీనివాసరావు ఇంట్లో తేనీటి విందుకు హాజరు

హైదరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ హైదరాబాద్‌కు వచ్చారు. ఆదివారం ఇక్కడ నిర్వహించిన ఓ కార్యక్రమానికి తన కుమారుడు కరణ్ అదానీతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ నేపథ్యంలోనే అదానీని ప్రతిమ గ్రూప్ చైర్మన్ బోయినపల్లి శ్రీనివాసరావు (ప్రతిమ శ్రీనివాసరావు) ఆహ్వానించడంతో ఆయన ఇంటికెళ్లారు.. అక్కడ శ్రీనివాసరావు ఇచ్చిన తేనీటి విందును అదానీ స్వీకరించారు. అంతకుముందు ప్రతిమ శ్రీనివాసరావు కుమార్తెలు డాక్టర్లు హరిణి, హాసినీలు అదానీకి స్వాగతం పలికారు.

ఎడ్‌సెట్ షెడ్యూల్ విడుదల

- ఈ నెల 12 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 1న పరీక్షల నిర్వహణ

కేయూ క్యాంపస్, హైదరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీ ఎడ్‌సెట్-2025) షెడ్యూల్ విడుదలైంది. ఆదివారం వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్, ఎడ్‌సెట్-2025 చైర్మన్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి దీనిని విడుదల చేశారు. ఈ నెల 12 నుంచి ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులను స్వీకరిస్తామని కన్వీనర్ పేర్కొన్నారు. మే 13 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని, రూ.250 అపరాధ రుసుముతో మే 20 వరకు, రూ.500తో మే 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 1న రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామని.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జనరల్ అభ్యర్థులకు రూ.750, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ కేటగిరీ అభ్యర్థులందరికీ రూ.550 ఫీజు ఉంటుందన్నారు. పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగా జరుగుతాయని తెలిపారు. ఈసారి ఎడ్‌సెట్‌ను కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తోంది.

గ్రూప్స్ ఫలితాలను ప్రకటిస్తే ఉద్యమమే

- వర్గీకరణ చట్టం వచ్చే వరకు అన్ని ఉద్యోగ నియామకాలను నిలిపివేయాలి: మందకృష్ణ



పంజాగుట్ట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకువచ్చి అమలు చేసేవరకు అన్ని ఉద్యోగ నియామకాలను నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. గ్రూప్స్ పరీక్షల ఫలితాలను ప్రకటిస్తే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగల ఆగ్రహాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. సీఎం రేవంత్ మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మందకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చే వరకు ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దన్న డిమాండ్‌తో అన్ని మండల, జిల్లా కేంద్రాల్లో ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగాల(విద్యార్థి విభాగం మినహా) ఆధ్వర్యంలో ఆదివారం నుంచే నిరవధిక దీక్షలు ప్రారంభించామని చెప్పారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన వెంటనే.. దేశంలో అందరికన్నా ముందు తెలంగాణలో వర్గీకరణ అమలు చేస్తామని, గతంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణను వర్తింపజేస్తామని సీఎం రేవంత్ అసెంబ్లీలో ప్రకటించారంటూ గుర్తుచేశారు. ఆ మాట నిలబెట్టుకోలేకపోతే సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని ఆయన అన్నారు.

ప్రభుత్వ భూములను అమ్మొద్దు

- హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి
- మహాధర్నాలో ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్

కవాడిగూడ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను అమ్మరాదని, ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్‌ల అధ్యక్షతన ఇందిరాపార్కు వద్ద వందలాదిమంది విద్యార్థులతో కలిసి ఆయన మహాధర్నా నిర్వహించారు. ప్రభుత్వ భూములను అమ్మితే భవిష్యత్ తరాలకు ఏమీ ఉండదన్నారు. విద్యార్థుల కోసం బీసీ హాస్టళ్లు నిర్మించాలనే ఆలోచన పాలకులకు ఎందుకు రావడం లేదని కృష్ణయ్య ప్రశ్నించారు. అద్దె భవనాల్లో వసతులు సరిగా లేక విద్యార్థులు ఇబ్బందుల మధ్యే చదువుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అద్దె భవనాల బకాయిలను, విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయకపోతే విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ధర్నాలో బీసీ సంఘం నాయకులు జిల్లపల్లి అంజి, మణికంఠ, అనంతయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలంలో పాల్గొనేందుకు సింగరేణికి అనుమతివ్వాలి

- సింగరేణి గుర్తింపు కార్మిక సంఘాల నేతల డిమాండ్

హైదరాబాద్ సిటీ/పంజాగుట్ట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బొగ్గు గనుల వేలంలో పాల్గొనేందుకు సింగరేణి సంస్థకు అనుమతివ్వాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు టి.లక్ష్మీపతి గౌడ్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'సింగరేణి భవిష్యత్తు-కొత్తగనుల సాధనకు ఉమ్మడి కార్యాచరణ'పై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలోని బొగ్గు గనుల్లో నిల్వలు అంతరించిపోతున్న నేపథ్యంలో గనులు మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానం వల్ల బొగ్గు గనుల వేలం ప్రక్రియలో సింగరేణి పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వకపోవడంతో కొత్త గనులు పొందే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. సింగరేణి పరిస్థితి ఇలాగే కొనసాగితే మూతపడే అవకాశముందన్న ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో సింగరేణిలో 1.16 లక్షల మంది అధికారులు, సిబ్బంది, కార్మికులు ఉంటే ప్రస్తుతం 42వేల మందే ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వం సింగరేణిని వేలంలో పాల్గొననివ్వకపోవడంతో సమ్మెలు, ధర్నాలు చేసినా పట్టించుకోలేదని, ఈ ప్రభుత్వమైనా అవకాశం కల్పించి సంస్థను కాపాడాలన్నారు. సింగరేణిని వేలం ప్రక్రియలో పాల్గొనేందుకు అనుమతివ్వాలంటూ కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. వేలంలో బ్లాక్‌లను దక్కించుకుంటే కంపెనీకి టన్ను బొగ్గుపై రూ.198 లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ లెక్కన రాష్ట్రంలో మిగిలిన బొగ్గు బ్లాక్‌లను వేలంలో దక్కించుకుని ఏటా 25 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తే సంవత్సరానికి సుమారు రూ.500 కోట్ల లబ్ధి చేకూరుతుందని చెప్పారు.

రథ రూపులుగా యాదగిరి లక్ష్మీనారసింహుల దర్శనం

యాదాద్రి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో రాత్రి కల్యాణ లక్ష్మీనరసింహులు భక్తజనులకు రథ రూపులుగా దర్శనమిచ్చారు. పట్టువస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించిన కల్యాణ దంపతులైన లక్ష్మీనారసింహులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై అధిరోహించారు. వేదమంత్రాలతో ఆలయ అర్చకులు రథాంగ హోమం జరిపారు. వేద పారాయణాలు, మూలమంత్ర జపాల అనంతరం స్వామి వారిని భక్త జనులు రథాంగ దర్శనం చేసుకున్నారు. రథస్థ కేశవుడిని దర్శించుకుంటే పునర్జన్మ ఉండదని భక్తుల విశ్వాసం. జిల్లా కలెక్టర్ ఎం. హనుమంతరావు దంపతులు రథోత్సవాన్ని ప్రారంభించారు. ప్రధానార్చకుడు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు అర్చకబృందం ఉత్సవాలు నిర్వహించారు. ఈవో ఏ. భాస్కర్‌రావు దంపతులు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, తదితరులు రథోత్సవంలో పాల్గొన్నారు.


గుట్టపై లక్ష్మీనారసింహుల రథోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల కొరత..!

- చివరిసారి 2016లో క్యాడర్ రివ్యూ
- ప్రస్తుతం ఉన్నది 139 పోస్టులు
- సీనియర్లకు రెండు/మూడు బాధ్యతలు
- 29 పోస్టుల మంజూరుకు రాష్ట్రం విజ్ఞప్తి
- ఇటీవల ప్రధాని మోదీని కోరిన రేవంత్

నేర దర్యాప్తులో సీఐడీ పాత్ర కీలకం..! సైబర్ నేరాలు పెరుగుతుండడంతో.. కొత్తగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటైంది..! మహిళా భద్రతకు ప్రత్యేక విభాగం..! నిజానికి ఈ మూడింటికీ.. డీజీ లేదా అదనపు డీజీ స్థాయి అధికారులు నేతృత్వం వహించాలి. కానీ, తెలంగాణలో ఈ మూడు విభాగాలకు డీజీ స్థాయి అధికారి శిఖాగోయల్ నేతృత్వం వహిస్తున్నారు.

33 జిల్లాల్లో 9 కమిషనరేట్లున్నాయి. 20 జిల్లాలు ఎస్పీల నేతృత్వంలో కొనసాగుతున్నాయి. అయితే.. చాలా చోట్ల ఐపీఎస్‌ల కొరత తీవ్రంగా ఉంది.



హైదరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖను ఐపీఎస్‌ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. జిల్లాలు, కమిషనరేట్ల సంఖ్య పెరిగినా.. పెరుగుతున్న నేరాలకు అనుగుణంగా.. వాటి కట్టడికి కొత్త విభాగాలు ఏర్పాటవుతున్నా.. హైడ్రా వంటి విభాగాలకు ఐపీఎస్‌ల అవసరం ఉన్నా.. ఐపీఎస్‌ల క్యాడర్‌ను పెంచకపోవడంతో సీనియర్లపై అదనపు భారం పడుతోంది. ఒక్కొక్కరు ద్వి/త్రిపాత్రాభినయాలు చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

క్యాడర్ రివ్యూ లేక..

రాష్ట్రాలకు సంబంధించి ప్రతి ఐదేళ్లకోసారి కేంద్ర హోంశాఖ ఐపీఎస్ క్యాడర్ రివ్యూ చేయాల్సి ఉంటుంది. తెలంగాణలో చివరిసారి 2016లో క్యాడర్‌పై సమీక్ష జరిగింది. దాంతో.. ఐపీఎస్ పోస్టుల సంఖ్య 139కి పెరిగింది. అదే సంవత్సరం అక్టోబరులో కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాయి. 10 ఉమ్మడి జిల్లాలు 29గా.. ఆ తర్వాత 31గా.. ఆపైన 33గా మారాయి. హైదరాబాద్, సైబరాబాద్, వరంగల్ కమిషనరేట్లుండగా.. సైబరాబాద్ నుంచి హైదరాబాద్ తూర్పున ఉన్న రాచకొండను విడదీశారు. జనాభా, విస్తీర్ణం, నేరాల రేటు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని.. నిజామాబాద్, రామగుండం, కరీంనగర్, సిద్దిపేట, ఖమ్మం కమిషనరేట్లను ఏర్పాటు చేశారు. మిగతా 20 జిల్లాలకు ఎస్పీ స్థాయి అధికారులు నేతృత్వం వహిస్తున్నారు. కొత్త జిల్లాలు ఏర్పాటైన తొలినాళ్లలో ఐపీఎస్‌ల కొరత కారణంగా.. నాన్-క్యాడర్ ఎస్పీలు, కొన్నిచోట్ల నాన్-క్యాడర్ అదనపు ఎస్పీలకు కొన్నిచోట్ల బాధ్యతలను అప్పగించారు. కమిషనరేట్లకు డీఐజీ నుంచి డీజీ స్థాయి అధికారులు కమిషనర్లుగా ఉంటారు. వారి కింద శాంతిభద్రతలు, ట్రాఫిక్, నేరాలు, స్పెషల్‌బ్రాంచ్.. ఇలా పలు విభాగాలకు ఐపీఎస్‌లే నేతృత్వం వహించాలి. రాష్ట్రంలో ఐపీఎస్‌ల కొరతతో చాలాచోట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల ఉన్న ఐపీఎస్‌లకే అదనపు బాధ్యతలు అప్పగించారు. నిజానికి 2021లో కేంద్ర హోంశాఖ ఐపీఎస్ క్యాడర్‌ను సమీక్షించి, పోస్టులను పెంచాల్సి ఉండగా.. కొవిడ్ కల్లోలం ఇతరత్రా కారణాలతో ఆ ప్రక్రియ వాయిదా పడింది. 2021 నుంచే తెలంగాణ సర్కారు కేంద్రానికి మొరపెట్టుకుంటున్నా.. క్యాడర్ రివ్యూ దిశలో అడుగు ముందుకు పడలేదు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం గత ఏడాది జనవరి 4, జూలై 4, అక్టోబరు 7 తేదీల్లో కేంద్రానికి ఈ మేరకు లేఖలు రాయగా.. హోంమంత్రిత్వ శాఖ మార్చి 31, ఆగస్టు 13, నవంబరు 27 తేదీల్లో ప్రత్యుత్తరాలిస్తూ.. రివ్యూ నిర్వహిస్తామని పేర్కొంది. గత ఏడాది డిసెంబరు 16న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి లోక్‌సభలో ఇదే అంశంపై అడిగిన ప్రశ్నకు.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ సమాధానమిస్తూ.. ఈ విషయం తమ దృష్టిలో ఉందని, క్యాడర్ రివ్యూ చెప్పారు. ఇది జరిగి రెండు నెలలు గడిచినా.. కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో.. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి ఢిల్లీ పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని కలిసి.. 29 అదనపు ఐపీఎస్ పోస్టుల మంజూరుకు విజ్ఞప్తి చేశారు.

కొరత.. డిప్యూటేషన్లు

నిజానికి తెలంగాణలో ప్రస్తుతం 139 ఐపీఎస్ పోస్టులున్నా.. రెండు ఖాళీగా ఉన్నాయి. మిగతా 137 మందిలో తొమ్మిది మంది కేంద్ర డిప్యూటేషన్‌పై సర్వీసుల్లో ఉన్నారు. మిగతావారిలో ఎ.వి.రంగనాథ్, వి.బి.కమలాసన్‌రెడ్డి వంటి వారు 10 మంది నాన్-పోలీసింగ్ విభాగాల్లో పనిచేస్తున్నారు. అక్కడా కమలాసన్‌రెడ్డి లాంటి వారు డ్రగ్ కంట్రోల్ డీజీగా.. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. డీజీపీ జితేందర్‌తోపాటు.. సీనియర్ ఐపీఎస్‌లు కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, వి.బి.కమలాసన్‌రెడ్డి, వి.సత్యనారాయణ, మరో ఇద్దరు అధికారులు ఈ ఏడాది పదవీవిరమణ పొందనున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో, నార్కోటిక్స్ బ్యూరో వంటి విభాగాల్లో ఐపీఎస్‌ల కొరత ఉంది. డీఐజీ, ఐజీ, అదనపు డీజీ, డీజీపీ స్థాయి పోస్టులు చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. దాంతో.. కొన్ని కమిషనరేట్లలో నాన్-క్యాడర్ ఎస్పీలు ఏకంగా డీఐజీ స్థాయి బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్లలో ట్రాఫిక్, శాంతిభద్రతలు, నేరాలు, స్పెషల్ బ్రాంచ్‌లలో పూర్తిస్థాయిలో అధికారులు అందుబాటులో లేరు. ఉన్న ఐపీఎస్‌లు రెండు, అంతకంటే ఎక్కువ పోస్టుల బాధ్యతలను నిర్వర్తించాల్సి వస్తోంది. శిఖాగోయల్ ఏకంగా మూడు విభాగాలకు చీఫ్‌గా ఉన్నారు.

మహిళా సాధికారత కోసం పలు పథకాలు

- మహిళా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీలో సముచిత ప్రాధాన్యం
- సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్

హైదరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ హరీశ్ తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ భవనంలో ఆదివారం మహిళా జర్నలిస్టుల కోసం 'ఆన్‌లైన్ జర్నలిజం-మహిళా జర్నలిస్టుల పాత్ర' అనే అంశంపై ఒక రోజు శిక్షణ తరగతుల కార్యక్రమంలో హరీశ్ గౌరవ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళా జర్నలిస్టులు జర్నలిజంలోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీలో సముచిత ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిజంలో మహిళల సంఖ్య మరింత పెరగాలని, మహిళలను ప్రోత్సహించేందుకు అకాడమీ తరఫున ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఐఎస్‌బీ డేటా సైన్స్ కళాశాల ప్రొఫెసర్ మధు విశ్వనాథం 'ఆన్‌లైన్ జర్నలిజం మెలకువలు-సోషల్ మీడియా ప్రణాళిక' అనే అంశంపై, కృత్రిమ మేధస్సు నిపుణుడు రాకేష్ దుబ్బుడు 'వార్తల మూలం-విషయ పరిజ్ఞానం'పై, 'ఆన్‌లైన్ జర్నలిజం, నావిగేషన్, విశ్వసనీయత, కృత్రిమ మేధస్సు'పై హైదరాబాద్ యూనివర్సిటీ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మాధవి రవికుమార్, 'ఫేక్ న్యూస్-గందరగోళ పరిచే వార్తలు' అనే అంశంపై ఐఎస్‌బీ డేటా సైన్స్ కళాశాల అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ శ్రుతి ప్రసంగించారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వేంకటేశ్వరరావు, మహిళా జర్నలిస్టుల సమన్వయ కర్త రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

1.83 లక్షల కోట్ల పెట్టుబడులు

- పలు కంపెనీలతో సర్కారు ఎంవోయూలు
- 15 నెలల్లో సాధించిన కాంగ్రెస్ ప్రభుత్వం



హైదరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇందులో ప్రధానంగా పారిశ్రామిక రంగంలో ఎక్కువగా పెట్టుబడులు సమకూరాయని తెలిపాయి. ఈ 15 నెలల కాలంలో రూ.1.83 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదిరాయని పేర్కొన్నాయి. కాంగ్రెస్ అధికార పీఠం చేపట్టిన నాటి నుంచి సాధించిన పెట్టుబడులను సర్కారు వర్గాలు వెల్లడించాయి. 2023 డిసెంబరులో రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చింది. పాలనా పగ్గాలు చేపట్టిన నెల రోజుల్లోనే సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొన్నారు. ఆ సమావేశంలో దాదాపు రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం ఆకర్షించింది. ఆ కంపెనీల్లో ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ కూడా ఉంది. ఆ తర్వాతా రాష్ట్రానికి పెట్టుబడు లు కొనసాగాయి. ముఖ్యంగా పరిశ్రమలకు కావాల్సిన అనుమతులన్నీ సాధ్యమైనంత త్వరగా ఇవ్వాలన్న లక్ష్యంతో ప్రభు త్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంది. గతంలో పరిశ్రమల శాఖకు వచ్చిన దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండేవి. కాంగ్రెస్ అధికారంలోకి వ చ్చిన తర్వాత ఈఅంశంపై ప్రధానంగా దృష్టి పెట్టింది. పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి.. అర్హత, సామ ర్థ్యం కలిగిన కంపెనీలకు గరిష్ఠంగా 30రోజుల్లో అనుమతులివ్వడం మొదలుపెట్టింది. దీంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందు కు ఆసక్తి చూపారు. ఈ పెట్టుబడుల్లో ప్రధానంగా రెన్యువబు ల్ ఎనర్జీ రంగంలో అదానీ గ్రూప్‌తో పాటు ప్రముఖ దిగ్గజ కంపెనీలు ఎంతో ఆసక్తిని చూపిస్తున్నాయి. 2024 డిసెంబరులో రాష్ట్ర ప్రభుత్వం రెన్యువబుల్ ఎనర్జీ పాలసీని తీసుకువచ్చింది. ఆ తర్వాత ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్ పాలసీ ని కూడా ప్రకటించింది. ఇది పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా ఉండటంతో పెట్టుబడిదారులు ముందుకొచ్చారు. జాతీ య, అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు ఈ రంగంలో ఇప్పటికే భారీగా పెట్టుబడులు ప్రకటించాయి. ఈ ఏడాది జనవరిలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని అధికారుల బృందం రెండోసారి దావోస్‌కు వెళ్లింది. అక్కడ రికార్డు స్థాయిలో రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. కాగా, ఈ పెట్టుబడులతో రాష్ట్రంలో ప్రత్యక్షంగా 70వేలు, పరోక్షంగా 1.50లక్షల ఉద్యోగాలు లభిస్తాయని అధికార వర్గాలు తెలిపాయి.

తేదీ	కంపెనీ	పెట్టుబడి (రూ.కోట్లలో)	రంగం	ఉద్యోగాలు
17జనవరి 2024	గోడీ ప్రైవేటు లిమిటెడ్	రూ.8,000	ఎనర్జీ స్టోరేజ్	6000
22 జనవరి 2024	సన్ పెట్రో కెమికల్స్	రూ.45,500	రెన్యువబుల్ ఎనర్జీ	7000
22 జనవరి 2024	మెగా ఇంజనీరింగ్	రూ.15,000	రెన్యువబుల్ ఎనర్జీ	7250
22 జనవరి 2024	జేఎస్‌డబ్ల్యూ లిమిటెడ్	రూ.800	ఏరోస్పేస్, డిఫెన్స్	200
23 జనవరి 2024	అమెజాన్ వెబ్‌సర్వీస్	రూ.60,000	ఐటీ, డేటా సెంటర్స్	49550
23 జనవరి 2024	టిల్‌మ్యాన్ గ్లోబల్ హోల్డింగ్స్	రూ.15,000	ఇన్‌ఫ్రాస్ట్రక్చర్	49000
జనవరి 2025	సీటీఆర్‌ఎల్‌ఎస్-డేటాసెంటర్స్	రూ.10,000	ఐటీ, డేటా సెంటర్స్	3600
జనవరి 2025	స్కైరూట్ ఏరోస్పేస్	రూ.500	ఏరోస్పేస్	-----
8 డిసెంబరు 2024	లెన్స్‌కార్ట్	రూ.1500	తయారీ రంగం	2100
8డిసెంబరు 2024	ప్రీమియర్ ఎనర్జీస్	రూ.4300	రెన్యువబుల్ ఎనర్జీ	4300
8 డిసెంబరు 2024	ఆజాద్ ఇంజనీరింగ్	రూ.800	ఏరోస్పేస్, డిఫెన్స్	600
4 మార్చి 2025	సింగరేణి కాలరీస్	రూ.22,000	థర్మల్ ఎనర్జీ	-----

ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి పర్యావరణ అనుమతులు!

కేంద్రం ప్రాథమిక నిర్ణయం.. త్వరలో ప్రకటన

హైదరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగం నిర్మాణానికి సంబంధించి మరో అడుగు ముందుకు పడింది. ఈ రహదారికి పర్యావరణ అనుమతులు మంజూరు చేయడంతో పాటు జాతీయ రహదారి(ఎన్‌హెచ్) నంబరును కేటాయించాలని కేంద్రం ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఉత్తర భాగం రోడ్డుకు ఎన్‌హెచ్-161ఏఏ నంబరును ఖరారు చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు తెలిసింది. నంబరు ఖరారుతో పర్యావరణ అనుమతులకు కూడా మార్గం సుగమమైనట్లేనని ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. పర్యావరణ అనుమతులు ఇవ్వాలంటే ముందుగా సంబంధింత రోడ్డుకు జాతీయ రహదారి నంబరును కేటాయించాల్సి ఉంటుంది. నంబరు కేటాయించాలంటే రోడ్డు నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వినియోగ చార్జీలు, భూసేకరణ తదితర అంశాలను కేంద్రానికి నివేదించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం సేకరించే భూములకు చెల్లించాల్సిన పరిహారంలో రాష్ట్రవాటా కింద రూ.2 వేల కోట్లను ఎన్‌హెచ్‌ఏఐ వద్ద డిపాజిట్ చేసింది. దీంతో ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడ్డాయి.

మరణిస్తూ.. ముగ్గురికి ప్రాణదానం

- ఆస్టర్ రమేశ్ హాస్పిటల్‌లో మహిళ బ్రెయిన్ డెడ్
- అవయవదానానికి కుటుంబ సభ్యుల అంగీకారం
- గ్రీన్ చానల్ ద్వారా సికింద్రాబాద్‌కు ఊపిరితిత్తుల తరలింపు


కొపనాతి వరలక్ష్మి(ఫైల్)

గుంటూరు మెడికల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్ అయిన మహిళ కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించి ముగ్గురికి ప్రాణదానం చేశారు. ఏపీలోని బాపట్ల పట్టణం వివేకానంద నగర్ కాలనీకి చెందిన కొపనాతి వరలక్ష్మి(45) మెదడు సంబంధిత వ్యాధితో ఈ నెల ఆరో తేదీ గుంటూరులోని ఆస్టర్ రమేశ్ హాస్పిటల్స్‌లో చేరారు. ఈ క్రమంలో ఆదివారం ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ జీవన్‌దాన్ ప్రతినిధులు ఆమె కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. అంత బాధలోనూ కుటుంబ సభ్యులు విశాల దృక్పథంతో ఆలోచించి, తాము అంగీకరిస్తే జీవన్మరణ స్థితిలో ఉన్న ముగ్గురికి ప్రాణదానం చేసినట్టు అవుతుందని భావించి అవయవ దానానికి అంగీకరించారు. దీంతో జీవన్‌దాన్ ప్రతినిధులు ఊపిరితిత్తులను సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రికి, కాలేయం, మూత్రపిండాలను ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు కేటాయించారు. ఆదివారం రాత్రి పోలీసుల సహకారంతో గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసి ఊపిరితిత్తులను గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు, అక్కడి నుంచి విమానంలో హైదరాబాద్‌కు పంపారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ రాయపాటి మమత, క్లస్టర్ మార్కెటింగ్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి ఈ అవయవదాన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1.83 లక్షల కేసులు రాజీ

- సైబర్ నేరాల బాధితులకు రూ.43.31 కోట్లు వాపసు

హైదరాబాద్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణలో వారం రోజులు పాటు జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 1,83,182 కేసులు రాజీ అయ్యాయి. ఇందులో 4,961 సైబర్ నేరాలకు సంబంధించిన కేసులు కావడం గమనార్హం. సైబర్ నేరాల కేసుల్లో రూ.43.31కోట్ల సొమ్మును బాధితులకు రిఫండ్ చేశామని డీజీపీ జితేందర్ తెలిపారు. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 8 వరకు లోక్ అదాలత్‌ను నిర్వహించినట్టు చెప్పారు. కేసుల పరిష్కారంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లు తొలి మూడు స్థానాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. కేసుల పరిష్కారానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందికి డీజీపీ అభినందనలు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.